PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 276 | విజయవాడ, మంగళవారం 9 మే 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Tueseday 9 May 2023 | Rs

లింగ అసమానతల అంతరాన్ని తగ్గించాలి

- జి 20 సమావేశంలో మహిళా ప్రతినిధులు

● లోపలి పేజీలో..●

ఆటలకు చోటేది !

- కనుమరుగవుతున్న స్థలాలు క్రీడేతరాలకు స్టేడియాలు
- ఆధ్యాత్మిక, అధికారిక కార్యక్రమాలకే తొలి ప్రాధాన్యత



● లోపలి పేజీలో..●



మణిపూర్ నుంచి శంషాబాద్ చేరుకున్న అనంతరం విమానం వద్ద సెల్ఫీలు దిగుతున్న తెలుగు విద్యార్థులు

క్షేమంగా ఇంటికి

మణిపూర్ నుంచి స్వస్థలాలకు చేరుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మణిపూర్‌లో చిక్కుకున్న ఎపి విద్యార్థులు క్షేమంగా వారి స్వస్థలాలకు చేరుకున్నారు. మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యార్థులను వారి స్వస్థలాలకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మణిపూర్‌లోని ఎన్‌ఐటి, ట్రిపుల్ ఐటి, సెంట్రల్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయంలో 163 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు.

వీరిని రాష్ట్రానికి తరలించేందుకు పౌరవిమానయాన శాఖతో చర్చలు జరిపి రాష్ట్ర ప్రభుత్వం రెండు ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటిలో ఒక విమానం హైదరాబాద్ నుంచి, మరో విమానం కోల్‌కతా నుంచి మణిపూర్‌కు సోమవారం ఉదయం బయలుదేరి వెళ్లాయి. హైదరాబాద్ నుంచి బయలుదేరిన విమానంలో 108 మంది విద్యార్థులు, కోల్‌కతా నుంచి బయలుదేరిన విమానంలో 49 మంది విద్యార్థులను మణిపూర్ నుంచి తీసుకొచ్చారు.

మొత్తం 163 మంది విద్యార్థులను తరలించింది. హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న విద్యార్థులను వారి స్వస్థలాలకు చేరవేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. కర్నూలు, కడప, చిత్తూరు మార్గంలో ఒకటి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, విశాఖపట్నం మార్గంలో మరొకటి, రాజోలు, భీమవరం మార్గం, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు మార్గాల్లో మరో రెండు బస్సులను ఏర్పాటు చేసింది. ఆ నాలుగు బస్సుల్లో విద్యార్థులను వారి స్వస్థలాలకు చేర్చింది. మణిపూర్‌లో విమానాశ్రయానికి విద్యార్థులను తరలించేందుకు ఏర్పాట్లు చేసిన మణిపూర్ అధికారులకు ఎపి ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది.

నిర్వాసితులకు రక్షణ కల్పించాలి!

- మణిపూర్ సంక్షోభంపై సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : మణిపూర్ సంక్షోభాన్ని మానవతా వాద సమస్యగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. ఒక కమ్యూనిటీని ఎస్‌సినా లేదా ఎస్‌టినా అని నిర్ణయించే అధికారం రాష్ట్రపతికి వుంటుంది కానీ హైకోర్టుకు కాదని పేర్కొంది. "ప్రజలకు, వారి ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ఆవశ్యకత గురించి మేం మా ఆందోళనలను చాలా స్పష్టంగా చెప్పాం. పునరుద్ధరణ, స్థిరీకరణ అవసరం నెలకొంది. ఇది మానవతా సమస్య. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం పట్ల మేం చాలా తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం." అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ పేర్కొన్నారు. అల్లర్లు, ఘర్షణల్లో నిర్వాసితులైన వారికి ఆహారం, మందులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సహాయ శిబిరాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని కేంద్రం, మణిపూర్ ప్రభుత్వాలకు కోర్టు స్పష్టం చేసింది. వైద్య సంరక్షణ అవసరమైన వారిని వెంటనే సైనిక ఆస్పత్రులకు లేదా తగిన ఇతర ఆస్పత్రులకు తరలించాలని కోరింది. నిర్వాసితులైన వారు తిరిగి వెనుకకు వచ్చేందుకు హామీ కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని బెంచ్ ప్రభుత్వాన్ని కోరింది. నిర్వాసితులైన వారి పునరావాసానికి అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని, ఆరాధనా స్థలాల పరిరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని కోర్టు పేర్కొంది. మార్చి 27కి మణిపూర్ హైకోర్టు న్యాయమూర్తి ఇచ్చిన ఆదేశాలకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని కేంద్రం, మణిపూర్ ప్రభుత్వాల తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనను కోర్టు రికార్డు చేసింది. హైకోర్టు ఆదేశాలు మణిపూర్‌లో ఘర్షణలకు దారితీశాయని సుప్రీంకోర్టులో మణిపూర్ అసెంబ్లీ కొండ ప్రాంతాల కమిటీ (హెచ్‌ఎసి) చైర్మన్ గంగమెయి వేసిన పిటిషన్ ఆరోపించింది. గంగమెయి, మణిపూర్ ట్రైబల్ ఫోరం ఇద్దరి తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది కొలిన్ గొంజాల్వెస్ మాట్లాడుతూ, తక్షణమే నిర్వాసితులకు రక్షణ కల్పించాలని అన్నారు

ప్రజా సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమాలు

వామపక్షాలు, భావసారూప్య పార్టీలతో సంప్రదింపులు

- సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశంలో బివి రాఘవులు



రాష్ట్ర కమిటీ సమావేశ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న బివి రాఘవులు, ఎంఎ బేబి, శ్రీనివాసరావు, వైవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలు, అధిక ధరలు, ఇతర జీవనోపాధికి సంబంధించిన అంశాలపై దేశవ్యాపిత ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఎం నిర్ణయించింది. వామపక్షాలు, ఇతర భావసారూప్య పార్టీలతో చర్చించి, నిర్దిష్ట కార్యక్రమాల్ని రూపొందిస్తామని పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన కమిటీ సమావేశం సోమవారం ప్రారంభమైంది. మంగళవారం కూడా కొనసాగుతుంది. ఈ సమావేశంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను, పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయాలను రాఘవులు వివరించారు. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం నానాటికీ తీవ్రమవుతున్నదని ప్రపంచ వాణిజ్యం ఒడిదుడుకులకు గురవుతోందని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధంతో పరిస్థితి ఇంకా దిగజారుతోందన్నారు. రష్యా నుండి చౌకగా కొంటున్న ముడి చమురును శుద్ధి చేసి దేశీయంగానే చౌకగా అమ్మించి ప్రజలకు ఉపశమనం కలిగించే నిర్ణయం కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకోలేదని తెలిపారు. ఈ చమురును విదేశాలకు అమ్మి విపరీతంగా లాభాలు పొందడానికి అనుమతిస్తూ కార్పొరేట్ల సేవలో తరించిపోతోందని విమర్శించారు. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రభుత్వాలు పొదుపు చర్యల పేరిట సంక్షేమానికి, వేతనాలకు, సర్వీసు నిబంధనలకు కోతలు పెట్టడంతో పెద్దఎత్తున పోరాటాలు వెల్లువెత్తుతున్నాయని వివరించారు. భారత జిడిపి వృద్ధి రేటు అంచనాలు అంతకంతకూ తగ్గిపోతున్నాయని, ఒడిదుడుకులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ధరలు, నిరుద్యోగిత పెరుగుదల ఆందోళనకరంగా ఉందని, ఇంధనం, ఆహార పదార్థాల ధరలు అంతకంతకూ అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రామికుల నిజవేతనాలు కుదించుకుపోవడం, ద్రవ్యోల్బణ పెరుగుదల ప్రజలు ముఖ్యంగా సామాన్యులు నలిగిపోతున్నారని పేర్కొన్నారు. పేదలకు ఎంతోకొంత ఊరటగా ఉన్న ఉపాధి హామీకి మోడీ సర్కారు కోతలు, షరతులు పెట్టడంతో కష్టాలు మరింత పెరిగిపోతున్నాయని తెలిపారు. మోడీ సర్కారు అండదండలతో అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ల సంపద నానాటికీ పెరిగిపోతోందని పేర్కొన్నారు. బాధల్లో ఉన్న ప్రజలు ఐక్యంగా ఉద్యమాలు, పోరాటాలు చేయకుండా వారి మధ్య విద్వేషాన్ని అధికార పార్టీ – సంఘ్ పరివార్ కూటమి సృష్టిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర భారతంలోనూ, కర్ణాటక, మణిపూర్‌లో తాజా పరిణామాలను వివరించారు. రాజకీయ ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురి చేసేందుకు ఇడి, సిబిఐ, ఎన్‌ఐఎ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థల్ని మోడీ సర్కారు ప్రయోగిస్తోందని విమర్శించారు. న్యాయవ్యవస్థపై దాడి, తదితర చర్యల ద్వారా నిరంకుశ పోకడలు మరింత పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న కోరిక నానాటికీ అధికమవుతోందని, దాన్ని సాకారం చేయడానికి త్రిముఖ వ్యూహం కావాలని చెప్పారు. జాతీయ స్థాయిలో ప్రభావితం చేయగల అంశాలపై వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు ఉమ్మడిగా ఐక్య గళాన్ని వినిపించాలని కోరారు. ఎన్నికలు వచ్చినప్పుడు బిజెపి వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా పూలింగ్ చేసుకోవాలని తెలిపారు. ప్రజల జీవనోపాధి సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందని వివరించారు. ఈ అవగాహనతో రాష్ట్రంలో ఉద్యమ కార్యాచరణను పార్టీ రాష్ట్ర కమిటీ రూపొందించాలని కోరారు.

సిఐకి ఎంత ధైర్యం!

- హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

ఓ వ్యక్తిని అక్రమంగా నిర్బంధంపై కోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనరుగా ఉన్న న్యాయవాదిని, ఆయన వెంట వెళ్లిన కోర్టు స్టాఫ్, ఇతరులపై హిందూపురం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ చేయిచేసుకోవడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఎంత ధైర్యం ఉంటే కొడతారని ప్రశ్నించింది. ఇది కచ్చితంగా న్యాయ ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని అభిప్రాయ పడింది. కోర్టు ధిక్కారమే అవుతుందని పేర్కొంది. అందుకే సిఐ ఇస్మాయిల్‌పై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణకు ఇస్మాయిల్ స్వయంగా హాజరుకావాలని చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డిజిపి, అనంతపురం రేంజ్ డిఐజి, జిల్లా ఎస్‌పికి నోటీసులిచ్చింది. విచారణను జూన్ 14కు వాయిదా వేసింది. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన అడ్వకేట్ కమిషనరు ఇతరులపై ఇస్మాయిల్ చేయిచేసుకున్నారని జిల్లా జడ్జి ఇచ్చిన నివేదికను హైకోర్టు సుమోటో పిల్‌గా పరిగణించి విచారణ చేపట్టింది. ఇస్మాయిల్‌పై చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం చెప్పింది. విఆర్‌కు పంపినట్లు పేర్కొంది.

మత్స్యకారుల పొట్టగొడుతున్న కేంద్రం

20 వేల కుటుంబాల ఉపాధి దెబ్బతీసేలా విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో భారీ డైవర్షన్ ప్లాన్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఫిషింగ్ హార్బర్‌పై ఏళ్ల తరబడి ఆధారపడిన 20 వేల మత్స్యకార కుటుంబాల జీవనాన్ని దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం పొగబెడుతోంది. వైజాగ్ పోర్టు 1933లో రాక ముందు నుంచీ ఈ చేపల రేవుపైనే ఆధారపడి మత్స్యకారులు జీవిస్తున్నారు. కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రయివేట్ సంస్థ అయిన వైజాగ్ కంటైనర్ టర్మినల్ కార్పొరేషన్ (విసిటిపిఎల్) కోసం వైజాగ్ పోర్టుపై ఒత్తిడి తెచ్చి మత్స్యకారుల ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా లోపాయికారిగా చర్యలు చేపట్టింది. గతంలో 30 ఎకరాలకుపైగా సముద్రంలోని హార్బర్ ప్రాంతంలో విసిటిపిఎల్ జెట్టీ ఏర్పాటుకు కేంద్రం అనుమతులిచ్చింది. తాజాగా హార్బర్ ఆధునికీకరణ, జెట్టీల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీ, డయింగ్ ప్లాట్‌ఫారాల కోసం ఉద్దేశించిన రూ.152 కోట్ల నిధులను పోర్టు ద్వారా డైవర్షన్ చేయిస్తోంది. విసిటిపిఎల్ పూర్తిగా హార్బర్‌ను ఆక్రమించేస్తోందంటూ మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హార్బర్‌కు, మత్స్యకారులకు మధ్య విసిటిపిఎల్ గతంలోనే గోడ కట్టేసింది. 'మా ప్రాణాలు పోయినా మేం ఇక్కడ నుంచి కదలం. పోర్టు కాదు... ఎవరు చెప్పినా మా బతుకులు ఇక్కడే' అంటూ మత్స్యకార మహిళలు మైలపల్లి పెంటమ్మ, సూరాడ చిట్టెమ్మ 'ప్రజాశక్తి' ఎదుట వాపోయారు.



హార్బర్‌లో చేపలు అమ్ముతున్న మత్స్యకార మహిళ

హార్బర్‌లో ఏం జరుగుతోంది ?

ఫిషింగ్ హార్బర్‌లో రూ.152 కోట్ల నిధులను మత్స్యకారుల అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయాలి. కానీ, కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్)ను విశాఖ పోర్టు మార్చేసింది. మత్స్యకారుల ప్రయోజనాలను పక్కనబెట్టి సరికొత్త గదులను టూరిస్టు ఆదాయం లక్ష్యంతో కట్టేందుకు సిద్ధమైంది. ఇక్కడ హార్బర్‌లో ఫింగర్ జెట్టీ నిర్మించాలనేది మత్స్యకారుల ప్రధాన డిమాండ్. హార్బర్‌లోని ఒకటో నెంబరు జెట్టీ నుంచి 9వ నెంబరు వరకూ రోడ్డుకు ఆనుకుని 500 మీటర్ల జెట్టీ నిర్మించాలని ఏళ్ల తరబడి వారు కోరుతున్నారు. కానీ, నీటిపై తేలియాడే జెట్టీలు (ఫ్లోటింగ్ జెట్టీలు)ను నిర్మించి మత్స్యకారులను కేంద్ర ప్రభుత్వం, వైజాగ్ పోర్టు పొమ్మనలేక పొగబెడుతున్నాయన్నది తాజా పరిస్థితుల నేపథ్యంలో స్పష్టమవుతోంది.

హార్బర్‌లో ఇబ్బడిముబ్బడిగా పెరిగిన బోట్లు

హార్బర్‌లో 890 మెకనైజ్డ్ బోట్లు, వెయ్యి మోటరైజ్డ్ బోట్లు, 200 సంప్రదాయ బోట్లు ఉన్నాయి. ఇతర జిల్లాల నుంచి వచ్చే మరో 500 బోట్లు విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో నిత్యం సముద్రం మీద రాకపోకలు సాగిస్తున్నాయి. వైజాగ్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరిగినప్పుడు 40 బోట్లే ఉండేవి. పోర్టు నిర్మాణమప్పుడు భవిష్యత్తు అవసరాల కోసం 250 బోట్లకు సరిపడా హార్బర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ 11 జెట్టీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రూ.152 కోట్లు జెట్టీల నిర్మాణం కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉన్నా, ఆ పని చేయడం లేదు. ప్రస్తుతం 2,600 బోట్లకుపైగా ఇరుకు ఇరుకుగా సర్దుకుపోవాల్సి వస్తోంది. బోట్ల సంఖ్య పెరుగుతున్నా ఫింగర్ జెట్టీల నిర్మాణం సాగడం లేదు. విసిటిపిఎల్ బెర్తుకు అనుగుణంగా ఫ్లోటింగ్ జెట్టీలు, వైజాగ్ పోర్టు ఆధీనంలోకి ఫిషింగ్ హార్బర్ రావాలన్నది కేంద్ర విధానం. కానీ, ఫింగర్ జెట్టీల నిర్మాణ డిమాండ్ మత్స్యకారుల నుంచి ఉంది. వందమంది ఒకేసారి వెళ్లినా ఫింగర్ జెట్టీ

మిగతా 2లో

ఉద్యోగులపై నిఘా!

- క్రమశిక్షణ పేరిట కట్టడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

క్రమశిక్షణ, నిబంధనల పేరుతో ప్రభుత్వం ఉద్యోగులను కట్టడి చేయనుంది. ఇందుకోసం ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై నిఘాను తీవ్రతరం చేయనుంది. ఇందులో భాగంగా పబ్లిక్ సర్వీసెస్ ఉద్యోగులకు సంబంధించిన డిసిప్లినరీ కేసుల వివరాలను డేటాబేస్ (డిసిడిబి) సమాచారాన్ని ఎపిసిఎఫ్ఎస్ ద్వారా https//herb.apcfss.inలో కేసుల డేటాబేస్ సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు (డిడిఒఎస్)ను ఆదేశించింది. గత కొంతకాలంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు ఉద్యోగ సంఘాల జెఎసిలు ఇప్పటికే కార్యక్రమాల షెడ్యూల్ ప్రకటించగా, మరికొన్ని ఉద్యోగ సంఘాలు ఆందోళన బాట పట్టనున్నాయి. ఉద్యోగుల్లో ప్రభుత్వ వ్యతిరేకత పెరిగిపోతుందని గ్రహించిన ప్రభుత్వం క్రమశిక్షణ పేరుతో ఉద్యోగులను కట్టడి చేసేందుకు తాజా ఉత్తర్వులను తెరమీదకు తెచ్చిందని ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. ఉత్తర్వులపై 04.05.23 తేదీ ఉన్నప్పటికీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.

రెగ్యులర్, పెన్షనర్స్ ఉద్యోగులకు సంబందించి...

రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి 14 అంశాలను ప్రొఫార్మాలో పూర్తి చేయాల్సి ఉండగా, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు 18 అంశాలను పొందుపరచాల్సి ఉంటుంది. ఇందులో ప్రధానంగా ఎంప్లాయి ఐడి నెంబరు, ఎంప్లాయి పేరు. హోదా, ఉద్యోగి సస్పెండ్ అయ్యారా? లేదా? సస్పెండ్ అయ్యి ఉంటే ఎసిబి/విజిలెన్స్/డిపార్టుమెంట్/ ఇతర కారణాలు అనేవి ప్రత్యేకంగా పేర్కొనాలి. వీటితో ఆదాయానికి మించి

మిగతా 2లో

ఇదీ షెడ్యూల్..

ఉద్యోగుల వివరాలు నమోదుకు సంబంధించిన షెడ్యూల్డ్ వివరాలను ఆర్థికశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

- ఈ నెల 8న ఎస్‌టిఒ/ఎటిఒ/ స్టాఫ్ ఆఫ్ డిటిఅండ్ ఎఓ/పిఎఓ, డిడిఓలకు ఒకరోజు శిక్షణ
- 10న ఫైళ్ల వెరిఫికేషన్, చెక్‌లిస్ట్‌ను పరిశీలించడం
- 11న సిఎఫ్‌ఎమ్‌ఎస్ ఆల్ డిడిఓలు, 12న డేటా స్క్రూట్నీని ఎస్‌టిఓ/ఎటిఓ/స్టాఫ్ ఆఫ్ డిటిఅండ్ఎఓ/ పిఎఓ/పిఎఓ, 15న వెరిఫికేషన్ అనంతరం డేటా అప్‌లోడింగ్ చేసి డాష్‌బోర్డులో ఉద్యోగుల వివరాలు కనబడేలా చర్యలు

నేటి నుంచి 'జగనన్నకు చెబుదాం'

- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అందిస్తోన్న సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సంతృప్త స్థాయిలో పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్నకు చెబుదాం' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సిఎం మంగళవారం ప్రారంభించనున్నారు. ప్రజలు నేరుగా తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు గానూ టోల్ ఫ్రీ నెంబరు 1902 అందుబాటులో ఉంటుంది. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యా పరిష్కారం అయ్యే వరకు ఆ వినతికి ట్రాకింగ్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ప్రతి సోమవారం ఇచ్చే స్పందన అర్జీల తరహాలో ఇప్పుడు నేరుగా ముఖ్యమంత్రికి చెప్పుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి సమస్య వెళ్తుండటంతో స్పందన కంటే త్వరగా పరిష్కారం చూపే వేదికగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం మారనుంది. ఇందుకోసం సిఎం నేతృత్వంలోని ఒక ప్రత్యేక టీమ్ ఏర్పాటు కానుంది. ఈ టీమ్ వివిధ ప్రభుత్వ శాఖాధిపతులతో అనుసంధానమవుతుంది. జగనన్నకు చెబుదాంలో ఎలాంటి వినతి వచ్చినా వెంటనే స్పందించేలా ఈ అనుసంధాన కార్యక్రమాన్ని కిందస్థాయి వరకు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంతో ప్రజలకు నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం వస్తుంది.

కార్యక్రమం ఇలా..

- ప్రజలు సమస్యను చెప్పేందుకు 1902 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయాలి
- ఫిర్యాదును నమోదు చేసి ఐడి నెంబరును కేటాయిస్తారు
- ఫిర్యాదు స్టేటస్‌పై ఎస్‌ఎంఎస్ ద్వారా అప్‌డేట్
- సమస్య పరిష్కారం అయ్యాక ప్రభుత్వ సేవలపై ప్రజలు తమ అభిప్రాయాన్ని పంచుకునేలా ఏర్పాటు
- టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయడంతోపాటు వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో కూడా సమస్యను విన్నవించేలా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రూపొందించారు.
- ఫిర్యాదులను www.jkc.ap.gov.inలోనూ పంపవచ్చు.
- ఆండ్రాయిడ్ ఫోన్‌లలో జగనన్నకు చెబుదాం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులోంచి కూడా ముఖ్యమంత్రికి సమస్యను విన్నవించవచ్చు.

శరత్ చంద్రారెడ్డికి బెయిల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన అరబిందో డైరెక్టరు పెనక శరత్ చంద్రారెడ్డికి పూర్తిస్థాయి బెయిల్ మంజూరైంది. ప్రస్తుతం ఆయన మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. తన భార్య అనారోగ్య కారణాల దృష్ట్యా శరత్ చంద్రారెడ్డి విజ్ఞప్తి మేరకు ఢిల్లీ హైకోర్టు పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శరత్ చంద్రారెడ్డికి ఢిల్లీ రౌస్ అవెన్యూలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం ఇటీవల నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తీహార్ జైలులో ఉన్న శరత్ చంద్రారెడ్డి.. తన భార్య అనారోగ్యం దృష్ట్యా ఆమెను చూసుకోవాలని, అందుకు ఆరు వారాలు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ప్రత్యేక జడ్జి ఎంకె నాగ్ పాల్ దీనిపై విచారణ చేపట్టి నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. తన నాయనమ్మ అంత్యక్రియల నిమిత్తం బెయిల్ కోరుతూ శరత్ చంద్రారెడ్డి జనవరి ఆఖరి వారంలో పిటిషన్ దాఖలు చేయగా, నాడు ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు 14 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తాజాగా శరత్ చంద్రారెడ్డికి పూర్తి స్థాయి బెయిల్ మంజూరు చేసింది.

బాగేపల్లి సిపిఎం అభ్యర్థి

అనిల్ హత్యకు కుట్ర!

సిపిఎం నాయకుల అప్రమత్తతతో తప్పిన గండం ● పోలీసుల అదుపులో 19 మంది

ప్రజాశక్తి- బాగేపల్లి

కర్ణాటక ఎన్నికల్లో బాగేపల్లి అసెంబ్లీ స్థానం నుంచి సిపిఎం తరుపున పోటీ చేస్తోన్న డాక్టర్ అనిల్‌కుమార్ హత్యకు కుట్ర జరిగింది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఆయన నివాసంలోకి సుమారు 30 మంది చొరబడి హతమార్చే ప్రయత్నం చేసినట్టు సిపిఎం నాయకులు తెలిపారు. ఎన్నికల ప్రచారం ముగించుకుని వచ్చాక నివాసంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరుగుతున్న సమయంలో ఆయన నివాసముంటున్న ఇంటి తొలి అంతస్తులోకి చొరబడి పదేపదే తొంగి చూడడం వంటివి చేస్తుండంతో అనుమానం వచ్చి నాయకులు, కార్యకర్తలు కలిసి 30 మందిలో 19 మందిని పట్టుకున్నారు. ఎందుకొచ్చారు.. ఎవరని విచారించగా పొంతలేని సమాధానాలు చెప్పడంతో వారి వాహనాలు, వారి వద్దనున్న బ్యాగులు తనిఖీ చేశారు. అందులో బిజెపి జెండాలుండటంతోపాటు, ఒక బ్యాగులో తుపాకీ కూడా ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన సిపిఎం నాయకులు, కార్యకర్తలు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తమ పార్టీ అభ్యర్థి అనిల్ కుమార్‌ను హతమార్చేందుకు బిజెపి నాయకులు, ఆర్‌ఎస్‌ఎస్ గుండాలు కుట్ర పన్నారంటూ బాగేపల్లి పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. పట్టుబడిన వారిని పూర్తి స్థాయిలో విచారించి వారిపై తక్షణం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమ అభ్యర్థి అనిల్ కుమార్‌కు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.



సంఘ్‌పరివార్ గూండాల కుట్ర నేపథ్యంలో అనిల్ కుమార్‌కు సంఘీభావం ప్రకటిస్తున్న స్థానికులు

సంయమనం పాటించాలి : సిపిఎం అభ్యర్థి

అనిల్‌కుమార్‌పై హత్య కుట్ర తెలుసుకున్న సిపిఎం కార్యకర్తలు బాగేపల్లిలోని ఆయన నివాసం వద్దకు బాగేపల్లి, గుడిబండ, చేళూరు తాలుకాల నుంచి సోమవారం పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా వారితో అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఘటనతో కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, ఇలాంటప్పుడు సంయమనంతో ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎవరూ రావొద్దని కోరారు. హత్యా రాజకీయాలకు, దాడులకు

మిగతా 7లో

ఆటలకు చోటేది !

- కనుమరుగవుతున్న స్థలాలు
- క్రీడేతరాలకు స్టేడియాలు
- ఆధ్యాత్మిక, అధికారిక కార్యక్రమాలకే తొలి ప్రాధాన్యత

ప్రజాశక్తి - స్పోర్ట్స్ కరస్పాండెంట్

రాష్ట్రంలో ఆటలు ఆడుకునేందుకు, వ్యాయామాలు చేసుకునేందుకు చోటు దొరకడం లేదు. నగరాలు, జిల్లా కేంద్రాల్లో స్టేడియాలున్నా..వాటిని క్రీడేతర కార్యాక్రమాల నిర్వహణకే పరిమితం చేస్తుండటంతో ప్రాక్టీస్‌కు క్రీడాకారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ (ఐజిఎంసి) స్టేడియం రాష్ట్రంలోనే క్రీడాకారులకు చక్కని వేదికగా ఉండేది. అయితే ప్రస్తుతం దానిని రాజకీయ కార్యక్రమాలకు, అధ్యాత్మిక కార్యాక్రమాలకు పరిమితం చేస్తున్నారు. ఈ నెల 12 నుంచి 17 వరకు స్టేడియం మొత్తాన్ని'చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయాగం' కోసం కేటాయించడంపై క్రీడాకారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజుల పాటు ప్రధాన క్రీడా ప్రాంగణానికి అధ్యాత్మిక కార్యాక్రమాలకు కేటాయిస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గతంలో రంజాన్ ప్రార్థనలకు, ఇతర రాజకీయ, అధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా ఈ స్టేడియాన్ని కేటాయించారు. రాష్ట్రంలోని మిగిలిన చోట్ల కూడా పరిస్థితి ఇంతకన్నా మెరుగ్గా ఏమీలేదు. ఆటలు ఆడేందుకు, ప్రాక్టీస్ చేసేందుకు, క్రీడా శిక్షణకు స్థలాలు లేకపోవడంతో క్రీడాకారులు, వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య, పోలీస్ అమర వీరుల దినోత్సవాలకు కూడా ఐజిఎంసిని కేటాయిస్తున్నారు. ఐజిఎంసి పక్కనే పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ఉన్నా.. 'పోలీస్ అమరవీరుల దినోత్సవం' వంటి కార్యక్రమాలు నిర్వహణకూ ఐజిఎంసిని వినియోగిస్తున్నారు. దీంతో క్రీడాకారులతో కళకళలాడాల్సిన ఐజిఎంసి ఇతర కార్యక్రమాలకే పరిమితమవుతోంది.

ఐజిఎంసిలోనే రాష్ట్ర క్రీడా ప్రాధికార కార్యాలయం (శాఫ్) ప్రధాన కార్యాలయమూ ఉంది. అన్ని క్రీడలకు సంబంధించిన కోచ్, సహాయ సిబ్బంది ఇక్కడే ఉంటారు. ఆధ్యాత్మిక, అధికారిక కార్యక్రమాలకు ఈ మైదానాన్ని కేటాయించడం పట్ల వీరు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. ప్రభుత్వాధికారుల, పాలకుల కనుసన్నల్లోనే ఇవి జరుగుతుండడంతో వీరూ ఏమీ చేయలేని పరిస్థితి. దీనిపై కోచ్‌లు, సహాయ సిబ్బందీ పెదవి విరుస్తున్నారు. ఏ కార్యక్రమానికి ఈ మైదానాన్ని కేటాయించినా.. 10 రోజుల ముందు నుంచే ఏర్పాట్ల హడావిడి మొదలవుతుంది. కార్యక్రమం ముగిసిన మరో వారం, 10 రోజులు ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ క్రమంలో ఇక్కడికి శిక్షణకు వచ్చేవారికి సుమారు 20 నుంచి నెలరోజుల పాటు నరకయాతన తప్పదు.





యజ్ఞం కోసం ఐజిఎంసిలో చేస్తున్న ఏర్పాట్లు

వేసవి శిక్షణ శిబిరం లేనట్లే..

ప్రతి ఏడాదీ మే 1 నుంచి 31 వరకు శాప్ ఆధ్వర్యంలో 'వేసవి క్రీడా శిక్షణ శిబిరం' జరుగుతుండేది. మేలో విద్యార్థులు వారు నచ్చిన క్రీడాంశంలో చేరి శిక్షణకు హాజరవుతుంటారు. శిక్షణ పూర్తయిన తర్వాత కూడా వారు అదే క్రీడలో శిక్షణ కొనసాగించుకోవాలన్నా ఈ మైదానంలోనే నైపుణ్యతగల శాప్ కోచ్‌లు ఉంటారు. కొన్ని క్రీడలకు మినహా.. మిగతా అన్ని క్రీడలకూ ఈ మైదానంలో ఉచిత శిక్షణ ఇస్తారు. అలాంటి సంప్రదాయాన్ని ఈసారి శాప్ అధికారులు పూర్తిగా తుంగలో తొక్కారు. ఏకంగా దేవాదాయశాఖ ఆధ్వర్యాన నిర్వహించే వారం రోజుల యాగం కోసం ప్రతిఏటా వేసవిలో నిర్వహించే క్రీడా శిక్షణ శిబిరాలను ఈసారి రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వేసవి శిక్షణను ఇలా ఎత్తివేయడం ఇదే తొలిసారి అని శాప్ అధికారి ఒకరు తెలిపారు.

హేతువాద సంఘం నాయకుల పెదవి విరుపు..

ఈ నాలుగేళ్లలో రాష్ట్ర దేవాదాయ శాఖకు గుర్తుకు రాని యాగాలు.. మరో ఏడాదిలో ఎన్నికలు ఉన్నాయనగా ఎందుకు గుర్తుకు వచ్చాయోనని హేతువాద సంఘం నాయకులు పెదవి విరుస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పీఠాన్ని తిరిగి ఎక్కేందుకే ఈ యాగాలు నిర్వహిస్తున్నారా? అని సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకట సుబ్బయ్య ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ఈ కార్యక్రమానికి ఐఎఎస్, ఐపిఎస్‌లు, ప్రజా ప్రతినిధులు హాజరుకావడం కూడా రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకమని అన్నారు.

రాష్ట్రం సర్వతోముఖాముఖివృద్ధికే.. : ఉప ముఖ్యమంత్రి

రాష్ట్ర సంక్షేమం, సర్వతోముఖాముఖాభివృద్ధి కోసమే 'చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయాగం' నిర్వహించనున్నట్లు ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 17 వరకు ఐజిఎంసిలో ఆరు రోజుల పాటు జరిగే ఈ యాగం.. రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండి, ప్రజలు సుఖ సౌభాగ్యాలతో వర్ధిల్లాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్నామన్నారు. 12న ఉదయం 5 గంటలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా యజ్ఞ ప్రారంభమై.. 17న జరిగే పూర్ణాహుతితో ఈ యాగం ముగుస్తుందన్నారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం కార్మికులు

'ఉక్కు' పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పేర్కొంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 816వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, నాయకులు జె రామకృష్ణ, ఎన్ రామారావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణ అంశంపై బిజెపి సర్కారు మొండి వైఖరి విడనాడాలన్నారు. రెండేళ్లకుపైగా కార్మికవర్గం దీక్షలు, పోరాటాలు చేస్తోన్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. పోరాటాల ద్వారా ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి ఎంతటి త్యాగానికైనా సిద్ధమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉక్కు ప్రయివేటీకరణ ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు సాయిరాం, సైన్ బాబు, ఆర్ వెంకట్రావు, వీరాస్వామి, మధు, డి శ్రీనివాస్, మంత్రి రవికిరణ్, జయకుమార్, చిత్త అబ్బాయి పాల్గొన్నారు.



సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న సిక్కు సంఘాల నేతలు

సిక్కులకు కార్పొరేషన్

- సెలవు దినంగా గురునానక్ జయంతి
- సిక్కు మత పెద్దలకు సిఎం జగన్ హామీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని సిక్కుల సంక్షేమం, అభివృద్ధి కోసం సిక్కు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిక్కు మత పెద్దలు సిఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో వున్న గురుద్వారాలకు ఆస్తి పన్నును మినహాయించేందుకు చర్యలు తీసుకుంటామని సిఎం జగన్ వారికి హామీ ఇచ్చారు. పూజారులు, పాస్టర్లు, మౌలాలీలకు ఇస్తున్న ప్రయోజనాల తరహాలో గురుద్వారాల్లోని పూజారులైన గ్రంథీలకూ అందిస్తామన్నారు. గురునానక్ జయంతి రోజైన కార్తీక పౌర్ణమి రోజును సెలవు దినంగా ప్రకటిస్తామని తెలిపారు. వచ్చే మంత్రివర్గ సమావేశంలో సిక్కులకు సంబంధించిన అంశాలపై తీర్మానం పెడతామని అన్నారు. సిక్కుల కోసం ఒక మైనార్టీ విద్యాసంస్థను పెట్టుకునేందుకు సహాయం అందిస్తామన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా సిక్కులకు అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సిఎం ఆదేశించారు.

పిడుగు పాటుకు ముగ్గురు దుర్మరణం

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇద్దరు
- మూగజీవాల మేత కోసం వచ్చిన తెలంగాణ వాసి..

ప్రజాశక్తి - ఆలూరు, డోన్, పగిడ్యాల

రాష్ట్రంలో పిడుగుపాటుకు ముగ్గురు మరణించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇద్దరు..మూగజీవాల మేత కోసం వచ్చిన తెలంగాణ నుంచి వచ్చిన ఒకరు దుర్మరణం చెందారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన రైతు గోపీని నౌనేపాటి (41) దంపతులు పత్తికొండ సంతలో ఎద్దులను కొనుగోలు చేసి టాటాఎస్ వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. గ్రామ సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న వాహనం సమీపంలో పిడుగుపడింది. వాహనం పైన కూర్చొని ఉన్న నౌనేపాటి అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. భార్య భూ లక్ష్మి, ఆటో డ్రైవర్ గమనించి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే నౌనేపాటి మరణించినట్లు వైద్యులు తెలిపారు.

నంద్యాల జిల్లా డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఉలవ లక్ష్మీదేవి(36) మల్కాపురం దగ్గర ఉన్న సబ్ స్టేషన్ పక్కన సున్నపురాయి ఏరడానికి పనికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో చెట్టు కింద భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటుండగా ఉరుములు, మెరుపులతో ఆ చెట్టు మీద పిడుగు పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించారు. ఆమెతో పాటు ఉన్న మరో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. లక్ష్మీదేవి భర్త ఏడుసంవత్సరాల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు.

తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం తూముకుంట బొల్లవరం గ్రామానికి చెందిన ఆవుల విష్ణు(18) గొర్రెలు మేపుకునేందుకు నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం సరిహద్దుల్లోకి వచ్చారు. ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో ఓ చెట్టు కిందకు వెళ్లాడు. ఆ చెట్టుపై పిడుగుపడటంతో విష్ణు అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగులపై నిఘా!

మొదటి పేజీ తరువాయి

ఆస్తులు కేసులు, లంచం అడగడం, ఇతరులను అవమానపరచడం, చీటింగ్, క్రిమినల్ నేరాలు, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించడం, రూల్ కోడ్, కార్యాలయానికి ఆలస్యంగా విధులకు హాజరుకావడం, నడవడిక సక్రమంగా లేకపోవడం, క్రమశిక్షణ లోపించడం, ప్రతిఏడాదీ ఆదాయానికి సంబంధించి రిటర్న్లు దాఖలు చేయకపోవడం వంటి కేసులను ప్రతి ఉద్యోగికీ సంబంధించినవి పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు ఉన్నతాధికారులు ఎప్పుడైనా నోటిసులు ఇచ్చిన వాటిపై సమాధానం ఇచ్చారా? లేదా చార్జ్ మెమో ఇచ్చి ఉంటే ఆయా అంశం, క్రిమినల్ కేసులు నమోదవుతున్నాయా? ఒక వేళ ఏదైనా కేసుల్లో జోక్యం ఉంటే అందుకు సంబంధించిన క్రైమ్ నెంబరు, తేదీ, సంవత్సరం, పోలీస్ స్టేషన్ తప్పనిసరిగా డిడిఒలు తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.

మత్స్యకారుల పొట్టగొడుతున్న కేంద్రం

మొదటి పేజీ తరువాయి

అయితే ఏమీ కాదు. ఫ్లోటింగ్ జెట్టీపైకి 30 మంది వెళితే మునిగిపోతుంది.

స్టీల్‌ప్లాంట్ మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఎపి ప్రభుత్వం ఎలాగైతే బలంగా అడ్డుకోవడం లేదో వైజాగ్ ఫిషింగ్ హార్బర్ విషయంలోనూ అలానే వ్యవహరిస్తోంది. పోర్టు ద్వారా ఫిషింగ్ హార్బర్ మొత్తం 112.5 ఎకరాలను విసిటిపిఎల్‌కు గుండగుత్తగా కట్టబెట్టే చర్యలకు పోర్టు దిగుతోందని, నిధుల డైవర్షన్ కూడా అందుకేనని మత్స్యకార సంఘం నాయకులు చంద్రశేఖర్ విమర్శించారు. ఆర్‌టిఐ ద్వారా వివరాలడిగినా ఇవ్వడం లేదన్నారు. విశాఖ దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి ఈ ఫిషింగ్ హార్బర్ ప్రాంతం వస్తుంది. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కూడా విసిటిపిఎల్ కోసం పోర్టు చేపట్టే చర్యలపైనా, రూ.152 కోట్ల డైవర్షన్‌పైనా మాట్లాడడం లేదని చంద్రశేఖర్, మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ముగ్గురు ఐఎఎస్‌లకు పదోన్నతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్టంలో ముగ్గురు సీనియర్ ఐఎఎస్ అధికారులకు సూపర్ టైమ్ స్కేల్ అపెక్స్ స్కేల్‌కు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ మేరకు సోమవారం జిఒ 881ని విడుదల చేసింది. అపెక్స్ స్కేల్‌కు ఉద్యోగోన్నతి పొందిన వారిలో 1993 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారులు అనిల్‌కుమార్ సింఘాల్, ఎమ్‌టి కృష్ణబాబు, గోపాలకృష్ణ ద్వివేది ఉన్నారు. వీరు నెలకు రూ.2.25 లక్షల జీతం అందుకోనున్నారు. వారు యథావిధిగా ప్రస్తుతం పనిచేస్తున్న హోదాల్లోనే విధులు నిర్వహించనున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

2 నుంచి టెన్త్ సప్లిమెంటరీ

- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి దేవానందరెడ్డి సోమవారం విడుదల చేశారు. జూన్ 10 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరిగిన రెగ్యులర్ పరీక్షల్లో 1,67,856 మంది ఫెయిలయ్యారు. వీరి కోసం జూన్ 2 నుంచి పరీక్షలను ప్రభుత్వ పరీక్షల విభాగం నిర్వహించనుంది. ఈ నెల 17 వరకు విద్యార్థులు ఎలాంటి రుసుం లేకుండా పరీక్ష ఫీజులను చెల్లించవచ్చు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 22 వరకు చెల్లించే వెసులుబాటు ఉంది.

సప్లిమెంటరీ షెడ్యూల్

తేది	సబ్జెక్టు
02-06-2023 (శుక్రవారం)	మొదటి భాష (పేపర్-1)
03-06-2023 (శనివారం)	రెండవ భాష
05-06-2023 (సోమవారం)	ఇంగ్లీష్
06-06-2023 (మంగళవారం)	మేథమెటిక్స్
07-06-2023 (బుధవారం)	సైన్స్
08-06-2023 (గురువారం)	సోషల్ స్టడీస్
09-06-2023 (శుక్రవారం)	ప్రథమభాష పేపర్-2 (కంపొజిట్ కోర్సు) ఒఎస్‌ఎస్‌సి మెయిన్ ల్యాంగ్వేజ్ పేపర్-1
10-06-2023 (శనివారం)	ఒఎస్‌ఎస్‌సి మెయిన్ ల్యాంగ్వేజ్ పేపర్-2

పారిశ్రామిక ప్రగతిపై దుష్ప్రచారం : మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రగతిని చూసి తట్టుకోలేక టిడిపి దుష్ప్రచారానికి పాల్పడుతోందని పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో భోగాపురం ఎయిర్‌పోర్టు, సీపోర్టు నిర్మాణాలు టిడిపికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబుది అంతా గ్రాఫిక్స్ అభివృద్ధి తప్ప వాస్తవంగా ఏమీ లేదని అన్నారు. అదానీ డేటా సెంటర్, రామాయపట్నం పోర్టు అభివృద్ధిని ఎవరు చేస్తున్నారో రాష్ట్ర ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2019 నాటికి ప్రభుత్వ ఉద్యోగులు నాలుగు లక్షలుంటే, ఇప్పుడు ఆరు లక్షలు వున్నారని తెలిపారు. ప్రైవేటు రంగంలో ఎంఎస్‌ఎంఇ సెక్టారు నుంచి 12 లక్షల ఉద్యోగాలు కొత్తగా వచ్చాయన్నారు. దేశంలోని అతిపెద్ద పారిశ్రామిక వేత్తలు వచ్చి పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించారని, విశాఖ గ్లోబల్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు కోసం తమ ప్రభుత్వ కృషిని ప్రజలు గుర్తించారన్నారు.

ఏటా రూ. రెండు లక్షల కొలువులు



- యువ సంఘర్షణ సభలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రానున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ తన కార్యాచరణను ప్రకటించింది. రాష్ట్రంలోని యువతే లక్ష్యంగా 'యూత్ డిక్లరేషన్' పేరుతో నిర్వహించిన సభలో వారిని ఆకర్షించేందుకు పలు హామీలను ఆ పార్టీ అగ్రనేత ప్రియాంకాగాంధీ గుప్పించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో సోమవారం కాంగ్రెస్ నిర్వహించిన 'యువ సంఘర్షణ సభ'లో ప్రియాంకగాంధీ మాట్లాడారు. 'జైబోలో తెలంగాణ' అని ప్రియాంక తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మిత్రులారా అంటూ తెలుగులో మాట్లాడారు. అమరుడు శ్రీకాంతా చారి గురించి ప్రస్తావించారు. 'నన్ను మరో ఇందిర అంటారు. అలా అన్నప్పుడు నా బాధ్యత తెలుస్తుంది' అన్నారు. త్వరలో తెలంగాణలో ఎన్నికలు జరగనున్నాయని,ప్రభుత్వాన్ని ఎన్నుకునే సమయంలో ప్రజలు జాగరుకతతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆ చైతన్యంతోనే కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. 'తెలంగాణ మీకు తల్లి వంటిది. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ఉద్యమం జరిగింది. ఏ ఒక్కరో పోరాడితే తెలంగాణ రాలేదు. 40 ఏళ్ల క్రితం చనిపోయిన ఇందిరమ్మను గుర్తు పెట్టుకున్న తెలంగాణ ప్రజలకు తప్పుడు హామీలు ఇవ్వలేమని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ కోసం ఎందరో ఆత్మ బలిదానాలు చేశారు. మా కుటుంబం కూడా ఎన్నో త్యాగాలు చేసింది. ఆ బాధ ఏంటో మాకు తెలుసు. బలిదానాలు వృథా కాకూడదని ప్రతీ ఒక్కరూ ఆలోచించాలి' అని ప్రజలకు ప్రియాంక గాంధీ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ. 4 వేలు భృతి ఇస్తామని ప్రకటించారు. ఏటా రెండు లక్షల కొలవులు, అమరవీరుల కుటుంబాలకు నెలకు రూ.25,000 పెన్షన్ అందిస్తామని ప్రకటించారు. యువతకు రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామనిహామీ ఇచ్చారు.



మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్ఐసి ఎఒఐ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఈ నెల 22, 23 తేదీలలో విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరుగనున్న ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఎఒఐ) ఆరో అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని మహాసభ ఆహ్వాన సంఘం ప్రధాన కన్వీనర్ పిఎల్ నరసింహారావు పిలుపునిచ్చారు. జగదాంబ సెంటర్ సిఐటియు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసిని ఐపిఒ పేరుతో ప్రయివేటుపరంచేసే కుట్రలు చేస్తోందన్నారు. దీంతో ఎల్ఐసితో పాటు ఏజెంట్ల మనుగడే ప్రశ్నార్థకంగా మారనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను, బ్యాంకులను కొంతమంది కార్పొరేట్ల చేతుల్లో పెట్టి లబ్ది పొందాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అందులో భాగమేనని పేర్కొన్నారు. రైతు ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఎల్ఐసి ఏజెంట్ల వ్యవస్థను, ఎల్ఐసిని రక్షించుకోవడానికి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకునేందుకు మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 22న వేలాది మంది ఎస్ఐసి ఏజెంట్లు, ఉద్యోగులు, పాలసీదారులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బహిరంగ సభలో కేరళ మాజీ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్, ఎల్ఐసి ఎఒఐ అఖిల భారత అధ్యక్షులు బాసుదేవ్ ఆచార్య, మాజీ ఎంపి డాక్టర్ ఎ సంపత్ పాల్గొంటారని తెలిపారు. ప్రతినిధుల సభను సిఐటియు జాతీయ కార్యదర్శి కెఎన్ ఉమేష్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి కోటేశ్వరరావు, జి రవికిషోర్, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- చందర్లపాడు, నందిగామ

ఎన్‌టిఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి షేక్ రిజ్వాన్ (16) ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల వెల్లడైన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేకపోయాడు. గణితంలో మూడు మార్కులే వచ్చాయి. దీంతో, మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చందర్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



రిజ్వాన్ ఫైల్

బిసి విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

- మంత్రి చెల్లుబోయిన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి ఫలితాల్లో బిసి సంక్షేమశాఖకు చెందిన రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులు 90 శాతం ఫలితాలు సాధించారని బిసి సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. సచివాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. బిసి రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి 5,114 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారని, అందులో 4,579 (90 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. వీరిలో 3,858 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 11 రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. బిసి సంక్షేమ వసతి గృహాల నుంచి రాసిన 8,235 మందిలో 5,916 (72 శాతం) ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరిలో 3,443 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణి సాధించారని చెప్పారు. 107 వసతి గృహాలు 100 శాతం ఫలితాలు పొందాయని పేర్కొన్నారు. గతేడాది కంటే అత్యుత్తమ ఫలితాలు వచ్చాయని వివరించారు. బిసి రెసిడెన్షియల్, బిసి సంక్షేమ వసతి గృహాల నుంచి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను 10 మంది చొప్పున సన్మానించి ప్రశంసా పత్రాలు అందిస్తామన్నారు.

మత్స్యకార్మికులకు సబ్సిడీ పెంచాలి

- ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మత్స్యకార్మికులకు పూర్తిగా అన్యాయం చేసిందని, వారికిచ్చే సబ్సిడీలను పెంచాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు మత్స్యకార్మిక సంఘం డిమాండ్ చేసింది. విజయవాడలో ఆ సంఘం సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్స్యకారుల జీవన పరిస్థితులు గతం కన్నా దుర్భరంగా తయారయ్యాయని అన్నారు. మత్స్యకార్మికుల కోసం రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించపోవడంతో సంక్షేమ పథకాల్లో భారీగా కోత పడిందని తెలిపారు. దీంతో సబ్సిడీపై వలలు, బోట్లు, నావలు, ఇంజిన్లు, ఐస్ బాక్సులు సొసైటీలకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. మత్స్యకార్మికులకు మోటరైజడు బోటుకు నెలకు 1000 లీటర్లు, మెకనైజెడు బోట్లకు 5000 లీటర్లు డీజిల్ సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేట నిషేధ కాలానికి ఇస్తున్న భృతిని రూ.20 వేలకు పెంచడంతోపాటు రెండు నెలలకు సరిపడా నిత్యవసర వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేటకు వెళ్లినప్పుడు మరణించిన మత్స్యకారులకు ఎక్స్‌గ్రేసియాను రూ.15 లక్షలకు పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకార్మికుల సమస్యలపై జూన్ 28, 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్ర చైతన్య సభలను జయప్రదం చేయాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె చంద్రశేఖర్, రాష్ట్ర వృత్తి సంఘాల కన్వీనరు ఎం భాస్కరయ్య, సంఘం ముఖ్య సభ్యులు వైడి శ్రీనివాసరావు, బి నీలాజలం, సిహెచ్ రమణి, ఎస్ ధనలక్ష్మి, వి శ్రీరాములు, ఎన్ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటోంది

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా.. ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి నాయకులు రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఏమాత్రం నష్టపోయినా వెంటనే నష్టపరిహారం అందేది కాదన్నారు. తక్షణమే పరిహారం అందించాలనే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు.

రైతుల కొంపముంచిన జగన్

- టిడిపి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉచితపంటల బీమా పేరుతో జగన్ ప్రభుత్వం రైతుల కొంప ముంచిందని టిడిపి నేత, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా సొమ్ము చెల్లించకపోవడంతో రైతులకు కన్నీళ్లు మిగిలాయన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటల బీమా చెల్లింపుల కోసం బడ్జెట్‌లో రూ.2,943 కోట్లు కేటాయించిన జగన్ కేవలం రూ.1,193 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. డిసెంబరు 31లోపు ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన పంటల బీమా సొమ్ము చెల్లించకుండా రైతుల నోట్లో మట్టికొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు రోడ్డెక్కి పోరాడినా పాలకుల్లో చలనం లేదన్నారు.

అసమర్థత, అవినీతి, వైఫల్యాలు, దుర్మార్గాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి సిఎం జగన్ తప్పుడు ప్రచారానికి తెరలేపారని టిడిపి నేత, మాజీమంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. చంద్రబాబు, అచ్చెన్నాయుడు, లోకేష్ సహా నేతలు అనని మాటలను అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారన్నారు. షాదీతోఫా పథకం పేరుతో జగన్ బటన్ నొక్కడమే గానీ ఎవరికీ డబ్బులు అందలేదని పేర్కొన్నారు.

మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధికి సహకరించండి

- న్యూఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టరుకు ఎంపి సత్యవతి విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధికి సహకరించాలని అనకాపల్లి ఎంపి భీశెట్టి సత్యవతి కోరారు. ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టరు ఎం శ్రీనివాస్‌తో వైసిపి ఎంపి బివి సత్యవతి భేటీ అయ్యారు. సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా శ్రీనివాస్‌ను కలిసిన ఎంపి సత్యవతి మంగళగిరి ఎయిమ్స్ విద్యార్థుల గురించి చర్చించారు. మంగళగిరి ఎయిమ్స్ విద్యార్థులకు ఢిల్లీ ఎయిమ్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చే అవకాశాలు పరిశీలించాలని కోరారు. విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ విద్యార్థులకు సహకరించడంపైనా చర్చించినట్లు సత్యవతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోల్ అండ్ స్టీల్ స్టాండింగ్ కమిటీ స్టడీ టూర్‌ను ముగించుకుని ఢిల్లీకి చేరుకున్న ఎంపి సత్యవతి మణిపూర్‌లోని విధ్వంస కాండ తెలుసుకుని అక్కడ చిక్కుకున్న ఎపి విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారిని సురక్షితంగా స్వస్థలాలకు తరలించేందుకు తీసుకుంటున్న చర్యలను ఆంధ్ర భవన్ అసిస్టెంట్ రెసిడెంట్ కమిషనర్ హిమన్షు కౌశిక్‌ను అడిగి తెలుసుకున్నారు.

కేరళ బోటు ప్రమాదం విచారకరం

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లా తువల్ తీరం బీచ్ సమీపంలో హౌస్ బోటు బోల్తా పడిన ఘటనలో 22 మంది మరణించడం దిగ్భ్రాంతికరమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 11 మంది ఉండటం అత్యంత విషాదకరమని, పర్యాటకంగా అభివృద్ధి చెందిన కేరళలో ఇటువంటి ప్రమాదం చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఈ ప్రమాదాన్ని ప్రతి రాష్ట్ర పర్యాటకశాఖ ఒక పాఠంగా తీసుకోవాలని, పాపికొండలు పర్యాటక బోటు ప్రమాద ఘటనను ఎవరూ మరచిపోలేదని, ప్రధానంగా జల విహారానికి సంబంధించిన ప్రాంతాల్లో నిబంధనలు పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని పవన్ కల్యాణ్ సూచించారు.

ప్రతి గింజనూ ప్రభుత్వం కొనాల్సిందే...

- రైతు, కౌలు రైతు సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - కొత్తపేట(డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)



కొత్తపేట మండలం బిళ్లకుర్రులో మొలకెత్తిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనాల్సిందేనని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బిళ్లకుర్రు శివారు మాసాయిపేటలో ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన వరి, మొక్కజొన్న పంటలను వారు సోమవారం పరిశీలించారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాల వల్ల పూర్తిగా నష్టపోయామని రైతులు వాపోయారు. పంటను గట్టుపైకి తీసుకొచ్చేందుకు అదనంగా ఖర్చు పెట్టాల్సి వచ్చిందన్నారు. సగం పంట కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని తెలిపారు. ప్రభుత్వం ప్రతి గింజనూ కొనుగోలు చేస్తేనే నష్టాల నుంచి గట్టెక్కగలమన్నారు. ఈ సందర్భంగా నాయకులు వి కృష్ణయ్య, హరిబాబు మాట్లాడుతూ కోతల సమయంనాటికే పంటను కొనుగోలు చేయాలని గతంలోనే ప్రభుత్వాన్ని కోరామన్నారు. మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్‌లకు సైతం వినతి పత్రాలు అందించామని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో ప్రకృతి విపత్తుల సమయంలో రైతులను ఆదుకోడానికి రూ.రెండు వేల కోట్లు, ధరల స్థిరీకరణకు రూ.మూడు వేల కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. ఆ నిధులతో రైతులను ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని, మొక్కజొన్నను నిబంధనలు సడలించి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి వెంట కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, ప్రజా సంఘాల జిల్లా నాయకులు కారెం వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఎకరాకు రూ.30 వేలు పరిహారమివ్వాలి

విజయనగరం కలెక్టరేట్ ఎదుట మామిడి రైతుల ధర్నా

ప్రజాశక్తి- విజయనగరం టౌన్



ధర్నాలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

పంట నష్టపోయిన తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ విజయనగరం కలెక్టరేట్ ఎదుట సోమవారం మామిడి రైతులు ధర్నా చేశారు. ఎకరాలకు రూ.30 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎపిరైతు సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రత, పొగమంచు, తెగుళ్లు, చీడపీడల వల్ల పూత, కాయ దశలో మామిడి పంటలు దెబ్బతిన్నడంతో గత నాలుగేళ్లుగా రైతులు అప్పులపాలవుతున్నారని తెలిపారు. ఈ ఏడాది కురిసిన అకాల వర్షాలతో 90శాతం పంట దెబ్బతినడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. మామిడి పంటకు వాతావరణ బీమా అమలు చేయాలని, నష్టపోయిన మామిడి, జీడి పంటలకు ఎకరాకు రూ.30వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మామిడి పంటకు మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, మామిడి, జీడి కౌలుదారులకు కౌలుకార్డులు ఇచ్చి ఇ- క్రాఫ్ నమోదుచేసి, వడ్డీలేని రుణాలు, రైతుభరోసా తదితర రాయితీలు కల్పించాలని కోరారు. పది ఎకరాల మామిడి, జీడి రైతులకు వ్యవసాయ బోర్లు, సోలార్ మోటర్లు ఉచితంగా ఇవ్వాలన్నారు. ప్రభుత్వమే జ్యూస్ ఫ్యాక్టరీలు, కోల్డ్ స్టోరేజీలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగిరెడ్డి గోపాలం, బి.రాంబాబు, బొండపల్లి మాజీ ఎంపిపి సభ్యులు బండారు కృష్ణ, బోదంకి గౌరినాయుడు, అప్పలనాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తొత్తడి పైడపు నాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం

మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - ఉంగుటూరు (ఏలూరు)

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలాల్లో సోమవారం ఆయన పర్యటించారు. అకాల వర్షాల కారణంగా తడిచిన ధాన్యాన్నిఉంగుటూరు మండలం ఉంగుటూరు, నాచుగుంట గ్రామాల రైతులు రోడ్డుపై ఆరబెట్టుకుంటున్న రైతులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందేలా సిఎం జగన్ చర్యలు చేపట్టారని తెలిపారు. మిల్లర్లకు రైతులు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రెండు జిల్లాల్లో ఇప్పటివరకూ రైతుల నుంచి మిల్లర్లు డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదుల రావడంతో 12 రైస్ మిల్లులను సీజ్ చేశామని తెలిపారు. కొంతమంది రైతులకు సంబంధించిన ధాన్యం కొనుగోలును ఇప్పటివరకు చేపట్టకపోవడంపై ఉంగుటూరు వ్యవసాయ శాఖ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యాన్ని మిల్లులకు పంపాలని ఆదేశించారు. అనంతరం తాడేపల్లిగూడెం మండలం నందమూరు, కృష్ణయ్యపాలెం గ్రామాల్లో డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణతో కలిసి పర్యటించి రైతులతో మాట్లాడారు. తడిచిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని హామీనిచ్చారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామక్రిష్ణ

న్యాయమైన నష్టపరిహారమివ్వాల్సిందే

కలెక్టరేట్ ఎదుట బైపాస్ హైవే బాధిత రైతుల ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆరు లైన్ల జాతీయ రహదారికి, బైపాస్ హైవే రోడ్డు కోసం భూములు ఇస్తున్న తమకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ కర్నూలు కలెక్టరేట్ వద్ద బాధిత రైతులు సోమవారం ధర్నా చేపట్టారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ మాట్లాడుతూ ఆరు లైన్ల రోడ్డుకు, బైపాస్ హైవే రోడ్డు కోసం కర్నూలు, కల్లూరు మండలాలలో 12 గ్రామాల రైతుల నుండి 300 ఎకరాలను బి తాండ్రపాడు నుండి గార్గేయపురం వరకు ప్రభుత్వం సేకరిస్తోందని చెప్పారు. ఎకరా రూ. మూడు కోట్లు విలువ చేసే భూములకు రూ.30 లక్షలు, నూతనపల్లి గ్రామ రైతులకు రూ. ఎనిమిది లక్షలు, ఉల్చాల, తొలిసాపురం, సింగవరం గ్రామాల భూములకు రూ.12 లక్షలు మాత్రమే ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడం దారుణమన్నారు. ఈ పరిహారం ఏమాత్రమూ సరిపోదని రైతులు తిరస్కరిస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి అనుమతి లేకుండానే వాళ్ల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. నూతనపల్లె గ్రామ రైతులకు ఎకరాకు రూ. 60 లక్షలు, రుద్రవరం, గార్గేయపురం గ్రామ రైతులకు రూ.80 లక్షలు, ఉల్చాల, సింగవరం, తొలిసాపురం, బసాపురం, ఆర్.కొంతలపాడు, ఎదురూరు గ్రామాల రైతులకు రూ. 80 లక్షలు తక్కువ కాకుండా ఇవ్వాలని, దిన్నెదేవరపాడు, పందిపాడు, లక్ష్మీపురం గ్రామ రైతులకు ప్లాట్లు వేసిన పొలాలు కాబట్టి తగిన విధంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సృజనకు, ఆర్‌డిఒకు, తహశీల్దార్‌లకు వినతి పత్రాలు అందజేశారు.

మార్కెట్ ధరకు సమానంగా పరిహారమివ్వాలి

కలెక్టరేట్ ఎదుట 544-డి నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా పాముురాయి నుంచి గుంటూరు వరకు నిర్మిస్తున్న 544-డి రోడ్డు విస్తరణ పనుల్లో భూములు, ఇళ్లు కోల్పోతున్న తమకు 2023 మార్కెట్ ధరల మేరకు నష్టపరిహారం చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, 544-డి రోడ్డు నిర్వాసితుల సంఘం జిల్లా కన్వీనర్ వి.శివారెడ్డి మాట్లాడుతూ.. 544-డి రోడ్డు విస్తరణలో భాగంగా అనంతపురం జిల్లాలో రోటరీపురం, కొర్రపాడు, శివపురం, బండమీదపల్లి, నార్పల క్రాస్, నాయనపల్లి, ముచ్చుకోట, ఎల్‌టి బుగ్గ వరకు దాదాపు 550 ఇళ్లను కూల్చివేస్తున్నారని, 65 ఎకరాల వ్యవసాయ భూమిని తీసుకుంటున్నారని తెలిపారు. అయితే, ఇందుకు సంబంధించి 2017లో నోటిఫికేషన్ ఇచ్చి..2019లో ధరలు నిర్ణయించారన్నారు. ఆ సమయంలో డబ్బులు చెల్లించకుండా.. ప్రస్తుతం 2019 సంవత్సరం ధరల ప్రకారం తొమ్మిది శాతం వడ్డీతో కలిపి చెల్లిస్తామని ప్రభుత్వం, అధికారులు చెప్పడం సరికాదన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో సెంటు రూ.మూడు నుంచి రూ.నాలుగు లక్షలు పలుకుతోందన్నారు. ఈ ధరల ప్రకారమే బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు గోపాల్‌రెడ్డి, ఎం.లక్ష్మీనారాయణ, జయప్రకాష్‌రెడ్డి, నరసింహులు, రైతుసంఘం నాయకులు కుళ్లాయప్ప, రెడ్డిపల్లి శ్రీనివాసులు, పోతులయ్య పాల్గొన్నారు.

'యువగళం'లో ఉద్రిక్తత

- మీసం మెలేసిన కర్నూలు ఎమ్మెల్యే, అరెస్ట్
- పాదయాత్రను అడ్డుకొనేందుకు న్యాయవాదుల ప్రయత్నం
- ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం : లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి



కొండారెడ్డి బురుజు వద్ద పాదయాత్రగా వస్తున్న నారా లోకేష్

యువగళం పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన పాదయాత్ర సందర్భంగా కర్నూలు నగరంలో ఉద్రిక్తత నెలకొంది. ముస్లిం మైనారిటీలతో ఆదివారం లోకేష్ ముఖాముఖి సందర్భంగా కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ భూములు కబ్జా చేసినట్లు ఆరోపించారు. సోమవారం ఉదయం కర్నూలులోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలోని విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. పాదయాత్ర ప్రారంభానికి ముందే ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. తనపై లోకేష్ చేసిన ఆరోపణలను నిరూపించాలని, ఎక్కడికి రావాలో చెప్పాలని, లేకుంటే తానే పాదయాత్ర వద్దకు వస్తానని సవాల్ చేశారు. లోకేష్ పాదయాత్ర కొనసాగుతుండగా నగరంలోని లాల్ మసీదు వైపు నుంచి ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ నడుచుకుంటూ పూల బజార్ వైపు పాదయాత్రకు ఎదురు వెళ్లే ప్రయత్నం చేశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాదయాత్రలో ఉండటం, వైసిపి ఎమ్మెల్యే పాదయాత్రకు ఎదురు వెళ్లడంతో పూల బజార్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అప్రమత్తమైన పోలీసులు ఎమ్మెల్యేను బలవంతంగా అరెస్ట్ చేసి పోలీసు వాహనంలో ఎక్కిస్తుండగా...మీసం మేలేస్తు ఆరోపణలను నిరూపించాలని నినాదాలు చేశారు.

గట్టి బందోబస్తు మధ్య లోకేష్ యాత్ర ముందుకు సాగింది. ఎస్‌బిఐ సర్కిల్ వద్దకు యాత్ర చేరుకున్న సమయంలో పలువురు న్యాయవాదులు 'లోకేష్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. పోలీసులు వారిని రోప్ సాయంతో నిలువరించడంతో పాదయాత్ర ముందుకు సాగింది. ఉస్మానియా కాలేజ్, జొహరాపురం మీదుగా పుల్లయ్య కాలేజీలోని విడిది కేంద్రం వద్దకు యాత్ర చేరుకుంది. అంతకుముందు ఆర్యవైశ్యులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పన్నుల విధానాన్ని ప్రక్షాళన చేస్తామని హామీనిచ్చారు. సులభతరంగా వ్యాపారం చేసుకునేందుకు వీలు కల్పిస్తామని తెలిపారు. ఆర్యవైశ్యులకు టిడిపి అండగా ఉంటుందని అన్నారు. పాదయాత్రలో మాజీ మంత్రులు భూమా అఖిల ప్రియ, అమరనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బిటి.నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు నియోజకవర్గ ఇన్చార్జి టిజి.భరత్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్-5 జోన్‌పై పిటిషన్లపై వచ్చే వారం విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అమరావతిలో ఆర్-5 జోన్‌పై ఎపి హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై వచ్చే వారం విచారణ చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తమ పిటిషన్ త్వరగా విచారించాలంటూ రైతుల తరపున న్యాయవాది సోమవారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. వచ్చేవారం విచారణ జరుపుతామని సిజెఐ పేర్కొన్నారు.

రైతుల పిటిషన్‌లో ఇంప్లీడ్ అవుతా : జడ శ్రావణ్

ఆర్-5 జోన్‌పై రైతులు సుప్రీంకోర్టులో వేయనున్న స్పెషల్ లీవ్ పిటిషన్‌లో జై భీమ్ యాక్సెస్ జస్టిస్ వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ ఇంప్లీడ్ అవనున్నారు. సుప్రీంకోర్టులో వ్యక్తిగతంగా జడ శ్రావణ్ వాదనలను వినిపించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వానికి భూ బదలాయింపు జరిగినప్పుడు ప్రభుత్వం ఎటువంటి యాజమాన్యం హక్కులు పొందవని అన్నారు. రైతులు వేసిన పిటిషన్ హైకోర్టు కొట్టేయడం అత్యంత బాధాకరమన్నారు. ఆర్-5జోన్‌లో స్థానికేతరులకు ఇళ్ల స్థలాలు ఇస్తే రాజధాని ప్రాంతంలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టిలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు.



పార్కును పరిశీలిస్తున్న మంత్రులు రోజా, బొత్స సత్యనారాయణ

రాష్ట్రంలోనే తొలి మహిళా పార్కు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలోనే తొలి మహిళా పార్కును రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్‌కె రోజా, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం ప్రారంభించారు. విజయనగరంలో రూ.98 లక్షలతో ప్రకాశం పార్కును ఆధునీకరించి మహిళా పార్కుగా, రూ. 40 లక్షలతో స్విమ్మింగ్‌పూల్‌ను నిర్మించారు. ముందుగా ఆనందగజపతి ఆడిటోరియం నుంచి పార్కు వరకూ వేలాది మంది మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి రోజా మీడియాతో మాట్లాడుతూ మహిళలకు రాష్ట్ర ముఖ్యమంత్రి సముచిత స్థానం కల్పిస్తున్నారని అన్నారు. మహిళల కోసం పార్కును ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మానసిక ఒత్తిడి నుంచి రిలాక్స్ అయ్యేందుకు, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు పార్కులో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారని తెలిపారు. టిడిపి అధికారంలోఉన్నప్పుడు మంత్రిగా చేసిన జిల్లాకు చెందిన అశోక్‌గజపతిరాజు ఈ ప్రాంతం అభివృద్ధికి ఏం కృషి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీ సురేష్ బాబు, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు రేవతిదేవి, కోలగట్ల శ్రావణి, కమిషనర్ శ్రీరాములు నాయుడు, కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ 120% డివిడెండ్

- లాభాల్లో 90% వృద్ధి



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ తన ఇన్వెస్టర్లకు ఆకర్షణీయ డివిడెండ్‌ను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23కు గాను ప్రతీ రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.12 లేదా 120 శాతం డివిడెండ్‌ను అందించడానికి ఆ బ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ప్రతిపాదించారు. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభాలు 90 శాతం పెరిగి రూ.3,175 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,666 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.7,006 కోట్లుగా ఉన్న బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం.. క్రితం త్రైమాసికంలో 23 శాతం పెరిగి రూ.8,616 కోట్లకు చేరింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికం నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 5.35 శాతానికి తగ్గాయి. 2022 ఇదే మార్చి నాటికి జిఎన్‌పిఎ 5.89 శాతంగా ఉంది. ఇదే సమయంలో 2.65 శాతంగా బ్యాంక్ నికర నిరర్థక ఆస్తులు గడిచిన త్రైమాసికం ముగింపు నాటికి 1.73 శాతానికి తగ్గడం విశేషం. 2023 మార్చి ముగింపు నాటికి బ్యాంక్ గ్లోబల్ బిజినెస్ 12 శాతం పెరిగి రూ.20.41 లక్షల కోట్లకు చేరింది. గ్లోబల్ డిపాజిట్లు రూ.11.79 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ డిపాజిట్లు 6 శాతం పెరిగి రూ.10.94 లక్షల కోట్లకు చేరాయి. 2023 మార్చి ముగింపు నాటికి కెనరా బ్యాంక్ 9,706 శాఖలను కలిగి ఉండగా.. ఇదులో 3048 గ్రామీణ ప్రాంతాల్లో, 2742 శాఖలు చిన్న పట్టణాలు, 1991 పట్టణాలు, 1925 శాఖలు మెట్రో నగరాల్లో ఉండగా.. మొత్తంగా 10,726 ఎటిఎం శాఖలను కలిగి ఉన్నట్లు ఆ బ్యాంక్ వెల్లడించింది.

ఇండియన్ బ్యాంక్ లాభాల్లో 47% వృద్ధి

న్యూఢిల్లీ : ఇండియన్ బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 47 శాతం వృద్ధితో రూ.1,447 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.984 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో ఆ బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.11,405 కోట్లుగా ఉండగా.. గడిచిన మార్చి త్రైమాసికంలో రూ.14,238 కోట్లకు చేరింది. గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం రూ.9,832 కోట్ల నుంచి రూ.12,244 కోట్లకు పెరిగింది. 2023 మార్చితో ముగిసిన ఏడాదికి గాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.8.60 లేదా 86 శాతం డివిడెండ్‌ను ఇవ్వడానికి బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 8.47 శాతం నుంచి 5.95 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 2.20 శాతం నుంచి ఏకంగా 0.90 శాతానికి దిగిరావడం విశేషం. రూ.3,000 కోట్ల నిధుల సమీకరణకు ఆ బ్యాంక్ బోర్డు ఆమోదం తెలిపింది.

ఎఐ అణు బాంబు లాంటిది

వారెన్ బఫెట్ హెచ్చరిక



వాషింగ్టన్ : కృత్రిమ మేధ (ఎఐ) అణుబాంబు లాంటిదని ప్రపంచంలోనే అతిపెద్ద కుబేరుడు వారెన్ బఫెట్ అన్నారు. నెబ్రాస్కాలోని ఒమాహాలో జరిగిన బెర్క్‌షైర్ హాత్‌వే వార్షిక సమావేశంలో బఫెట్ మాట్లాడుతూ.. ఎఐని సృష్టించడమంటే అణు బాంబును తయారు చేసుకోవడమేనని హెచ్చరించారు. చాట్ జిపిటి గురించి బిల్‌గేట్స్ చెప్పినప్పుడు తాను ఆశ్చర్యపోయానని పేర్కొన్నారు. మనం చేసే పని మంచిదై ఉండొచ్చు కానీ.. అందులోనూ కొన్ని దుష్ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అందుకు నిదర్శనమే రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అణుబాంబు ప్రయోగమన్నారు.

ఎస్టే లాడర్‌కు ప్రచారకర్తగా మానుషి చిల్లర్

హైదరాబాద్ : బాలీవుడ్ నటి, మోడల్ అయినటువంటి మానుషి చిల్లర్‌ను ఎస్టే లాడర్ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు ప్రకటించింది. సౌందర్య ఉత్పత్తులను విక్రయించే తమ సంస్థ ఈ నెలాఖరులో ప్రారంభించే క్యాంపెయిన్‌లో మానుషి కనిపించనుదని పేర్కొంది. ఎస్టే లాడర్ కుటుంబంలోకి మానుషిని స్వాగతిస్తున్నందుకు తాము సంతోషిస్తున్నామని ఎస్టే లాడర్ ప్రెసిడెంట్ జస్టిన్ బాక్స్ ఫోర్డ్ పేర్కొన్నారు.

గో ఫస్ట్ టికెట్ బుకింగ్స్ నిలిపివేత

న్యూఢిల్లీ : ఆర్థిక ఇబ్బందులతో దివాలా తీసిన గో ఫస్ట్ ఎయిర్‌లైన్స్ తక్షణమే టికెట్ల బుకింగ్స్‌ను నిలిపివేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి టికెట్లు విక్రయించకూడదని సోమవారం నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే మే 12వ తేది వరకు విమాన సేవలను నిలిపివేసినట్లు ఇటీవల గో ఫస్ట్ తెలిపింది. కాగా.. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు టికెట్లను అమ్మకూడదని తాజాగా డిజిసిఎ పేర్కొంది. కార్యకలాపాలను సమర్థంగా నడపడంలో విఫలం అయినందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని మరో నోటీసులో కోరింది.

వ్యూహాత్మక దాడి


సంపాదకీయం

బిజెపి, మతోన్మాదశక్తుల అమ్ములపొదిలిలో ప్రత్యర్థులపై అబద్ధపు ప్రచారం చేసి రాజకీయ పబ్బం గడుపుకునే వ్యూహాలు ఎల్లవేళలా సిద్ధంగానే ఉంటాయి. ఆ కోవలోనివే నిన్నటి 'కాశ్మీర్ ఫైల్స్' సినిమా అయినా నేటి 'కేరళ స్టోరీ' మూవీ అయినా. అసత్యాల పునాదులపై దర్శకుడు సుదీప్తో సేన్ నిర్మించిన 'కేరళ స్టోరీ' ఇప్పుడు ప్రధాని మోడీ సహా పలువురు బిజెపి అగ్ర నాయకులకు, హిందూత్వ ముఠాలకు ఆయుధం కావడంలో ఆశ్చర్యం లేదు. అది వారి సహజ నైజం. కేరళ రాష్ట్రానికి చెందిన 32 వేల మంది మహిళలు, బాలికలను బలవంతంగా మత మార్పిడి చేసి సిరియా, యెమెన్, అఫ్గనిస్తాన్‌లకు అక్రమంగా రవాణా చేశారన్నది 'కేరళ స్టోరీ' ఇతివృత్తం. అశ్లీలం, హింస సరేసరి. ప్రజల నిరసనల మేరకు సెన్సార్ బోర్డు ఆదేశాలతో ముగ్గురు మహిళలుగా కథ మార్పు చేసినప్పటికీ, మతోన్మాదాన్ని రేగ్గొట్టే డైలాగులతో ముందుగా రిలీజైన ట్రైలర్ జనంలోకి విస్తృతంగా వెళ్లిపోయింది. వాట్సాప్‌లు, వార్తా చానల్స్, ప్రసార మాధ్యమాల్లో హిందూ మతోన్మాద శక్తులు అమిత ప్రచారం కల్పించి తమ లక్ష్యాన్ని సాధించాయి. దేశ వ్యాప్తంగా ఈ నెల 5న హిందీలో విడుదలైన 'కేరళ స్టోరీ'పై హైకోర్టులో వ్యతిరేక పిటిషన్లు పడటంతో వాటిని త్వరగా పరిశీలించాలని ప్రధాన న్యాయమూర్తి ఆదేశించారు.

గుజరాత్‌ను తతిమ్మా దేశం ఆదర్శంగా తీసుకోవాలని తరచు బిజెపి వల్లె వస్తూ ఉంటుంది. ఆ రాష్ట్రంలో ఐదేళ్ల కాలంలో 41 వేల మంది మహిళలు, బాలికలు అదృశ్యమయ్యారని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) లెక్కలు కుండబద్దలు కొడుతున్నాయి. ఏడాదికి నాలుగు వేల నుంచి తొమ్మిది వేల మంది కనబడకుండా పోయారు. వీరందరూ ఇతర రాష్ట్రాలకు వ్యభిచార వృత్తికి బలవంతంగా తరలించబడ్డారని, పోలీస్ దర్యాప్తు సంస్థలు నిర్లక్ష్యం చేస్తున్నాయని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడు సుధీర్ సిన్హా ఆందోళన వ్యక్తం చేశారు. 2019-20లో 4,722 మంది మహిళలు అదృశ్యమయ్యారని 2021లో అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించింది. ఒక సినిమా కథ ఆధారంగా కేరళలో మహిళలు అదృశ్యమవుతున్నారని కంకణం కట్టుకొని మరీ ఊరూ వాడా ప్రచారం ప్రచారం చేస్తున్న ప్రధాని మోడీ, అమిత్‌షా ద్వయం తమ సొంత ఇలాకా గుజరాత్‌లో అన్నేసి వేల మంది స్త్రీలు మిస్ అవుతుంటే మాత్రం నోరువిప్పట్లేదు ఎందుకని? కేరళలో మిస్సింగ్‌లపై పోలీస్ రికార్డ్స్ లేవు. అదొక ఊహాజనితం. అదే గుజరాత్‌కు సంబంధించిన గణాంకాలు కేంద్రం నిర్వహించే ఎన్‌సిఆర్‌బి రికార్డ్సులో పదిలంగా ఉన్నాయి. సదరు ఎన్‌సిఆర్‌బి హోం మంత్రి అమిత్‌షా నిర్వహణ కిందనే ఉంది. కాబట్టి గుజరాత్ మిస్సింగ్‌లపై మోడీ, షా తప్పించుకోజాలరు. వారి వైపే అందరి వేళ్లూ చూపిస్తున్నాయి.

మితవాదులు, ఫాసిస్టులు ఒక ఎజెండాతో ఉన్మాదాన్ని ప్రజలకు నూరిపోస్తారు. ప్రజల మెదళ్లల్లోకి విద్వేష విషం ఎక్కిస్తారు. సైద్ధాంతికంగానే ఆ పని చేస్తారు. చరిత్రలో ఇటలీ, జర్మనీ దేశాల్లో ఫాసిస్టులు ఆ విధంగానే అధికారంలోకి వచ్చాయి. బిజెపి, మతోన్మాద శక్తులు మన దేశంలో ఆ పంథానే అమలు చేస్తున్నారు. కేరళ ప్రజలు హిందూ మతోన్మాద శక్తులను తమ రాష్ట్రంలోకి రానివ్వలేదు. బిజెపి నుంచి ఒక్క ఎంపి కూడా గెలుపొందలేదు. అక్కడి వామపక్ష ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలతో అభివృద్ధి దిశగా పయనిస్తోంది. హిందుత్వ ముఠాల చర్యలను సమర్ధవంతంగా ఎదుర్కొంటోంది. కార్పొరేట్, సమాఖ్య, లౌకిక విధానాలపై జాతీయ ఐక్యత సాధనకు వామపక్షాలు ముందంజలో ఉన్నాయి. ఆ కక్షతోనే ఆ ఆ రాష్ట్రంపై 'కేరళ స్టోరీ' సహా అంది వచ్చిన దేన్నీ వదిలిపెట్టకుండా ఉద్దేశపూర్వకంగా దాడి చేసి క్రైస్తవులు, ముస్లింలు, హిందువుల మధ్య ఐక్యతను దెబ్బతీస్తున్నాయి. కేరళ ఉగ్రవాదానికి కేంద్రంగా మారినట్లు నానా యాగీ చేస్తున్నాయి. బిజెపి, హిందూత్వశక్తుల కుయుక్తులను ఎదుర్కొన్న చరిత్ర మళయాళీలది. ఇప్పుడూ ఎప్పుడూ వారు ఆ ఒరవడి ప్రదర్శిస్తారు. కోర్టులు, ప్రభుత్వాలు ఏం చెప్పినా బిజెపి, మితవాద శక్తుల అభూతకల్పనలను తిప్పికొట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అదే దేశానికి రక్ష.

మహనీయుల మాట



పుస్తకాలు నా మనస్సుకూ,
హృదయానికీ రెక్కలనిచ్చాయి.
నేను బురద నుంచి బయటపడటానికి
ఎంతో తోడ్పడ్డాయి
పుస్తకాలు చదవకపోతే
నా చుట్టూవున్న మౌఢ్యంలోనూ,
నీచంలోనూ మునిగిపోయి వుండేవాడ్ని
విశాలమైన ప్రపంచ దృశ్యాలను
పుస్తకాలు నా ముందు పరిచాయి

- మాక్సిం గోర్కీ

భయంకరంగా నిరుద్యోగ సమస్య

ప్రజాస్వామ్యం



ప్రభాత్ పట్నాయక్

సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) నిరుద్యోగానికి సంబంధించి విడుదల చేసిన గణాంకాలు భయంకర పరిస్థితిని సూచిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా నిరుద్యోగం పెరుగుతూనే వుంది. కరోనా కాలానికన్నా ముందునుంచీ ఇదే పరిస్థితి. ఇక కరోనా కాలంలో అది అమాంతం పెరిగిపోయింది. ఆ తర్వాత ఆర్థిక వ్యవస్థ మళ్లీ కొంత పుంజుకున్న తర్వాత కూడా పెద్దగా తగ్గలేదు. కనీసం జిడిపిలో ఏ మేరకు కోలుకోవడం జరిగిందో, ఆ మేరకైనా నిరుద్యోగం తగ్గింది లేదు.

2017-18లో నిరుద్యోగం రేటు 4.7 గా నమోదైంది. 2018-19 నాటికి ఇది 6.3 కి పెరిగింది. ఇక కరోనా కాలంలో లాక్‌డౌన్ విధించాక, డిసెంబర్ 2020 నాటికి అమాంతం 9.1 కి చేరింది. ఆ తర్వాత ప్రభుత్వం మన ఆర్థిక వ్యవస్థ కోలుకుందని, మళ్లీ వేగంగా ముందుకు దూసుకుపోతోందని తెగ ప్రచారం చేసుకోవడం జరుగుతోంది. కానీ నిరుద్యోగం మాత్రం కనీసం పాత పరిస్థితికైనా చేరుకోలేదు. డిసెంబర్ 2022 నాటికి అది 8.3 శాతం ఉంది. జనవరి 2023లో కొంత తగ్గి 7.4 కి చేరింది. కానీ మళ్లీ మార్చి 2023లో 7.8 కి పెరిగింది.

2022-23లో మన జిడిపి 2019-20 నాటి కన్నా 8.4 శాతం ఎక్కువ అని, 2018-19 కన్నా 12.95 శాతం ఎక్కువ అని అంచనాలు చెప్తున్నాయి. జిడిపి చూస్తే 12.95 శాతం ఎక్కువ ఉన్నా నిరుద్యోగం మాత్రం తగ్గకపోగా 2018-19 కన్నా 1.5 శాతం ఎక్కువగా ఉంది. అంటే జిడిపి పెరుగుదల వల్ల కలుగుతున్న కొత్త ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. ఇదేదో ఈ నాలుగేళ్ల స్వల్ప కాల వ్యవధిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినందువల్ల వచ్చిన పరిణామం కాదు. ఆ విధంగా కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఏదీ చెప్పుకోదగ్గది రాలేదు.

మరి నిరుద్యోగంలో ఈ కాలంలో కనిపిస్తున్న అదనపు పెరుగుదలకు కారణం ఏమిటి ? మొదటిది: ఏ యే రంగాల్లో ఆర్థిక వ్యవస్థ కోలుకుందో ఆ రంగాలు ఉపాధిని కల్పించే రంగాలు కావు. ఉదాహరణకు చిన్న, మధ్య తరహా వస్తూత్పత్తి రంగాలు (మాన్యుఫాక్చరింగ్ రంగం) కరోనా అనంతరం పెద్దగా కోలుకోలేదు. మరోవైపు మార్కెట్‌లో డిమాండ్ పడిపోయిన కారణంగా గణనీయంగా లే ఆఫ్‌లు పెరిగాయి. ఆయా యజమానులు గాని, ప్రభుత్వాలు గాని తీసుకున్న 'పొదుపు చర్యలు' కూడా ఈ లే ఆఫ్‌లు పెరగడానికి కొంతవరకూ కారణం.

సి ఎం ఐ ఇ ఇచ్చిన వివరాలు దీనికి రుజువుగా ఉన్నాయి. జనవరి 2023లో 40 కోట్ల 99 లక్షల మంది మొత్తం ఉద్యోగులు, కార్మికులు పనుల్లో ఉంటే మార్చి 2023 నాటికి 40 కోట్ల 70 లక్షల మంది మాత్రమే ఉన్నారు. (రెండు నెలల్లో 29 లక్షల మేరకు ఉద్యోగాలు తగ్గిపోయాయి) 2018-19లో దేశంలో ఉద్యోగులు, కార్మికుల సంఖ్య 40 కోట్ల 89 లక్షలు. అంటే నాలుగేళ్ల తర్వాత దేశంలో ఉద్యోగాల సంఖ్య నికరంగా తగ్గిపోయింది. కొత్తగా ఉద్యోగాలు కల్పించడం మాట అటుంచి నాలుగేళ్ల క్రితం ఉన్న ఉద్యోగాలు కూడా ఇప్పుడు లేవు. ఇది భయంకర వాస్తవం.



> జనవరి 2023లో 40 కోట్ల 99 లక్షల మంది మొత్తం ఉద్యోగులు, కార్మికులు పనుల్లో ఉంటే మార్చి 2023 నాటికి 40 కోట్ల 70 లక్షల మంది మాత్రమే ఉన్నారు. (రెండు నెలల్లో 29 లక్షల మేరకు ఉద్యోగాలు తగ్గిపోయాయి) 2018-19లో దేశంలో ఉద్యోగులు, కార్మికుల సంఖ్య 40 కోట్ల 89 లక్షలు. అంటే నాలుగేళ్ల తర్వాత దేశంలో ఉద్యోగాల సంఖ్య నికరంగా తగ్గిపోయింది. కొత్తగా ఉద్యోగాలు కల్పించడం మాట అటుంచి నాలుగేళ్ల క్రితం ఉన్న ఉద్యోగాలు కూడా ఇప్పుడు లేవు. ఇది భయంకర వాస్తవం.

కానీ ప్రభుత్వ అధికార ప్రతినిధులు మాత్రం దేశంలో ఉపాధి కల్పన పెరిగిపోతోందని చెప్పుకుంటున్నారు. సిఎంఐఇ విడుదల చేసే గణాంకాలను నమ్మవద్దని, అధికారికంగా ప్రభుత్వం నిర్వహించే పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని వాళ్లు చెప్తున్నారు. గ్రామీణ ఉపాధి హామీ కింద పనులు కావాలని కోరేవారి సంఖ్య తగ్గిపోతోందని, అటువంటప్పుడు నిరుద్యోగం పెరిగిందని నిర్ధారించడం ఏ విధంగా సబబు అని వాళ్లు అడుగుతున్నారు కూడా.

ప్రభుత్వం చేసే వాదనలో పస లేదు. ప్రభుత్వం చేపట్టే పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో ఇళ్ల వద్ద జరిగే పనులను (హోం బేస్డ్ వర్క్) ను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అటువంటి పనులకు కూలీ చెల్లించడం అనేది ఉండదు. అటువంటి పనులను సిఎంఐఇ లెక్కలోకి తీసుకోదు. కుటుంబానికి వెలుపల లే-ఆఫ్‌ల ఫలితంగా పనులు తగ్గిపోయినప్పుడు ఆ కారణంగా పనులు కోల్పోయినవాళ్లు ఇళ్ల వద్ద జరిగే పనుల్లో పాలు పంచుకుంటారు. అప్పుడు వాళ్లని నిరుద్యోగులుగా ప్రభుత్వ సర్వే పరిగణించదు. అందువల్ల ప్రభుత్వ సర్వేలో నిరుద్యోగం పెరిగినట్టు కనపడదు. ఒకవైపు లే-ఆఫ్‌లు పెరిగినా, ఇంకోవైపు నిరుద్యోగం పెరిగినట్టు ప్రభుత్వ సర్వే చెప్పదు.

> ఉపాధి హామీ పనులకు చెల్లించవలసిన వేతనాలను బకాయి పెడుతున్నది కేంద్ర ప్రభుత్వం. దాని కారణంగా ఆ పనుల పట్ల గ్రామాల్లో ఉత్సాహం తగ్గిపోతే దానిని చూపించి నిరుద్యోగం తగ్గిపోయిందని గొప్పగా చెప్పుకుంటున్నది.

సిఎంఐఇ సర్వేతో ఇటువంటి సమస్య లేదు. ఆ సర్వే హోం బేస్డ్ వర్క్‌ను పరిగణనలోకి తీసుకోదు. ఇళ్ల వద్దే పనులు చేసుకుంటూ బతుకుతెరువు కలిగివున్న కొంతమంది సిఎంఐఇ సర్వేలో కవర్ కారు. కానీ వేతనం పొందుతూ పని చేసేవారి పరిస్థితిని యధాతథంగా సిఎంఐఇ సర్వే చూపిస్తుంది. అందువల్ల నిరుద్యోగ పరిస్థితి వాస్తవ స్వరూపాన్ని సిఎంఐఇ సర్వే వెల్లడిస్తుంది.

లాక్‌డౌన్ కాలంలో పట్టణాలను విడిచి తమ స్వగ్రామాలకు పోయినవారిలో కొందరు తిరిగి పట్టణాలకు తరలి వచ్చిన మాట వాస్తవం. అందువల్ల లాక్‌డౌన్ కాలంలో ఉపాధి హామీ పనులు కోరుకున్నంతమంది ఇప్పుడు కోరుకోవడం లేదు. కానీ దేశం మొత్తం మీద నిరుద్యోగం పెరిగిన మాట వాస్తవం. కరోనాకు పూర్వం ఉన్న పరిస్థితితో పోల్చుకున్నా నిరుద్యోగం పెరిగింది. లాక్‌డౌన్ కాలంలో ఎంత పెరిగిందో ఆ మేరకైనా ఇప్పుడు తగ్గలేదు.

పైగా ఉపాధి హామీ కింద పనులు కల్పించమని కోరుతున్నవారి సంఖ్య తగ్గడానికి ఇంకో కారణం కూడా ఉంది. వారికి చెల్లించవలసిన వేతనాల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఏరోజుకు ఆ రోజు కూలీ డబ్బులమీద ఆధారపడి బతికే కుటుంబాలు ఇలా కూలీ డబ్బులు బకాయి పడితే అటువంటి పనులకు పోవడానికి ఎందుకు సిద్ధపడతారు ? అందుచేత ఉపాధి హామీకింద పనులు కోరేవారు తగ్గిపోయారు కనుక నిరుద్యోగం తగ్గిపోయినట్టేనన్నది సరైన వాదన అనిపించుకోదు. ఉపాధిహామీ పనులకు చెల్లించవలసిన వేతనాలను బకాయి పెడుతున్నది కేంద్ర ప్రభుత్వం. దాని కారణంగా ఆ పనుల పట్ల గ్రామాల్లో ఉత్సాహం తగ్గిపోతే దానిని చూపించి నిరుద్యోగం తగ్గిపోయిందని గొప్పగా చెప్పుకుంటున్నది. ఈ ప్రభుత్వానికి ఎంత వెటకారంగా ఉందో చూడండి.

వేతనాలను చెల్లించే పనులు తగ్గిపోతే ఆ పనులు పోగొట్టుకున్నవారు ఇళ్ల వద్ద జరిగే పనుల్లో తక్కిన కుటుంబ సభ్యులతోబాటు భాగస్వాములౌతారు. అప్పుడు ఆ కుటుంబంలో ఇంటిదగ్గర చేసే పనికి ప్రతిఫలంగా లభించే ఆదాయాన్ని పంచుకునేవారు పెరుగుతారు. దాని వల్ల వారి సగటు ఆదాయం తగ్గిపోతుంది. ప్రభుత్వం నిర్వహించే పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే ప్రకారమే ఇళ్ల వద్ద పని చేసుకునే స్వయం ఉపాధి పనుల కార్మికుల ఆదాయాలు తగ్గిపోయాయి. పట్టణాల్లోను, గ్రామాల్లో సైతం స్వయం ఉపాధి . పనులు చేసుకునే వారి సగటు ఆదాయం 2019 ఏప్రిల్-జూన్ కాలంతో పోల్చితే 2022 ఏప్రిల్-జూన్ నాటికి తగ్గిపోయినట్టు ప్రభుత్వ లెక్కలే వెల్లడి చేస్తున్నాయి. ఈ వాస్తవం కూడా సిఎంఐఇ గణాంకాలు విశ్వసనీయమైనవేనని ధృవపరుస్తున్నాయి.

భారతదేశంలోని నిరుద్యోగ పరిస్థితికి సంబంధించిన గణాంకాలు ఒక మౌలిక విషయాన్ని వెల్లడిస్తున్నాయి. నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ఏనాటికీ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి తోడ్పడదు. ఈ నయా ఉదారవాద విధానాలను ప్రవేశపెడుతున్నప్పుడు పాలకులు, వారిని సమర్ధించే మేధావులు మనకు చెప్పింది ఏమిటి? ఈ విధానాల ఫలితంగా సంపన్న దేశాలనుండి పెట్టుబడి పెద్ద ఎత్తున మూడో ప్రపంచదేశాలకు తరలి వస్తుందని, దాని వల్ల ఇక్కడ చాలా పెద్ద మోతాదులో ఉద్యోగాలు కల్పించబడతాయని వారు అప్పుడు నమ్మబలికారు. ఆ విధంగా జరగాలంటే ఆ పెట్టుబడుల ప్రవాహాలకు ప్రభుత్వం ఏ విధమైన ఆటంకాలనూ కల్పించకుండా, వాటికి తోడ్పడాలని, విదేశీ పెట్టుబడిదారులు కోరిన సహకారాన్నంతటినీ అందించాలని వాదించారు. ఆ విధంగా చేస్తే దేశంలో నిరుద్యోగమే లేకుండా పోతుందని, దేశం అభివృద్ధి చెందుతుందని ప్రచారం చేశారు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో పూర్తిస్థాయిలో అందరికీ ఉపాధి కల్పించడం అనేది ఏ నాటికీ జరగదు. పెట్టుబడిదారులకు ఎంతో కొంత నిరుద్యోగం ఉండడం అవసరం. అప్పుడే వాళ్లు కార్మికుల వేతనాలను తక్కువ స్థాయికి కుదించగలుగుతారు. నయా ఉదారవాద విధానాల వల్ల పూర్తిస్థాయిలో నిరుద్యోగం నిర్మూలించడం జరుగుతుందని ఎవ్వరూ ఆశించలేరు. కానీ ఉన్న నిరుద్యోగం ఎంతో కొంతమేరకు తగ్గి అదనపు ఉద్యోగాలు కల్పించబడతాయని కొందరు అభ్యుదయవాదులు సైతం ఆశపడ్డారు. కానీ నయా ఉదారవాదం వారిని మోసం చేసింది. వలస పాలన నుండి విముక్తి పొంది, ఎంతో కొంతమేరకు స్వతంత్ర ఆర్థిక విధానాలను అమలుచేస్తూ, విదేశీ పెట్టుబడి పట్టును తగ్గించుకోగలిగిన మూడో ప్రపంచదేశాలు మళ్లీ ఆ విదేశీ పెట్టుబడి పెత్తనానికి లోబడిపోయేవిధంగా చేసింది నయా ఉదారవాదవిధానం.

విదేశీ పెట్టుబడులు చిన్న చిన్న దేశాల్లోకి వస్తే అక్కడ ఉండే నిరుద్యోగం సంఖ్య రీత్యా తక్కువగా ఉంటుంది గనుక తగ్గుముఖం పట్టడం జరగవచ్చు. కానీ భారతదేశం వంటి ఎక్కువ జనాభా కలిగివున్న దేశంలో నిరుద్యోగం భారీ సంఖ్యలో ఉంటుంది. ఇటువంటి చోట చిన్న చిన్న దేశాలలో (సింగపూర్, తైవాన్, దక్షిణ కొరియా వగైరా) జరిగిన విధంగా నిరుద్యోగ సమస్య పరిష్కరించబడడం అనేది సాధ్యం కాదు. దానికి తోడు ప్రస్తుతం నయా ఉదారవాద విధానాలే పెద్ద సంక్షోభంలో కూరుకుపోయివున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ సంక్షోభాలు అనివార్యంగా వస్తాయి. ఈ సంక్షోభం నుండి బయటపడే మార్గం ఏదీ లేదు. అటువంటప్పుడు ఆ విధానాలను అమలు చేస్తున్న మన దేశంలో శ్రామిక ప్రజలు అనుభవించే కష్టాలకు సైతం అంతం అనేది లేదు.

నయా ఉదారవాద విధానంలో నిరుద్యోగాన్ని పరిష్కరించే మార్గాలు అంటూ ఏవీ లేవు. పెట్టుబడిదారులు నిరుద్యోగాన్ని పరిష్కరించే బాధ్యత తమది అని ఎప్పటికీ అనుకోరు. ప్రభుత్వం పూనుకుని ఆ బాధ్యతను తీసుకోవాలి. అలా జరగాలంటే ముందు ఈ నయా ఉదారవాద విధానాలనుండి విడగొట్టుకోవాలి. అప్పుడే శ్రామిక ప్రజలకు ఏ ప్రభుత్వమైనా తోడుగా నిలవగలుగుతుంది.

(స్వేచ్ఛానుసరణ)

★

మణిపూర్ అల్లర్లకు బిజెపి బీజం

విశ్లేషణ



ఎం కోటేశ్వరరావు

దేశం సురక్షితమైన చేతుల్లో ఉందన్నారు. పెద్ద నోట్ల రద్దు, ఆర్టికల్ 370 ఎత్తివేత, జమ్మూ - కాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడంతో ఉగ్రవాదుల వెన్ను విరిచినట్లు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. పెద్దన్న అమెరికాతో ఒప్పందం చేసుకొని కీలక సమాచారాన్ని మార్పిడి చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు ఆర్భాటం చేశారు. నిజమే కామోసనుకొని జనం సంతోషించారు. కేంద్ర ప్రత్యక్ష పాలనలో ఉన్న కాశ్మీరులో గత పక్షం రోజుల్లోనే పది మంది సైనికుల ప్రాణాలు తీశారు ఉగ్రవాదులు. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా మిలిటరీ గ్రామాలను నిర్మిస్తోందంటూ అమెరికా ఇచ్చిన సమాచారంతో మీడియా పెద్ద ఎత్తున వార్తలిచ్చింది. ఇప్పుడు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల గురించి ఎలాంటి సమాచారమూ ఇచ్చినట్లు వార్తల్లేవు. మరో రాష్ట్రం మణిపూర్. ఇక్కడ బిజెపి పాలన ఉంది. ఇది రాసిన సమయానికి అక్కడ జరిగిన హింసాకాండలో 55 మంది మరణించినట్లు వార్తలు. వారెలా మరణించిందీ తెలియదు. రాష్ట్రమంతటా ఇంటర్నెట్ బంద్, కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు ఇచ్చి ఆర్టికల్ 355ను ప్రకటించి కేంద్ర బలగాలకు అప్పగించారు. శాంతి భద్రతలను కాపాడడంలో విఫలమైనా రాష్ట్రపతి పాలన పెట్టలేదు, స్వంత పార్టీ కదా !

చిత్రం ఏమిటంటే కర్ణాటక ఎన్నికల్లో ప్రచారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ ఇంత జరుగుతున్నా ఒక్క మాట మాట్లాడిన పాపాన పోలేదు. విలేకర్లతో మాట్లాడేందుకు ఎలాగూ ముందుకు రారు, కనీసం ఒక ప్రకటన లేదా బహిరంగ సభల్లో మాట్లాడితే నోటి ముత్యాలు రాలుతాయన్నట్లు ఉన్నారు. కల్పిత కట్టుకథలతో కేరళ సమాజాన్ని అవమానపరిచేందుకు తీసిన కేరళ స్టోరీ సినిమా గురించి మాట్లాడతారు, ప్రతిపక్షాలు ఉగ్రవాదులతో చేతులు కలిపినట్లు, మద్దతు ఇచ్చినట్లు రాళ్లు వేసేందుకు తీరిక దొరుకుతుంది గానీ కాశ్మీర్, మణిపూర్ గురించి ప్రస్తావించడానికి తీరిక దొరకదు. ఢిల్లీలో రెజ్లర్ల మీద పోలీసు జులం గురించి మాట్లాడరు. స్వంత పార్టీ ఎంపీ మీద పోక్సో కేసు పెట్టినా అరెస్టు లేదు. కర్ణాటకలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రధాని 30 ట్వీట్లు పెట్టారు. వాటిలో సగం కాంగ్రెస్, జెడిఎస్ మీద దాడికి దిగారు. మణిపూర్, కాశ్మీరు, రెజ్లర్ల ఉదంతాలపై ట్వీట్ల ద్వారా కూడా స్పందించలేదు. జై భజరంగ భళీ... అంటూ మతం పేరుతో ఓట్లడిగేందుకు నోరు వచ్చిందన్న విమర్శలొచ్చిన సరే... పదే పదే ప్రస్తావించారు. అడిగేవారెవరు, నిబంధనలను అమలు జరిపేదెవరు? ప్రపంచ నేతగా, విశ్వగురువుగా భక్తుల నుంచి నీరాజనాలు అందుకుంటున్న నరేంద్రమోడీ కాశ్మీరు, మణిపూర్‌లో జరుగుతున్న ఉదంతాలు అల్పమైనవని, వాటి మీద స్పందించడం తన స్థాయికి తగదని మౌనముద్ర దాలుస్తున్నారా?



మణిపూర్‌లోని ఓ సైనిక శిబిరం వద్ద సోమవారం తాత్కాలిక ఆశ్రయం పొందుతున్న ప్రజలు

> చిత్రం ఏమిటంటే కర్ణాటక ఎన్నికల్లో ప్రచారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ ఇంత జరుగుతున్నా ఒక్క మాట మాట్లాడిన పాపాన పోలేదు. విలేకర్లతో మాట్లాడేందుకు ఎలాగూ ముందుకు రారు, కనీసం ఒక ప్రకటన లేదా బహిరంగ సభల్లో మాట్లాడితే నోటి ముత్యాలు రాలుతాయన్నట్లు ఉన్నారు. కల్పిత కట్టుకథలతో కేరళ సమాజాన్ని అవమానపరిచేందుకు తీసిన కేరళ స్టోరీ సినిమా గురించి మాట్లాడతారు, ప్రతిపక్షాలు ఉగ్రవాదులతో చేతులు కలిపినట్లు, మద్దతు ఇచ్చినట్లు రాళ్లు వేసేందుకు తీరిక దొరుకుతుంది గానీ కాశ్మీర్, మణిపూర్ గురించి ప్రస్తావించడానికి తీరిక దొరకదు. ఢిల్లీలో రెజ్లర్ల మీద పోలీసు జులం గురించి మాట్లాడరు.

మణిపూర్ అగ్నిగుండంగా మారేందుకు హైకోర్టు ఇచ్చిన సలహా కారణమైంది. న్యాయమూర్తుల సలహాలు చిచ్చు రేపేవిగా ఉండకూడదు, వాటి పర్యవసానాలను కూడా గమనంలో ఉంచుకోవాలి. రాష్ట్ర జనాభాలో 53 శాతంగా ఉన్న మెయితీ సామాజిక తరగతికి చెందిన వారు తమను షెడ్యూలు కులాల జాబితాలో చేర్చాలని చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. అది వీలవుతుందో కాదో చట్టబద్ధమో కాదో స్పష్టంగా చెప్పాల్సిన కోర్టు.... వారి కోర్కెను పరిశీలించాలని ఏప్రిల్ 20న రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చినట్లు వార్తలొచ్చాయి. దాన్ని గనుక అమలు జరిపితే గిరిజనులుగా ఉన్న కుకీలు, నాగాలు తమ భూములు కోల్పోతామని భయపడ్డారు. అక్కడి బిజెపి ప్రభుత్వం వారి అనుమానాలను తీర్చేందుకు పూనుకోలేదు. ఏప్రిల్ 28న సిఎం బిరేన్ సింగ్ చురుచందపూర్ అనే చోట ఒక జిమ్‌ను ప్రారంభించేందుకు రానుండగా, ముందు రోజు నిరసనకారులు దాన్ని తగులబెట్టారు. గిరిజన-గిరిజనేతర ప్రాంతాలన్నింటా కనిపిస్తే కాల్చివేత ప్రకటించి ప్రభుత్వం మరింత రెచ్చగొట్టింది. గిరిజన విద్యార్థి సంఘం మే మూడో తేదీన చురుచందపూర్‌లో గిరిజన సంఘీభావ ప్రదర్శనకు పిలుపునిచ్చింది. ఆ సందర్భంగా హింసాకాండ చెలరేగింది. గిరిజనేతర ప్రాంతాల్లోని గిరిజనుల మీద, చర్చిల మీద దాడులు జరిపారు. అప్పటి నుంచి రాష్ట్రం అగ్నిగుండంగా మారింది.

మణిపూర్ భూ సంస్కరణల చట్టం ప్రకారం గిరిజనులు నివసించే కొండ ప్రాంతాల్లో గిరిజనేతరులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకొనేందుకు, భూములు కొనేందుకు వీల్లేదు. గిరిజనేతరులు ఇంఫాల్ లోయ ప్రాంతానికే పరిమితం కావాలి. అక్కడ రాష్ట్రంలోని భూమిలో పదిశాతమే ఉంది. గిరిజనులు ఎక్కడైనా స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవచ్చు. గిరిజనేతరుల్లో ఎక్కువ మంది హిందువులు, గిరిజనులంతా క్రైస్తవులు. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను 40 చోట్ల మెయితీలే గెలుపోటములను ప్రభావితం చేస్తారు. వారి మద్దతు కోసమే రాష్ట్రాన్ని బిజెపి అగ్నిగుండంగా మార్చిందా ? విస్తారమైన భూమిని ఏదో ఒక పద్దతిలో స్వంతం చేసుకోవాలని ఈ సామాజిక తరగతి చూస్తున్నదనే ఆరోపణ ఉంది. అందుకు గాను పక్కనే ఉన్న మయన్మార్ నుంచి అక్రమంగా గిరిజనుల వలసలను ప్రోత్సహిస్తున్నట్లు ఆ తరగతి ఆరోపిస్తోంది. అక్రమ వలసలన్నది ఒక సాకు మాత్రమే అని గిరిజనులు అంటున్నారు. వాస్తవాలను వివరించి రెండు సామాజిక తరగతుల్లో ఉన్న అనుమానాలు, అపోహలను తొలగించటంలో గతంలో ఉన్న ప్రభుత్వాలతో పాటు వర్తమాన బిజెపి కూడా విఫలమైంది, మతం పేరుతో ఓటు బాంకు ఏర్పాటుకు పూనుకుంది. తాజా పరిణామాల్లో మణిపూర్‌లో తిరిగి ఉగ్రవాదం తలెత్తితే బిజెపిదే బాధ్యత అవుతుంది.

కాశ్మీరులో నిజంగా ఉగ్రవాదులను, ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించారా ? వాస్తవాలేమిటి? బిజెపి చేసుకుంటున్న ప్రచారంలో నిజమెంత ? ఇక్కడ ఉగ్రవాదాన్ని ఐదు దశలుగా విభజించాలి. ఎప్పుడు ఎవరి పాలనలో ఏం జరిగిందో దక్షిణాసియా టెర్రరిజం పోర్టల్ వివరాలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. 1988 నుంచి 1997వరకు కాంగ్రెస్ పాలన.1998 నుంచి 2003 వరకు ఎన్‌డిఏ వాజ్‌పాయి ఏలుబడి, 2004 నుంచి 2013వరకు తిరిగి కాంగ్రెస్ పాలన. 2014 నుంచి ఇప్పటి వరకు నరేంద్రమోడీ అధికారం.2019 ఆగస్టు నుంచి కాశ్మీరు కేంద్రపాలిత ప్రాంతంగా మారింది.

కాశ్మీరులో నిజంగా ఉగ్రవాదులను, ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించారా ? వాస్తవాలేమిటి? బిజెపి చేసుకుంటున్న ప్రచారంలో నిజమెంత ? ఇక్కడ ఉగ్రవాదాన్ని ఐదు దశలుగా విభజించాలి. ఎప్పుడు ఎవరి పాలనలో ఏం జరిగిందో దక్షిణాసియా టెర్రరిజం పోర్టల్ వివరాలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. 1988 నుంచి 1997వరకు కాంగ్రెస్ పాలన.1998 నుంచి 2003 వరకు ఎన్‌డిఏ వాజ్‌పాయి ఏలుబడి, 2004 నుంచి 2013వరకు తిరిగి కాంగ్రెస్ పాలన. 2014 నుంచి ఇప్పటి వరకు నరేంద్రమోడీ అధికారం. 2019 ఆగస్టు నుంచి కాశ్మీరు కేంద్రపాలిత ప్రాంతంగా మారింది. కాశ్మీరులో ఆర్టికల్ 370 రద్దు, కొత్తగా భద్రతా దళాలకు అధికారం ఇచ్చినట్లు ప్రచారం చేసుకున్న కాలంలో జరిగిన పరిణామాలను చూసినపుడు ఉగ్రవాదం పూర్తిగా నిర్మూలన కాలేదు. వాజ్‌పాయి పాలనతో పోల్చినపుడు అదే కాశ్మీరులో ఆర్టికల్ 370 ఉండగా కూడా కాంగ్రెస్ ఏలుబడిలో ఉగ్రవాదం తగ్గినట్లు అంకెలు చెబుతున్నాయి. పలు కారణాలతో ఉదంతాలు తగ్గినపుడు తమ ఘనతగాను, లేనపుడు పాక్ కుట్రగానూ వర్ణిస్తే కుదురుతుందా ? తగ్గినపుడు పాక్ దూరంగా ఉందని చెబుతారా ?

పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో గోవాలో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సిఒ) సమావేశానికి హాజరైనపుడే ఉగ్రవాదులు మన పారా ఎస్‌ఎఫ్(స్పెషల్ ఫోర్సెస్) దళానికి చెందిన ఐదుగురు కమాండోలను చంపారు. అదే జమ్మూ ప్రాంతంలో ఏప్రిల్ 20న ఐదుగురు సైనికులను చంపారు. తాజా ఉదంతాలను చూసినపుడు ఉగ్రవాదులు కాశ్మీరు నుంచి జమ్మూకు తమ కుట్రలను విస్తరింప చేసినట్లు కనిపిస్తోంది. చిన్న బృందాలుగా దాడులు చేసేందుకు శిక్షణ పొందినట్లు కూడా చెబుతున్నారు. అది పాకిస్తాన్‌లో తప్ప మన గడ్డమీద సాధ్యం కాదు. వీటి గురించి మనకు అమెరికా ఎందుకు సమాచారం అందించటం లేదన్నది ప్రశ్న. పూంచ్‌లో ఏప్రిల్ 20న జరిపిన దాడిలో ఉపయోగించిన ఆయుధాలు, పేలుడు పదార్ధాలు ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా మిలిటరీ వదలి వెళ్లినవని గుర్తించారు. వాటిని అక్కడి తాలిబాన్లు మన దేశంలోని ఉగ్రవాదులకు అందిస్తే తప్ప దొరికేవి కాదు. మరోవైపున ఉగ్రవాదులు స్థానికంగా, విదేశాల నుంచి నిధులు సేకరిస్తున్న ఇటీవల జాతీయ దర్యాప్తు సంస్థ జరిపిన సోదాల్లో దొరికిన సమాచారం వెల్లడించింది. పెద్ద నోట్ల రద్దుకు ఉగ్రవాదులకు నిధులు దొరక్కుండా చేయడం ఒకటని చెప్పారు. మరి ఇప్పుడు దీనికి ఏ సాకు చెబుతారు ? పాత నోట్లు రద్దు చేసి కొత్తగా రెండువేల నోట్లు ముద్రించి మరింత పెద్ద మొత్తాలను సులభంగా అందచేసేందుకు అదే మోడీ సర్కార్ వీలు కల్పించింది.

★

రైతులను మోసగించిన వ్యాపారి

- పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసిన వ్యాపారి.. నాలుగేళ్లుగా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని జిల్లా ఎస్పీకి గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు మండలం సొపాడు గ్రామానికి చెందిన 22 మంది రైతులు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు... 2019 నుంచి 2023 వరకు జొన్న, మొక్కజొన్న, మినుము తదితర ఉత్పత్తులను వ్యాపారి సుబ్రమణ్యం కొనుగోలు చేశాడు. దాదాపు రూ.72 లక్షల నగదు రైతులకు చెల్లించాలి. ఒక్కో రైతుకు సగటున రూ.రెండు నుంచి రూ.నాలుగు లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ అంశంపై వట్టిచెరుకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు తెలిపారు. వెంటనే సుబ్రమణ్యంపై కేసు నమోదు చేసి తమ సొమ్ము తమకు ఇప్పించాలని ఎస్పీని వేడుకున్నారు.

మైనార్టీ ద్రోహి జగన్ : టిడిపి మైనార్టీ నేతల విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్ మైనార్టీ ద్రోహి అని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్, మాజీ మంత్రి ఎమ్‌డి ఫరూఖ్, టిడిపి మైనార్టీ అధ్యక్షులు ముస్తాక్ అహ్మద్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం వారు ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. హజ్ యాత్రికులకు జగన్ పెద్ద నిరాశే మిగిల్చారని పేర్కొన్నారు. ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రం నుంచి వెళ్లే హజ్ యాత్రికులకు రూ.83 వేలు అదనంగా విమాన ఛార్జీలు విధించటం విస్మయానికి గురిచేసిందని తెలిపారు. తెలంగాణ నుంచి వెళ్లేవారికి రూ.3,05,000 ఖర్చవుతోందని, రాష్ట్రం నుంచి వెళ్తున్న వారికి మాత్రం రూ.3,88,000 ఖర్చు భరించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి విజయవాడ విమానాశ్రయం 250 కిలోమీటర్ల దూరంలో ఉందన్న నెపంతో అదనంగా రూ.83 వేలు చెల్లించాల్సిన పరిస్థితి రావడాన్ని యాత్రికులు జీర్ణించుకోలేకపోతున్నారని, దీనిని టిడిపి తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. చంద్రబాబు కృషి వల్ల విజయవాడ విమానాశ్రయం నుంచి మక్కాకు నేరుగా వెళ్లేందుకు సాధ్యమైందని, దీనిని జగన్ హరించి అదనపు భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాన్ని ప్రశ్నించే సత్తాలేని జగన్‌కు కనీసం ఈ విషయంలోనైనా కేంద్రంతో చర్చలు జరిపి అదనపు భారం తగ్గించే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. మైనార్టీల సంక్షేమం కోసం గత ప్రభుత్వం అమలుచేసిన దాదాపు 10 పథకాలను రద్దు చేశారని విమర్శించారు.

రాజస్థాన్‌లో కుప్పకూలిన మిగ్ 21 .. ముగ్గురు పౌరులు మృతి

హనుమాన్‌గఢ్ : భారత వాయుసేనకు చెందిన మిగ్-21 యుద్ధ విమానం సోమవారం రాజస్థాన్‌లో కూలిపోయింది. హనుమాన్‌గఢ్ జిల్లాలో ప్రమాదవశాత్తు ఓ ఇంటిపై కుప్పకూలిందని, ఈ ఘటనలో ముగ్గురు స్థానికులు మరణించారని అధికారులు తెలిపారు. రోజువారీ శిక్షణలో భాగంగా సోమవారం ఉదయం మిగ్-21 యుద్ధ విమానం సూరత్‌గఢ్ ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయ్యింది. కాసేపటికే ఈ యుద్ధ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో హనుమాన్‌గఢ్‌లోని డబ్లి ప్రాంతంలోని ఓ ఇంటిపై కూలిపోయింది. విమానం కూలిపోవడంతో ఇంట్లో ఉన్న ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన పైలట్.. పారాచూట్ సాయంతో బయటకు దూకేశారు. దీంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయని బికనీర్ ఐజి ఓం ప్రకాశ్ తెలిపారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించామని చెప్పారు.

క్వింటాలు పసుపును రూ.6850కు కొనాలి

- జొన్నా శివశంకరరావు, పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

పసుపు క్వింటా మద్దతు ధర ప్రకారం రూ.6850లకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివ శంకరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ నిరసన పిలుపులో భాగంగా సోమవారం ఎంటిఎంసి పరిధిలోని ప్రాతూరు, చిర్రావూరు, కుంచనపల్లి, వడ్డేశ్వరం గ్రామాల్లో ఆర్‌బికెల్లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు మాట్లాడారు. అకాల వర్షాలకు పసుపు పంట కల్లాల్లోనే తడిచిపోయిందన్నారు. దీంతో రంగుమారిన పసుపు పంటను క్వింటా రూ.4200 నుంచి రూ.4000 రైతల వద్దనుండి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారన్నారు. వరుస నష్టాలతో పసుపు రైతు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, మద్దతు ధర రూ.6850 లకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా భారీగా పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా క్వింటా పసుపునకు రూ. పదివేల మద్దతు ధర ప్రకటించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు డి వెంకటరెడ్డి, బత్తుల సంసోను, కాజ వెంకటేశ్వరరావు, మోదుగుల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రాతూరు ఆర్‌బికె అధికారికి వినతి పత్రం ఇస్తున్న జొన్నా శివశంకరరావు, తదితరులు

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - పెద్దారవీడు (ప్రకాశం)

బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ప్రకాశం జిల్లా పెద్దారవీడులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెద్దారవీడులో నివాసం ఉంటున్న చిన్నారి తల్లి కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుంది. అమ్మమ్మ ఇంటిలో ఉంటూ.. అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. ఊరిలో గత శనివారం నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వర స్వామి గుడి వేడుకలు జరిపారు. ఆ వేడుకలకు చిన్నారితో పాటు అమ్మమ్మ వెళ్లింది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్న సమయంలో ఎండ వేడిమికి తాళలేక చిన్నారి ఇబ్బంది పడుతుంటే...అదే గ్రామానికి చెందిన చెంచిరెడ్డి సైకిల్‌పై చిన్నారిని ఎక్కించింది. ఇంటి వద్ద విడిచిపెట్టాలని చిన్నారి అమ్మమ్మ కోరింది. గ్రామంలోని చెరువు సమీపంలో సైకిల్‌ను నిలిపి...ముళ్లపొదల్లోకి చిన్నారిని తీసుకువెళ్లి చెంచిరెడ్డి లైంగిక దాడికి పాల్పడ్డాడు. వెనుక నడుచుకుంటూ వస్తున్న చిన్నారి అమ్మమ్మ గమనించి, స్థానికుల సహాయంతో దేహశుద్ధి చేసింది. చిన్నారి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు.

ధనలక్ష్మిది ప్రభుత్వ హత్యే : వైవిబి రాజేంద్రప్రసాద్, లక్ష్మీ ముత్యాలరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లా దర్శి మండలం రామచంద్రపురం వైసిపి సర్పంచ్ బాదం ధనలక్ష్మి ఆత్మహత్య ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ హత్యేనని, దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకున్న ధనలక్ష్మి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణితో సర్పంచులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తుందని ముందునుంచి సర్పంచుల సంఘం చెబుతున్న మాట నిజమైందని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12,918 మంది అధికార, ప్రతిపక్ష సర్పంచుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దొంగలించిన ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లను తక్షణమే గ్రామ పంచాయతీల అకౌంట్లలో జమ చేయాలన్నారు.



యండమూరికి పురస్కారాన్ని అందిస్తున్న పరిషత్ బృందం

ముగిసిన కొలంకపురి కళాపరిషత్ నాటిక పోటీలు

- యండమూరికి గోపరాజు శివరామశర్మ జీవిత సాఫల్య పురస్కారం
- ఉత్తమ ప్రదర్శనగా అతీతం

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

నాటక కళా మా తల్లికి వినూత్న హారం కొలంకపురి నాటక కళాపరిషత్ జీవిత సాఫల్య పురస్కారమని ప్రముఖ సినీ, నాటక, నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు.

తెనాలి రూరల్ కొలకలూరు గ్రామంలో ఈనెల ఐదున ప్రారంభమైన కొలంకపురి కళాపరిషత్ నాటిక పోటీలు సోమవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా గోపరాజు వెంకట శివరామశర్మ జీవిత సాఫల్య పురస్కారంతో యండమూరిని సత్కరించారు. ప్రముఖ నాటక రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షతన జరిగిన పురస్కార సభలో పురస్కార గ్రహీత యండమూరి మాట్లాడుతూ.. 75ఏళ్ళ తన రచనా ప్రస్థానంలో 20వ ఏట నుంచే సత్కారాలు, సన్మానాలు ప్రారంభమయ్యాయన్నారు. రఘుపతి రాఘవ రాజారామ్ నాటకంతో ప్రొఫెషనల్‌గా గుర్తింపు పొందానన్నారు. మనుషులొస్తున్నారు జాగ్రత్త, రుద్రవీణ నాటకాల రచనలు మరింత దోహదం చేశాయన్నారు. కొలంకపురి నాటక కళాపరిషత్ ఉన్నంత కాలం రంగస్థలానికి కొదువలేదన్నారు. తన రచనలో శైలి, శిల్పం, పాత్రధారణ, నాచురలిజమ్, అప్‌సెట్ థియేటర్ వంటి అన్నింటికీ ఆద్యులైన గురువులు దేచిరాజు హనుమంతరావుకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లు చెప్పారు. నాటిక పోటీల చివరి రోజున ప్రముఖ రంగస్థల సీనియర్ కళాకారులు, రచయితలు, దర్శకులకు కెఎస్‌టి శాయి, జిఎస్‌ఆర్‌కె శాస్త్రి, డిఎస్సార్ మూర్తి, ఎస్‌కె మిశ్రో, ఎంసి దాస్, బిఎం రెడ్డి, మల్లాల శివన్నారాయణలకు దర్శక, దార్శనిక పురస్కారాలతో కళాపరిషత్ సత్కరించింది.

నాలుగు రోజులపాటు నిర్వహించిన నాటిక పోటీల విజేతల వివరాలను పరిషత్ తరపున గోపరాజు విజయ్ వెల్లడించారు. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'అతీతం', ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా విశాఖపట్టణం తెలుగు కళాసమితి వారి ప్రదర్శన 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత', తృతీయ ప్రదర్శనగా ఏలూరుకు చెందిన హేలాపురి కల్చరల్ అసోసియేషన్ వారి 'మనసున మనసై' నాటికలు ఎంపికయ్యాయి.

ఈ ఏడాదిలోనే నివేదిక

- ఇతర మతాల్లోకి మారిన దళితుల ఎస్‌సి హోదాపై మాజీ సిజెఐ కెజి బాలకృష్ణన్

న్యూఢిల్లీ : సిక్కు, బౌద్ధంలోకి కాకుండా ఇతర మతాల్లోకి మారిన దళితుల ఎస్‌సి హోదాపై ఈ ఏడాదిలోనే నివేదిక ఇస్తామని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కెజి బాలకృష్ణన్ తెలిపారు. ఈ అంశంపై విచారణ చేస్తున్న కమిషన్‌కు బాలకృష్ణన్ నేతృత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. తమ కమిషన్ ఈ ఏడాదిలోనే నివేదిక ఇస్తుందని చెప్పినా, తమ కమిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఇంకా అన్ని సౌకర్యాలు పూర్తిగా కల్పించడం లేదని బాలకృష్ణన్ విమర్శించారు. 'కార్యాలయం మాత్రమే కేటాయించారు. మిగిలిన అన్ని సౌకర్యాలు కల్పించలేదు. పని ప్రారంభమయితే.. కేవలం ఏడాదిలోనే నివేదిక ఇస్తాం' అని తెలిపారు. ఈ కమిషన్‌కు కేంద్రం రెండేళ్ల సమయం ఇచ్చింది. ఇందులో సగం సమయంలోనే నివేదిక ఇస్తామని బాలకృష్ణన్ చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. బాలకృష్ణన్ కమిషన్ నివేదిక కోసం వేచి చూడాలా.. వద్దా.. అనే విషయంపై సుప్రీంకోర్టులో ప్రస్తుతం తీవ్రంగా చర్చ నడుస్తోంది. క్రైస్తవంలోకి మారిన దళితులకు ఎస్‌సి హోదా కల్పించాలని కోరుతూ దాఖలైన పిటీషన్లను సుప్రీంకోర్టు విచారిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పిటీషన్లు సుమారు 19 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. బాలకృష్ణన్ కమిషన్ నివేదిక వచ్చే వరకూ ఆగాలని సుప్రీంకోర్టును కేంద్ర ప్రభుత్వం కోరుతుంది. ఏప్రిల్ 12న జరిగిన విచారణలో 'ఈ రోజు ఈ కమిషన్ వేశారు. రేపు ఇంకొక కమిషన్ వస్తుంది' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 19 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పిటీషన్లను త్వరగా విచారిద్దామని జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా తెలిపారు. బాలకృష్ణన్ కమిషన్ నివేదిక కోసం వేచి ఉండొద్దని పిటీషనర్ల తరుపు న్యాయవాదులు కూడా కోరుతున్నారు.

స్వర్ణ దేవాలయం సమీపంలో మరోసారి పేలుడు

అమృతసర్ : పంజాబ్‌లోని అమృతసర్ లో స్వర్ణ దేవాలయం సమీపంలో సోమవారం మరో బాంబు పేలుడు ఘటన జరిగింది. స్వర్ణ దేవాలయానికి వెళ్లే మార్గంలోని దర్బార్ సాహిబ్ వద్ద ఈ పేలుడు జరిగిందని పోలీసులు తెలిపారు. పేలుడులో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. ఉదయం 6.30 గంటల సమయంలో పేలుడు జరిగిందని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. గంటల వ్యవధిలోనే రెండు పేలుళ్లు జరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేలుళ్లపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. గత శనివారం రాత్రి కూడా ఇదే దర్బార్ సాహిబ్ వద్ద పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే.

రేషన్ వాహనాల కేసును సమగ్రంగా విచారిస్తాం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

సంచార వాహనాల్లో నిత్యావసర సరుకులను ప్రతి ఇంటికీ వెళ్లి పంపిణీ చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమగ్ర విచారణ చేపడతామని హైకోర్టు చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. సంచార వాహనాల ద్వారా రేషన్ సరుకుల రవాణా చేసేందుకు వీలుగా ప్రభుత్వం జారీ చేసిన జిఓలను సవాల్ చేస్తూ ఎపి రేషన్ షాపుల డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరామారావు, చిట్టిరాజు దాఖలు చేసిన పిటిషన్లను సోమవారం విచారించింది. పాత విధానం కొనసాగించేందుకు ఆదేశాలివ్వాలని పిటిషనరు తరపున న్యాయవాది కె శ్రీనివాస్ వాదించారు. సంచార వాహనాల ఏర్పాటు వల్ల ప్రభుత్వంపై భారం పడుతుందన్నారు. ఈ విధానం వల్ల డీలర్లకు ఏవిధమైన నష్టం లేదని ప్రభుత్వం తరపున న్యాయవాది శ్రేయాస్‌రెడ్డి ప్రతివాదన చేశారు. ప్రజల సౌలభ్యం కోసమే ఈ విధానం అమల్లోకి వచ్చిందని, విధాన నిర్ణయమని చెప్పారు. విచారణ జులై 3కు వాయిదా పడింది.

రాజధానిలో 6 గ్రామాల్లో ఇతరులకు స్థలాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అమరావతి రాజధాని ప్రాంతంలో ఇతరులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంపై నిరసనలు వ్యక్తమవుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం వెనకడుగు వేయడం లేదు. ఏకంగా అక్కడి భూములను నేరుగా కలెక్టర్లకు ఎప్పుడో అప్పగించేసింది. గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్ల నుంచి ప్రతిపాదనలు రావడం, వాటిని ఆమోదించాలంటూ ఉత్తర్వులు రావడం టకటకా భూమిని అప్పగించడం జరిగిపోయాయి. మొత్తం 1,134 ఎకరాల భూమిని ఇతరులకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని నిర్ణయించారు. ఐనవోలు, మందడం, కృష్ణాయపాలెం, నౌలూరు. కురగల్లు, నిడమర్రు గ్రామాల్లో ఈ స్థలాలు ఇవ్వనున్నారు. ఇందులో గుంటూరు జిల్లాకు సంబంధించిన వారికి 550.65 ఎకరాల భూమిని, ఎన్‌టిఆర్ జిల్లాలోని వారికి 583.93 ఎకరాలను కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. అత్యధికంగా నిడమర్రులోనే ఎన్‌టిఆర్ జిల్లాకు 489.55 ఎకరాలను కేటాయించడం విశేషం.

రాష్ట్రాలకు ఆ హక్కు ఉంది

- వెనుకబడిన తరగతుల వివరాలు సేకరించవచ్చు
- కులగణనపై న్యాయ, రాజ్యాంగ నిపుణుల మనోగతం



న్యూఢిల్లీ : కులాలపై సర్వే జరిపే హక్కు రాష్ట్రాలకు ఉండదంటూ పాట్నా హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై న్యాయ, రాజ్యాంగ నిపుణులు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కుల సర్వేలు నిర్వహించి సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారి సమాచారాన్ని సేకరించే హక్కు రాష్ట్రాలకు ఉంటుందని పలువురు నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సర్వే అనేది జనాభా లెక్కల సేకరణ కిందికే వస్తుందని, ఆ పని చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని పాట్నా హైకోర్టు తన తీర్పులో తెలిపింది. దీనిపై రాజ్యాంగ నిపుణుడు పీడీటీ ఆచారి తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ పదేళ్ల కొకసారి జనగణన చేయడం కేంద్ర ప్రభుత్వ పనేనని, అయితే సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి సంబంధించిన వివరాలను రాష్ట్రాలు సేకరించవచ్చునని చెప్పారు. రాష్ట్రాలలో సంక్షేమ పథకాల అమలుకు ఈ సమాచారం అవసరమని తెలిపారు.

'సర్వేపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని ఎదురు దెబ్బగా భావించకూడదు. ఉమ్మడి జాబితా ప్రకారం కుల సర్వేలు జరిపే హక్కు రాష్ట్రాలకు ఉంది. అది జనగణనా కాదా అనేది తెలుసుకునేందుకే హైకోర్టు స్టే విధించింది. జనగణనను కేంద్రమే నిర్వహించాలి. అయితే జనాభాలో ఏ వర్గానికైనా సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అనుకుంటే ఆ వర్గం వారి సంఖ్యను లెక్కించవచ్చు.' అని ఆచారి వివరించారు. నితీష్ కుమార్ ప్రభుత్వం కుల సర్వే ప్రారంభించిందే తప్ప జనాభా లెక్కల సేకరణ కాదని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా చెప్పారు. దీనికి సంబంధించి 2020లోనే రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు.

2024లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా కులాలపై సర్వే నిర్వహించాలన్న డిమాండ్ పెరుగుతోంది. తమ రాష్ట్రాలలో వెనుకబడిన తరగతుల వారి సామాజిక, ఆర్థిక పరిస్థితుల వివరాలు సేకరించే ప్రక్రియకు ఒడిసా, ఛత్తీస్‌ఘర్ ఇప్పటికే శ్రీకారం చుట్టాయి. కర్నాటకలో 2015లో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కుల సర్వే జరిపింది. సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఏర్పడిన రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ద్వారా ఈ సర్వే జరిగిందని కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి వీరప్ప మొయిలీ గుర్తు చేశారు. రాష్ట్ర కమిషన్ల ద్వారా కులాలు, ఇతర సామాజిక-ఆర్థిక సూచికల కోసం సర్వేలు జరపవచ్చునని ఆయన తెలిపారు.

పేరుకే ఉచితం... గుట్టుగా గుంజుడు

- ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో పేద పిల్లలకు 25 శాతం ఫ్రీ సీట్లు ఇవ్వాలనే నిబంధనకు నీళ్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇచ్చే 25 శాతం ప్రవేశాలకు పలు ఫీజులుంటాయ్ అనే రీతిలో స్కూళ్ల యాజమాన్యాలు వ్యవహరిస్తున్న తీరు తల్లిదండ్రుల్లో చర్చనీయాంశమవుతోంది. అదే సమయంలో ఉచిత ప్రవేశాలపై సరైన ప్రచారం లేకపోవడంతో దరఖాస్తులు పెద్దగా రాని పరిస్థితి రెండు జిల్లాల్లోనూ నెలకొంది. దీంతో రెండు జిల్లాల్లోనూ ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్య నామమాత్రంగా ఉంది. విద్యాహక్కుచట్టం 2009 ప్రకారం ప్రతి ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు ఇవ్వాలనే నిబంధన ఉంది. అయితే ప్రభుత్వాలు అమలు చేయించడం లేదు. దీనిపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో గతేడాది నుంచి దరఖాస్తుల ఆహ్వానం సాగుతోంది. ప్రస్తుతం 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ సాగుతోంది. ఏలూరు జిల్లాలో 527, పశ్చిమగోదావరిలో 360 వరకూ ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఫస్ట్, సెకండ్ ఫేజ్ కింద రెండు విడతల్లో ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఇప్పటి వరకూ ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఏలూరు జిల్లాలో 256 మంది, పశ్చిమలో 204 మంది మాత్రమే ఉన్నారు. రెండు జిల్లాల్లో ఒక్కో స్కూల్‌లో 25 మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం లభించినా 22 వేల మంది పేద విద్యార్థులకు అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకూ సీట్లు పొందిన వారి సంఖ్య చూస్తే వందల్లో కూడా లేదు.

ఉచిత సీటైనా తప్పని ఫీజుల ఒత్తిడి

ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి యాజమాన్యాలు అనేక సాకులు చెబుతూ సొమ్ము గుంజుతున్నాయనే ప్రచారం సాగుతోంది. బహిరంగంగా తల్లిదండ్రులు వెల్లడించలేకపోతున్నప్పటికీ వసూళ్లపై మాత్రం చర్చ సాగుతోంది. ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి అడ్మిషన్ ఫీజు, ఎన్‌రోల్‌మెంట్ ఫీజు పేరిట దాదాపు రూ.మూడు వేల వరకూ వసూలు చేస్తున్నట్లు సమాచారం. స్కూల్ స్థాయిని బట్టి పుస్తకాలకు రూ.ఐదు వేలకుపైగా బాదేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా అనేక కారణాలు చెబుతూ ఫీజు వసూలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. దీంతో గత్యంతరం లేక కొంతమంది ఫీజులు చెల్లిస్తున్నారు. ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఎటువంటి ఫీజూ చెల్లించొద్దని విద్యా శాఖాధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా పరిస్థితి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ప్రయివేటులో ఉచిత ప్రవేశాలపై ప్రచారం కరువు

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించి విద్యాశాఖ సరైన ప్రచారం చేయకపోవడంతో దరఖాస్తులు రావడం లేదని తెలుస్తోంది. వాలంటీర్ వ్యవస్థ ఉన్నప్పటికీ దీనిపై సరైన ప్రచారం లేదనే చెప్పాలి. అధికారులు సైతం మీడియా సమావేశాలు పెట్టి వివరించిన పరిస్థితి లేదు. ఏదో మమ అన్నట్లు మాట్లాడి సరిపెడుతున్నారు. కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలపై ఉపాధ్యాయులకు సైతం సరైన సమాచారం లేదంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. రూ.వేలకు వేలు ఫీజు కట్టలేక సతమతమవుతున్న పేద కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఉచిత ప్రవేశాల గురించి ప్రచారం లేకపోవడంతో తెలియని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఉచిత ప్రవేశం పొందే విద్యార్థి స్కూల్‌కు ఒక కిలోమీటర్ దూరంలో ఉండాలనే నిబంధన సైతం పెనుశాపంగా మారింది. ఈ నిబంధనతో గ్రామాల్లో విద్యార్థులకు ప్రవేశం లేకుండాపోతోంది. మండల కేంద్రం, పట్టణాల్లో ఉన్న కొద్దిమందికి మాత్రమే అవకాశం లభించే పరిస్థితి ఉంది. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకూ సమయం ఉంది. ఇప్పటికైనా ప్రయివేటులో ఉచిత ప్రవేశాలపై పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తే పేద విద్యార్థులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

199 మంది భారత మత్స్యకారులను విడుదల చేయనున్న పాక్

ఇస్లామాబాద్ : జైల్లో ఉన్న 199 మంది భారతీయ మత్స్యకారులను ఈవారం చివరలో విడుదల చేయనున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. తమ దేశ జలాల్లో అక్రమంగా చేపల వేట సాగిస్తున్నారనే ఆరోపణతో 199 మంది భారతీయ మత్స్యకారులను పాక్ ప్రభుత్వం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ మత్స్యకారులు ప్రస్తుతం ఇక్కడి లాంధీ జైలులో ఉన్నారు. 199 మంది మత్స్యకారులను శుక్రవారం విడుదల చేసి స్వదేశానికి పంపించేందుకు సిద్ధం కావాలని సంబంధిత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు తమకు చెప్పినట్లు సింధ్‌లోని జైళ్ల, దిద్దుబాటు విభాగంలోని ఉన్నత పోలీసు అధికారి కాజీ నజీర్ తెలిపారు. ఈ మత్స్యకారులను లాహోర్‌లోని వాఘా సరిహద్దులో భారత అధికారులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. మత్స్యకారులతో స్వదేశానికి తరలించాల్సిన భారతీయ పౌర ఖైదీ జుల్ఫికర్ అనారోగ్యం కారణంగా శనివారం కరాచీలోని ఆసుపత్రిలో మరణించడంతో పాకిస్తాన్ అధికారులు సహృద్భావంతో వారిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. పాకిస్తాన్ ఇండియా పీపుల్స్ ఫోరమ్ ఫర్ పీస్ అండ్ డెమోక్రసీ ప్రకారం, ప్రస్తుతం 631 మంది భారతీయ మత్స్యకారులు, ఒక పౌర ఖైదీ జైలు శిక్షను పూర్తి చేసినప్పటికీ కరాచీలోని లాంధీ, మలిర్ జైళ్లలో ఉన్నారు. గతంలో కూడా కొంతమంది భారతీయ పౌర ఖైదీలు అనారోగ్యంతో ఆసుపత్రుల్లో మరణించారని జైలు అధికారులు తెలిపారు. మొత్తం 654 మంది భారతీయ మత్స్యకారులు కరాచీ జైళ్లలో మగ్గుతుండగా, 83 మంది పాకిస్థానీ మత్స్యకారులు భారతీయ జైళ్లలో ఉన్నట్లు అంచనా. 654 మంది భారతీయ మత్స్యకారులలో 631 మంది శిక్షలు పూర్తి చేసుకుని స్వదేశానికి రావడానికి ఎదురుచూస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోకుండా వసుంధర రాజె అడ్డుకున్నారు : గెహ్లాట్

జైపూర్ : బిజెపి నేత వసుంధరరాజె 2020లో తన ప్రభుత్వం కూలిపోకుండా కాపాడారని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వసుంధర రాజె నియోజకవర్గమైన ధోల్‌పూర్‌లో గెహ్లాట్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2020లో సచిన్ పైలెట్ తిరుగుబాటు సమయంలో తన ప్రభుత్వాన్ని కాపాడేందుకు వసుంధరా రాజె, మరో ఇద్దరు బిజెపి నేతలు సహకరించారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను వసుంధరా రాజె ఖండించారు. గెహ్లాట్ తనను ప్రశంసించడం.. తనపై పన్నిన అతిపెద్ద కుట్ర అని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు లంచం తీసుకున్నట్లు గెహ్లాట్ వద్ద ఆధారాల ఉంటే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అన్నారు.

భారత గగనతలంలోకి ప్రవేశించిన పాకిస్థాన్ విమానం

న్యూఢిల్లీ : పాకిస్తాన్ అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 777 విమానం భారత గగనతలంలోకి ప్రవేశించింది. 10 నిమిషాల పాటు 120కి.మీ మేర భారత గగనతలంలో ప్రయాణించిందని, ఈ విమానాన్ని నిశితంగా పరిశీలించినట్లు భారత వైమానిక దళం ప్రకటించింది. భారీ వర్షం కారణంగా దారితప్పడంతో ఆ విమానం భారత్‌లోకి ప్రవేశించిందని తెలిపింది.

మే 4న, పాకిస్తానీ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ బోయింగ్ 777 (పికె.-248) మస్కట్ నుంచి లాహోర్‌లోని అల్లామా ఇక్బాల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరింది. ఆ విమానం ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండింగ్‌ను నిలిపివేయవలసి వచ్చింది. అదే రోజు రాత్రి ఎనిమిది గంటలకు లాహోర్ విమానాశ్రయంలో ఆ విమానం ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే లాహోర్‌లో భారీ వర్షం కురుస్తోంది. దీంతో పైలట్ విమానాన్ని ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఆ విమానం ఎదుర్కొంటున్న పరిస్థితులపై ఢిల్లీ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అప్రమత్తమైందని, ఆ ప్రాంతంలోని వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని బోయింగ్‌ను పక్కదారి పట్టించాలని అభ్యర్థనను ప్రాసెస్ చేసినట్లు తెలిసింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ సూచనలు మేరకు పైలట్, గో-అరౌండ్ విధానాన్ని ప్రారంభించాడు. లాహోర్ పరిసరాల్లో చక్కర్లు కొట్టాడు. వర్షం భారీగా కురుస్తుండడం, తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ ఉండడం వల్ల దారి తప్పి భారత్‌లోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఆ సమయంలో 13 వేల అడుగుల ఎత్తులో ఉన్న విమానాన్ని 23వేల అడుగుల ఎత్తులోకి తీసుకెళ్లాడు. పంజాబ్‌లోని తరణ్ సాహిబ్, రసూల్‌పుర్ నగరం గుండా వివిధ ప్రాంతాల్లో ప్రయాణించిన ఆ విమానం కాసేపటికి తిరిగి పాకిస్థాన్‌లోని ముల్తాన్‌కు చేరుకుంది. మొత్తం భారత్ గగనతలంలో దాదాపు పది నిమిషాల పాటు చక్కర్లు కొట్టిన పాక్ విమానం.. 120 కిలోమీటర్లు మేర ప్రయాణించింది.

స్థలాలున్నాయి.. ఇళ్లు కట్టించండి ఎమ్మెల్యే గారు..!

ప్రజాశక్తి- వేపాడ

ప్రభుత్వ భూమి ఉంటే పేదలకు ఇల్లు కట్టిస్తామంటూ పలు సమావేశాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పదే పదే చెబుతున్నారే తప్ప పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఒకచోట ప్రభుత్వ స్థలాన్ని చూపిస్తే అందరికీ ఇళ్లు కటించి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే ప్రతి సమావేశంలోనూ చెబుతున్నారు. అయితే వీలుపర్తి రెవెన్యూ పరిధిలో 200 ఎకరాల డిపట్టా భూమి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బోసు రాజు సాగులో ఉన్న విషయం ఎమ్మెల్యేకు, రెవెన్యూ అధికారులకు తెలియదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. చామలాపల్లి రెవెన్యూ పరిధిలో వెంకయ్య పాలెం వద్ద ప్రభుత్వం ఎస్‌సిలకు కొని ఇచ్చిన 24 ఎకరాలు విశాఖకు చెందిన కట్టా కాశీ విశ్వనాథం చేతిలో ఉంది. ఈ విషయం తహశీల్దార్, ఎమ్మెల్యేయకు తెలియదా అని అడుగుతున్నారు. ఇటువంటి భూములను సేకరించి పేదలకు ఇళస్థ్ల కట్టి ఇవ్వాలని ఇళ్లు లేని నిరుపేదలు డిమాండ్ చేస్తున్నారు.

కరాటే ఛాంపియన్ షిప్‌లో పతకాల పంట

ప్రజాశక్తి - కొత్తవలస (విజయనగరం జిల్లా)

అనకాపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన 14వ కేన్యూ రూ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక విద్యార్థులు పది మంది పాల్గొని ప్రతిభ కనబరిచారు. కుమిటి, కాటా విభాగాల్లో పాల్గొన్న ఏదుబిల్లి దేవకీలత రెండు కాంస్య పతకాలు, ఏదుబిల్లి శ్రీలక్ష్మిప్రసన్న రజిత,కాంస్య పతకాలు, కర్రీ జయశ్రీ రజిత, కాంస్య, గొల్లవిల్లి దినేష్ కాంస్య, ఆబోతు సుశ్రిత్ రోషన్ రజిత, పల్లి రోహిత్ సాయి కృష్ణ రజిత, కాంస్య పతకాలు సాధించారు. వీరిని వీరిని కోచ్ సూర్య నూకరాజు అభినందించారు.

మణికంఠ రాథోడ్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను, కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరిస్తున్న కర్ణాటక రాష్ట్రంలోని చిత్తాపూర్ బిజెపి అభ్యర్థి మణికంఠ రాథోడ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు కోరారు. మణికంఠ రాథోడ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం డిఎస్‌పి బి.మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మువ్వల శ్రీనివాసరావు మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆదరణ పెరగడంతో ఇటువంటి బెదిరింపులు చేస్తున్నారన్నారు. హత్యా రాజకీయాలకు కాంగ్రెస్ భయపడదన్నారు. చంపేస్తామని బెదిరిస్తున్న మణికంఠ రాథోడ్ ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

సహారా యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

సహారా కస్టమర్లను మోసం చేసిన సహారా ఇండియా యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని సహారా ఏజెంట్లు, కస్టమర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పూజిత డిమాండ్ చేశారు. సహారా కస్టమర్లకు డిపాజిట్ సొమ్ము చెల్లించాలని కోరుతూ సోమవారం సంస్థానం పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం సహారాలో దాచుకున్న డిపాజిట్ సొమ్మును యాజమాన్యం స్వాహా చేసిందన్నారు. ప్రజల సొమ్మును స్వాహా చేసిన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కస్టమర్లకు న్యాయం చేయాలని కోరారు. కోర్టుతో సంబంధం లేకుండా డిపాజిట్లు చెల్లించాలన్నారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బొబ్బిలి నాయకులు బిఎల్ దాసు, తదితరులు పాల్గొన్నారు.



మత సామరస్యాన్ని కాపాడుకునేందుకు కృషి

- ఈద్ మిలాప్ సభలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో మత సామరస్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు కోరారు. విజయవాడలోని ఎంబివికెలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక, మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరమ్‌ల ఆధ్వర్యంలో రంజాన్ పండగ ముగింపు నేపథ్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భారతదేశ చరిత్రలో మొదటి నుంచి మత సామరస్యానికి పెద్దపీట వుందని అన్నారు. ఎన్నో మతాలు, కులాలు, జాతులు కలిసిమెలిసి సామరస్యంగా వున్నాయని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేసేలా మత సామరస్యానికి విఘాతం కలిగిస్తున్నాయని విమర్శించారు. ప్రజల మధ్య మత ఘర్షణలు పెంచేలా నిరంతరం చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో బిజెపిని ఓడించడం ద్వారానే లౌకికతత్వాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని అన్నారు. మతోన్మాద బిజెపిని రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన బలపర్చడం సరైందికాదన్నారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు పి మధు మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, లౌకికవాదం, సమాఖ్య విధానం, ప్రభుత్వ రంగ సంస్థలు అనే విధానాలను బిజెపి ధ్వంసం చేస్తోందని విమర్శించారు. గవర్నర్లను అడ్డం పెట్టుకుని సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్న బిజెపిని సాగనంపాలన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరహరి శెట్టి నరసింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో అవాజ్ నాయకులు ఎంఎ మతిన్, ఎంబివికె కార్యదర్శి మురళీకృష్ణ, జమీందార్, మహ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులపై వేధింపులు

- ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో కేడర్ స్ట్రెంగ్త్ పేరుతో ఉద్యోగులపై వేధింపులను ఆపాలని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావును కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత ఉద్యోగులకు సమస్యలు పెరిగిపోయాయని వివరించారు. పాలసీ నిర్ణయాలపై అధికారులు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వివరించారు. కేడర్ స్ట్రెంగ్త్ అమలుపై తీసుకుంటున్న నిర్ణయాలపై ఆర్‌టిసిలోని ఉద్యోగ సంఘాలతో చర్చించాలని కోరారు. ఆర్‌టిసిలో చాలా ఏళ్లుగా కారుణ్య నియామకాలు తప్ప వేరే పోస్టుల నియామకాలు చేపట్టడం లేదని, దీంతో సిబ్బంది కొరతతో తీవ్ర పనిఒత్తిడి వుంటోందని అన్నారు. అన్ని విభాగాల్లో సిబ్బందిని తగ్గించేలా చర్యలు చేపట్టడం సరికాదన్నారు. తక్షణమే చొరవ తీసుకుని ఆర్‌టిసి ఉద్యోగులపై ఉన్న ఒత్తిడిని తగ్గించాలని కోరారు.

అర్ధనగ్న ప్రదర్శనతో గ్రీన్ అంబాసిడర్లు భిక్షాటన

ప్రజాశక్తి - రామభద్రపురం

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్లు అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ భిక్షాటన చేశారు. సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ గత18 నెలలు నుండి బకాయి ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. 2020లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల వేతనం అమలు చేయాలన్నారు. కార్మికులకు భద్రత పరికరాలు ఇచ్చి ఇతర సమస్యలు పరిష్కరించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని నినదించారు. బల్ల రిక్షాల మదుపు ప్రభుత్వమే ఇవ్వాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనీ, ప్రమాద బీమా రూ.20 లక్షల వరకు కల్పించాలని కోరారు. కార్మికులు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. బకాయి ఉన్న జీతాలు వెంటనే చెల్లించకపోతే ఎంపిడిఒ ఆఫీసు ముందు రిలే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు కృష్ణ, వెలగాడ సింహచలం, పట్టింగ తౌడు, భవాని, చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

వివిధ కేసుల్లో 144 కేజీల గంజాయి పట్టివేత

శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)

మండలంలోని వివిధ కేసులలో 144 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సింహాద్రి నాయుడు సోమవారం తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. బొడ్డవర చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రంగారెడ్డి జిల్లా హైదరాబాదుకు చెందిన మోహిత్ కుమార్ అరకులో ఒక కేజీ గంజాయి కొనుగోలు చేసి ఆటోలో వస్తుండగా పోలీసులను చూసి ఆటోలోంచి పారిపోయేందుకు ప్రయత్నించగా అతని పట్టుకోగా ఒక కేజీ గంజాయి లభించిందన్నారు. విశాఖకు చెందిన సాయిరాం, వీరస్వామి, నితీష్ అనే ముగ్గురు వ్యక్తులు ఒడిస్సా రాష్ట్రం చట్టువ వద్ద 60 కేజీల గంజాయిని కొనుగోలు చేసి హై 20 కారులో తరలిస్తూ వాహన తనిఖీలలో పట్టుబడ్డారు. కేరళ రాష్ట్రానికి చెందిన లిశాంత్ కె.పి అనే వ్యక్తి టాటా సఫారీలో 83 కేజీల గంజాయి తరలిస్తుండగా బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలలో పట్టుపడ్డారు. ఈ ఐదుగురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై తారకేశ్వరరావు, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో 1974 చారిత్రక సమ్మె 49వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే 1974 చారిత్రాత్మక రైల్వే ఉద్యోగుల సార్వత్రిక సమ్మె 49వ వార్షికోత్సవాన్ని విజయవాడ కెఎస్‌ఎన్ మూర్తి భవన్‌లో సోమవారం మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ ఎం లీల, ఉపాధ్యక్షులు ఎస్ రామ్‌గుప్తా నేతృత్వాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచార పర్వం..

• రేపు కర్ణాటక ఎన్నికలు, 13న ఫలితాలు • రూ.375 కోట్లకు పైగా సీజ్ • 2896 ఎఫ్ఐఆర్‌లు నమోదు



బెంగళూరు : పోటా పోటీ సమావేశాలు, సభలు, ర్యాలీలతో మార్మోగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సోమవారం తెరపడింది. ఎన్నికల హామీలు, పార్టీల మధ్య దూషణలు, సవాళ్లు, ప్రతి సవాళ్లతో ఆద్యంతం ఆసక్తి రేపిన పార్టీల ప్రచారం ముగియడంతో కర్ణాటక బోసిపోయింది. ముఖ్యంగా, ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, జెడి (ఎస్) ప్రచారాన్ని ఉధృతంగా సాగించాయి. తమ అభ్యర్థుల కోసం తీవ్రంగా శ్రమించాయి. షెడ్యూల్ ప్రకారం ఈనెల 10న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 13న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికల్లో అధికార బిజెపికి ఎదురుదెబ్బ తగలనున్నదనీ, కాంగ్రెస్‌కు ఫలితాలు ఆశాజనకంగా ఉండనున్నాయని పలు ప్రీపోల్ సర్వేలతో పాటు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ధన ప్రవాహం

ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు. ఎన్నికల అధికారులు ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి చర్యలు తీసుకు న్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నగార మోగిన తర్వాత మార్చి 29 నుంచి ఇప్పటి వరకు రూ.375 కోట్లు పట్టుబ డ్డాయి. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికల సంఘం సమాచారం ప్రకారం.. రూ.375.6 కోట్లు సీజ్ చేశారు. ఇందులో నగదు రూ.147 కోట్లుగా ఉన్నది. మద్యం, బంగారం, వెండి రూ.97 కోట్లు, ఉచిత వస్తువులు రూ. 24 కోట్లు, డ్రగ్స్, నార్కొటిక్స్ రూ.24 కోట్లుగా ఉన్నట్టు కర్ణాటక ప్రధాన ఎన్నికల అధికారి వెల్లడించారు. నగదు సీజ్‌కు సంబంధించి ఇప్పటి వరకు 2,896 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఎన్నికల తేదీల ప్రకటనకు ముందు (మార్చి 9 నుంచి మార్చి 27 వరకు) మొత్తం రూ.58 కోట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



సోనియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి
ఇసికి బిజెపి వినతి- స్పష్టత ఇవ్వండి : ఇసి

కర్ణాటక సార్వభౌమాధికారానికి మద్దతు తెలిపినందుకు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఆమెకు గుణపాఠం చెప్పే విధంగా చర్య తీసుకోవాలని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ నేతృత్వంలోని బిజెపి ప్రతినిధి బృందం ఎన్నికల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. కర్ణాటక పేరుప్రతిష్టలకు, సార్వభౌమత్వానికి, సమగ్రతకు ముప్పు కలిగించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే దానిని కాంగ్రెస్ సహించబోదంటూ సోనియా ఈ నెల హుబ్బళ్లిలో జరిగిన సభలో చెప్పారంటూ కాంగ్రెస్ ట్వీట్ చేసింది. దీని ఆధారంగా సోనియాపై బిజెపి ఫిర్యాదు చేసింది. సోనియా ప్రసంగానికి సంబంధించిన ప్రతిని పరిశీలిస్తే సార్వభౌ మత్వం అనే పదాన్నే ఆమె ఉపయోగించలేదని తేలింది. సోనియా వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలని ఎన్నికల సంఘం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాసింది.

నేడు, రేపు ప్రింటయ్యే ప్రకటనలకోసం
ఇసి అనుమతి తీసుకోవాల్సిందే

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున (బుధవారం) లేదా పోలింగ్‌కు ముందు రోజున (మంగళవారం) ప్రకటనలను ప్రచురించాలని అనుకుంటే మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) నుంచి అనుమతి తీసుకోవాలని అన్ని రాజకీయ పార్టీలను, అభ్యర్థులను ఎన్నికల కమిషన్ సోమవారం ఆదేశించింది. అలాగే.. ఈ రెండు రోజుల్లో అనుమతి లేకుండా ఎటువంటి ప్రకటనలు ప్రచురించ బడకుండా చూసుకోవడం తమ బాధ్యత అని రాష్ట్రంలోని అన్ని ప్రముఖ వార్తా పత్రికల సంపాదకులకు కూడా ఇసి లేఖ రాసింది. వార్తా పత్రికలో ప్రచురించబడే ప్రకటనలతో సహా అన్ని విషయాలకు సంపాదకులు బాధ్యత వహించాలని.. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలను ఇసి తన లేఖలో గుర్తు చేసింది.

బెంగళూరు బరిలో కోటీశ్వరులు
ధనబలం ఉన్న వారికే పార్టీల టికెట్

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీలన్నీ ధనబలం ఉన్న వారినే అభ్యర్థులుగా నిలిపాయి. బెంగళూరు నగరంలోని 28 అసెంబ్లీ స్థానాల నుంచి బరిలో నిలిచిన 384 మంది అభ్యర్థులలో 157 మంది... అంటే 41 శాతం మంది కోటీశ్వరులేనని ప్రజాస్వామిక సంస్కరణల సంఘం (ఎడిఆర్) అనే స్వచ్ఛంద సంస్థ తెలిపింది. బెంగళూరు నగరం నుండి పోటీ పడుతున్న 389 మంది అభ్యర్థులలో 384 మంది అఫిడవిట్లను ఈ సంస్థ పరిశీలించింది. వీరిలో 157 మంది రూ. కోటి, అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులు ఉన్న వారే. 87 మంది అభ్యర్థులు... అంటే 23 శాతం మంది తమకు ఐదు కోట్ల రూపాయల కంటే ఎక్కువ విలువైన ఆస్తులు ఉన్నాయని ప్రకటించారు. 37 మంది అభ్యర్థులు (10 శాతం) తమకు రెండు నుండి ఐదు కోట్ల వరకూ విలువైన ఆస్తులు ఉన్నాయని తెలిపారు.

76 మంది అభ్యర్థులకు యాభై లక్షల నుండి రెండు కోట్ల రూపాయల వరకూ, 70 మంది అభ్యర్థులకు పది లక్షల నుండి యాభై లక్షల రూపాయల వరకూ విలువైన ఆస్తులు ఉన్నాయి.

బెంగళూరు నగరం నుంచి బరిలో నిలిచిన 114 మంది అభ్యర్థులు పది లక్షల రూపాయల కంటే తక్కువ విలువైన ఆస్తులు ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి 26 మంది, బిజెపి నుంచి 27 మంది, జేడీ (ఎస్) నుంచి 21 మంది, ఆప్ నుంచి 25 మంది అభ్యర్థులు తాము కోటీశ్వరులమని డిక్లరేషన్ ఇచ్చారు. బెంగళూరు నగరం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల సగటు ఆస్తి విలువ రూ.24.48 కోట్లు. చిక్‌పెట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న యూసఫ్ షరీఫ్ ఆస్తుల విలువ రూ.1,633 కోట్లు. గోవిందరాజనగర్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ప్రియకృష్ణ రూ.1,156 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారు. హెబ్బాల్ నుంచి బరిలో ఉన్న సురేషా రూ. 648 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు.

మణిపూర్‌లో కర్ఫ్యూ సడలింపు

• శిబిరాల్లో బిక్కుబిక్కుమంటున్న నిర్వాసితులు



ఇంఫాల్ సమీపంలో ఆర్మీ ఏర్పాటుచేసిన తాత్కాలిక షెల్టర్‌లో ఉన్న గిరిజన కుటుంబాలు

ఇంఫాల్ : హింసతో అట్టుడికిన మణిపూర్‌లో నెమ్మదిగా సాధారణ పరిస్థితులు నెలకొంటు న్నాయి. నిత్యావ సరాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఇళ్లను వీడి బయటకు వస్తున్నారు. సోమవారం ఉదయం కొన్ని గంటల పాటు కర్ఫ్యూ సడలించామని అధికారులు తెలిపారు. డ్రోన్‌లు, హెలికాప్టర్లు నిశిత పర్యవేక్షణ జరుపుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఆర్మీ, అస్సాం రైఫిల్స్ ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించాయి. ఇప్పటివరకు 23వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో సర్వం కోల్పోయిన అనేక మంది గిరిజనులు ఇంఫాల్, చురచంద్‌పూర్‌లలో బిక్కుబిక్కుమంటున్నారు. కమ్యూనిటీ హాళ్లు, తాత్కాలిక షెల్టర్లలో వారు భయంతో జీవిస్తున్నారు.

బానో పోరాటం మాది కూడా !

• గుజరాత్ ముస్లిం మహిళల షార్ట్ ఫిల్మ్ విడుదల
• దోషుల విడుదలపై నేడు సుప్రీంలో విచారణ

ముంబయి : బిల్కిస్ బానో కేసులో 11మంది దోషులను వదిలివేయడాన్ని సవాలుచేస్తూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం విచారించనున్న నేపథ్యంలో బిల్కిస్ పోరాటం ఇప్పుడు తమ పోరాటం అంటూ గుజరాత్‌లోని ముస్లిం మహిళలు ఒక షార్ట్ ఫిల్మ్ విడుదల చేశారు. 19 నిముషాల నిడివి వుండే ఈ చిత్రాన్ని "బిల్కిస్ బానో : జస్టిస్ ఓవర్‌రూల్డ్" శీర్షికతో తీసుకువచ్చారు. దోషుల విడుదలను మహిళలు నిరసిస్తున్న దృశ్యాలు, ముస్లిం మహిళలు వ్యక్తంచేసిన ఆవేదన అందులో కనిపిస్తోంది. మానవ హక్కుల సమస్యలపై పనిచేసే 'బెబాక్ కలెక్టివ్' (వాయిస్ ఆఫ్ ఫియర్‌లెస్) ఈ చిత్రాన్ని రూపొందించింది. ఇటువంటి కేసులో మహిళల భద్రత, రక్షణ ప్రభుత్వ బాధ్యతలని మహిళా హక్కుల కార్యకర్త సీమా వ్యాఖ్యానించడం కనిపిస్తుంది. "రేపిస్టులను విడుదల చేయడం ద్వారా భారత్ 75వ స్వాతంత్ర్య దినోత్సవాలను జరుపుకుంటోంది" అన్న వ్యాఖ్యానంతో ఈ లఘు చిత్రం ప్రారంభమైంది. 2011లో ముంబయిలోని ట్రయల్ కోర్టు 11మందిని దోషులుగా పేర్కొనగా, 2017లో బాంబే హైకోర్టు సమర్థించింది. జైల్లో సత్ప్రవర్తనతో మెలిగిన కొన్ని కేటగిరీల ఖైదీలకు గతేడాది 75ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మినహాయింపు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. గుజరాత్ ప్రభుత్వం వెంటనే వారిని విడుదల చేసింది.



పడవ ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న సిఎం విజయన్ తదితరులు

22కు పెరిగిన కేరళ పడవ ప్రమాద మరణాలు

• మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం
• అండగా ఉంటా : సిఎం విజయన్

తిరువంతపురం : కేరళలోని మలప్పురం జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 22కు పెరిగింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. క్షతగాత్రుల వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఆ కుటుంబాలకు ఇది ఓదార్పునిచ్చేది కాదని, ఆ కుటుంబాలకు తాను అండగా ఉంటానని విజయన్ హామీ ఇచ్చారు. ప్రమాద ప్రాంతాన్ని సోమవారం ఉదయం ముఖ్యమంత్రి విజయన్ పరిశీలించారు. సహాయక కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ జరిపిస్తామని ప్రకటించారు. జిల్లాలోని తనూర్ ప్రాంతంలోని తూవల్ తీరంలో డబుల్ డెక్కర్ బోటు ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో బోల్తా పడి మునిగిపోయిన సంగతి తెలిసిందే. 22 మంది మరణించగా, ఇద్దరు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చారు. ఆసుపత్రిలో చేరిన 10 మందిలో ఇద్దరు డిశ్చార్జ్ అయ్యారు. మరో ఎనిమిది మంది చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి, మరణించిన వారి బంధువులకు ఆరోగ్యశాఖ మానసికంగా అండగా ఉంటుందని ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ తెలిపారు. గాయపడిన వారిని ఆమె పరామర్శించారు.

పోలీసుల అదుపులో పడవ యాజమాని

ప్రమాదానికి గురైన పడవ యాజమాని నాజర్‌ను కొజికోడ్‌లోని బీచ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నామని, ముందుగా మలప్పురం తీసుకొస్తామని పోలీసులు చెప్పారు. ఆదివారమే నాజర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ పడవకు అనుమతి లేదని, పాతదని స్థానికులు చెబుతున్నారు. అధిక బరువు కారణంగా ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

తానూరులో మంత్రివర్గ, అఖిలపక్ష సమావేశాలు
న్యాయవిచారణకు నిర్ణయం

ఆసుపత్రిలో మృతదేహాలను సందర్శించి, నివాళులర్పించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం సిఎం విజయన్ తానూరులో మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నేతలతోనూ సమావేశమయ్యారు. దుర్ఘటనపై న్యాయ విచారణ జరపాలని అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది. సాంకేతిక నిపుణులతోసహా న్యాయవిచారణ జరిపిస్తుందని, జిల్లా పోలీసు చీఫ్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను నిర్వహిస్తుందని సిఎం తెలిపారు.

అమెరికా కాల్పుల్లో హైదరాబాద్ యువతి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అమెరికాలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో హైదరాబాద్ యువతి మృతి చెందారు. టెక్సాస్‌లోని డాలస్ సమీపంలో అలెన్ ప్రీమియర్ దుకాణ సముదాయంలో శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ కాల్పుల్లో హైదరాబాద్‌కు చెందిన తాటికొండ ఐశ్వర్య మృతి చెందారు. డాలస్ పోలీసులు ఇండియా ఎంబసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఐశ్వర్య తండ్రి నర్సిరెడ్డి రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిగా పని చేస్తున్నారు. ఐశ్వర్య మృతితో కొత్తపేటలోని ఆమె నివాసం వద్ద విషాదం నెలకొంది.ఐశ్వర్య మృతదేహం మంగళవారం హైదరాబాద్‌కు వస్తుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ది కేరళ స్టోరీపై పశ్చిమ బెంగాల్‌లో నిషేధం

కొల్‌కతా: వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ'పై నిషేధం విధిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి విద్వేషం, హింసాత్మక ఘటనలు జరగకుండా నిరోధించేందుకే ముందు జాగ్రత్తగా ఈ నిషేధం విధించినట్లు సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఈ నిషేధం ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ఏ థియేటర్‌లోనైనా ఈ చిత్రాన్ని ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని అధికారి హెచ్చరించారు.

నవంబర్ తరువాత సంజయ్ కుమార్ కొనసాగరు

• సుప్రీంకు కేంద్రం

న్యూఢిల్లీ : నవంబర్ తరువాత ఇడి డైరెక్టర్‌గా సంజయ్ కుమార్ మిశ్రా ఆ పదవిలో కొనసాగరని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. జస్టిస్ బి ఆర్ గవై నేతృత్వంలోని ముగ్గురు జడ్జిల ధర్మాసనం ముందు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహత ఈ విషయాన్ని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్) మూల్యాంకనాన్ని దృష్టిలో ఉంచుకుని మాత్రమే మిశ్రా పదవీ కాలాన్ని మూడోసారి పొడిగించామని, ఈసారి పొడిగింపు ఉండదని తెలిపారు. ఇడి డైరెక్టర్‌గా సంజయ్ కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని ఏడాది పొడిగించడంపై పిటిషన్‌ను విచారిస్తున్న సుప్రీంకోర్టు గత విచారణలో 'మిశ్రా స్థానంలో మరొకరిని నియమించలేరా..' అని కేంద్రాన్ని ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

హేయమైన ప్రకటన

• కీవ్ వ్యాఖ్యలపై క్రెమ్లిన్ స్పందన

మాస్కో : ప్రపంచవ్యాప్తంగా గల రష్యన్లను చంపుతామంటూ ఉక్రెయిన్ మిలటరీ ఇంటెలిజెన్స్ చీఫ్ కిరిల్ బుదనోవ్ చేసిన బెదిరింపులపై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ ఇది చాలా హేయమైన ప్రకటన అని వ్యాఖ్యానించారు. తీవ్రవాద కార్యకలాపాలకు సహాయం చేయడమే కాదు, ఉక్రెయిన్ ప్రభుత్వం వాటిని ప్రత్యక్షంగా నిర్వహిస్తోందని స్పష్టమైందన్నారు. ఇటువంటి ప్రకటనల నేపథ్యంలో రష్యా సీక్రెట్ సర్వీసెస్‌లు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాయని అన్నారు. కీవ్ చేసిన ఈ ప్రకటనపై అమెరికా, ఇయులు ఏ విధంగా స్పందిస్తాయో తాము వేచిచూస్తామని పెస్కోవ్ అన్నారు.

విక్టరీ డే ఉత్సవాల రద్దు

ఉక్రెయిన్ తీవ్రవాద దాడులకు పాల్పడే అవకాశం ఉండటంతో రష్యాలోని పలు ప్రాంతాల్లో విక్టరీ డే ఉత్సవాలను, ప్రదర్శనలను రద్దు చేశారు.

ఎయిర్ ఇండియాలో మూత్ర విసర్జన కేసు

కేంద్రం, డిజిసిఎలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : ఎయిర్ ఇండియా విమానంలో సహ ప్రయాణికుడు మూత్ర విసర్జన చేసిన కేసులో బాధితురాలు 72 ఏళ్ల మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను జులైలో విచారించడానికి సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. ఇలాంటి సంఘటనలను డీల్ చేయడానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఒపి)ను రూపొందించాలని కోరుతూ ఆమె పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఎయిర్ ఇండియాతో సహా కేంద్ర ప్రభుత్వం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ)లకు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పర్దివాలాతో కూడిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

ఇరాన్‌లో ఇద్దరి ఉరితీత

దుబాయ్ : దైవ దూషణకు పాల్పడ్డారని పేర్కొంటూ ఇద్దరు వ్యక్తులను ఇరాన్ ప్రభుత్వం ఉరి తీసిందని అధికారులు తెలిపారు. ఈఏడాది ప్రారంభం నుండి ఇప్పటివరకు 203 మంది ఖైదీలను ఉరితీసిందని ఇరాన్ మానవ హక్కుల గ్రూపు పేర్కొంది. సెంట్రల్ ఇరాన్‌లోని ఆరక్ జైల్లో యూసుఫ్ మెహ్రాద్, సద్రోలా ఫాజెల్ జరేలను ఉరి తీశారు. 2020 మేలో వారిని అరెస్టుచేశారు.

అకస్మాత్తుగా ఉజ్బెక్ అధ్యక్ష ఎన్నికలు

కీవ్ : మధ్యంతర అధ్యక్ష ఎన్నికలకు ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియొయెవ్ పిలుపునిచ్చారని రష్యా వార్తా సంస్థ రియా సోమవారం తెలిపింది. అయితే ఎప్పుడు నిర్వహించేది తేదీ వెల్లడించలేదు. ఏడేళ్ల పదవీ కాలంతో మిర్జియొయెవ్ మరో రెండుసార్లు అధ్యక్ష పదవిని నిర్వహించేందుకు అనుమతిస్తూ ఏప్రిల్ 30న నిర్వహించిన రెఫరెండంలో పలు రాజ్యాంగ సవరణలను ఉజ్బెక్ ఓటర్లు ఆమోదించారు.

ఢిల్లీ పోలీసుల బారికేడ్లను ఛేదించిన రైతులు

• రెజ్లర్లకు మద్దతుగా కదంతొక్కిన అన్నదాతలు
• దేశంలోని ఆడబిడ్డల కోసమే మా ఆందోళన : బజరంగ్ పునియా



బారికేడ్లు తోసుకొని ధర్నా శిబిరం వద్దకు వస్తున్న రైతులు


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపుల ఆరోపణలపై రెజ్లర్ల ఆందోళనలో పాల్గొనడానికి రైతుల సమూహం బారికేడ్లను నెట్టుకుంటూ కదంతొక్కింది. రెజ్లర్ల నిరసన ప్రాంగణానికి సమీపంలో పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లను రైతులు ఛేదించారు. రైతులకు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. నిరసన వేదిక వద్ద సోమవారం కూడా పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు కూర్చున్నారు. రెజ్లర్లకు మద్దతుగా దేశ రాజధానిలోని వివిధ రాష్ట్రాల నుంచి రైతులు వస్తున్న నేపథ్యంలో ఢిల్లీ-ఘాజీపూర్ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని, బాధిత రెజ్లర్లకు న్యాయం చేయాలని రోడ్డెక్కిన రెజ్లర్లు, సోమవారం 16వ రోజు కూడా ఆందోళన కొనసాగించారు.

"రైతుల సమూహాన్ని జంతర్ మంతర్‌కు వెళ్లారు. ఎంట్రీ బారికేడ్‌ల వద్ద వారు ధర్నా స్థలానికి చేరుకోవడానికి ఆతురుతలో ఉన్నారు. కింద పడిన బారికేడ్‌లపైకి ఎక్కి కొందరు వాటిని తొలగించారు. రైతుల ప్రవేశాన్ని సులభతరం చేయడానికి పోలీసు బృ:దం వెనుక బారికేడ్‌లను పక్కన పెట్టింది" అని న్యూఢిల్లీ డిసిపి ప్రణవ్ తాయల్ తెలిపారు. ఒక రైతు మాట్లాడుతూ "మేము ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్నాం. పోలీసులు మమ్మల్ని ఒక వైపు నుండి లోపలికి రమ్మని అడిగారు. కానీ స్థలం లేదు. మేము పెద్ద సంఖ్యలో ఉన్నాం. బారికేడ్లు నెట్టాం" అని చెప్పారు.

దేశం కోసం పోరాటం : బజరంగ్ పునియా

బజరంగ్ పునియా మాట్లాడుతూ "మేం రాజకీయాలు చేసేందుకు రాలేదు. న్యాయం కోసం వచ్చాం. మాకు మద్దతు ఇవ్వడానికి ముందుకు వస్తున్న వారికి ధన్యవాదాలు. ఈ నిరసన కేవలం రెజ్లర్లకు మాత్రమే పరిమితం కాదు. ఇది దేశం కోసం కూడా పోరాటం. భారతదేశపు ఆడబిడ్డల కోసం పోరాటం" అని అన్నారు. "పోరాడతాం. మాకు అవకాశం లభిస్తే కచ్చితంగా ఆడతాం. నిరసనల సమయంలోనూ శిక్షణా షెడ్యూల్‌ని ప్లాన్ చేయడానికి ప్రయత్నిస్తున్నాం' అని వినేష్ ఫొగాట్ అన్నారు.



బారికేడ్‌లకు వెల్డింగ్ చేస్తున్న పోలీసు అధికారులు

రెజ్లర్లకు కేంద్ర కార్మిక సంఘాల మద్దతు

రెజ్లర్ల ఆందోళనకు కేంద్ర కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్ఎంఎస్, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఈడబ్ల్యుఎ, ఎఐసిసిటియు,ఎల్పిఎఫ్, యుటియుసి ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశాయి. రెండు ఎఫ్ఐఆర్‌ల నమోదైన ఇండియన్ రెజ్లర్స్ ఫెడరేషన్ ఛైర్‌పర్సన్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్న రెజ్లర్ల న్యాయమైన డిమాండ్‌కు కార్మిక సంఘాలు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నాయి. బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. రెజ్లర్లపై పోలీసులు దాడి చేయడం చాలా ఘోరమని పేర్కొన్నాయి. ఈ క్రమంలో బట్టలు చిరిగిపోయిన మహిళా జర్నలిస్టు సాక్షి జోషిపై పోలీసులు దాడి చేశారని విమర్శించాయి. రైతుల ఆందోళనతో బారికేడ్‌లకు పోలీసులు వెల్డింగ్ చేశారు.

పిఎం కేర్స్‌కు విదేశీ విరాళాల వెల్లువ !

న్యూఢిల్లీ : పిఎం కేర్స్‌కు గత మూడేళ్ల కాలంలో విదేశాల నుంచి రూ.535 కోట్ల విరాళం అందింది. కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో పౌరులకు సాయం అందించేందుకు పిఎం కేర్స్ పేరిట మోడీ ప్రభుత్వం 2020లో నిధిని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ నిధికి సంబంధించిన వసూళ్లు, చెల్లింపుల ఖాతాల ప్రకారం విదేశాల నుంచి 2019-20లో రూ.0.40 కోట్లు, 2020-21లో రూ.494.92 కోట్లు, 2021-22లో రూ.40.12 కోట్ల మేర విరాళాలు లభించాయి. ఈ మూడు ఆర్థిక సంవత్సరాలలో విదేశీ విరాళాల నుంచి రూ.24.85 కోట్ల వడ్డీ ఆదాయం కూడా లభించింది. కోవిడ్ ఉధృతి ఎక్కువగా ఉన్న 2020-21లో విదేశాల నుంచి అధికంగా విరాళాలు వచ్చాయి. రెండో దశ కోవిడ్ ప్రబలిన 2021-22లో మాత్రం విరాళాల జోరు తగ్గింది. 2021-22లో విదేశీ విరాళాలతో పాటు స్వచ్ఛంద విరాళాలు కూడా తగ్గిపోయాయి. 2020-21లో రూ.7,183.77 కోట్ల మేర స్వచ్ఛంద విరాళాలు లభించగా 2021-22లో రూ. 1,896.76 కోట్లు మాత్రమే వచ్చాయి. 2019-20లో స్వచ్ఛంద విరాళాల రూపంలో రూ.3,075.85 కోట్లు వచ్చాయి. విదేశీ, స్వచ్ఛంద విరాళాలు కలిసి ఈ మూడేళ్ల కాలంలో రూ. 12,691.82 కోట్లు లభించాయి. పిఎం కేర్స్‌కు వచ్చే విరాళాలను ఆదాయపన్ను, ఎఫ్‌సిఆర్ఎ నుంచి మినహాయించారు. ప్రభుత్వ ఆస్పత్రులలో వెంటిలేటర్లు, వలసవాదుల సంక్షేమం, రెండు కోవిడ్ ఆస్పత్రుల ఏర్పాటు, ఆక్సిజన్ ప్లాంట్లు, వాక్సిన్ సేకరణ, ఇతర కోవిడ్ సంబంధ సరఫరాల కోసం ఈ నిధి నుండి చెల్లింపులు జరిపినట్లు ఖాతాలో చూపారు. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలు ఇవ్వటానికి ఆర్‌టిఐ నుంచి మినహాయింపు ఇవ్వటం గమనార్హం.

లింగ అసమానతల అంతరాన్ని తగ్గించాలి

• జి 20 సమావేశంలో మహిళా ప్రతినిధులు



పనాజి : లింగ అసమానతల అంతరాన్ని తగ్గించేందుకు గానూ ప్రపంచవ్యాప్తంగా మహిళలు పెద్ద ఎత్తున ఆర్థిక, డిజిటల్ రంగాల్లోకి కూడా ప్రవేశించాల్సి వుందంటూ ఇక్కడ జి20 సమావేశాలకు హాజరైన మహిళా ప్రతినిధులు పేర్కొన్నారు. గోవాలో జి 20 మూడవ డెవలప్‌మెంట్ వర్కింగ్ గ్రూపు సమావేశానికి ముందుగా జరిగిన ప్యానెల్ చర్చలో వారు పాల్గొన్నారు. 'మహిళల నేతృత్వంలో అభివృద్ధి' అనే అంశంపై జరిగిన చర్చలో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ మాజీ అధ్యక్షురాలు మరియా ఫెర్నాండా ఎస్పినోసా పాల్గొన్నారు. ఈనాడు కూడా మహిళలు తమకు తాము నిరూపించుకోవడం కోసం నిరంతరంగా శ్రమిస్తూనే వున్నారన్నారు. మహిళా నాయకత్వాన్ని అనుమతించే, స్వాగతించేలా సంస్థలను, వ్యవస్థలను రూపొందించాల్సిన అవసరం వుందన్నారు. ఫెమినిస్ట్ భావజాలం కలిగిన పురుషులతో సంబంధ బాంధవ్యాలు ఈ తరహా అభివృద్ధికి ఎంతో కీలకమని వ్యాఖ్యానించారు. ఈనాడు ఉపాధి మార్కెట్లలో మహిళల ప్రాతినిధ్యానికి టెక్ చైతన్యం పెద్ద అవరోధంగా నిలిచిందని గర్ల్ హైప్ సిఇఎ బరతంగ్ మియా వ్యాఖ్యానించారు. డిజిటల్ సమాచారాన్ని ఎక్కువగా ఉపయోగించే మహిళలు వాటిని సృష్టించడానికి అవసరమయ్యే ఆల్గరిథమ్‌ల్లో కూడా ఆద్యులు కావాల్సిన అవసరం వుందన్నారు.

అశాంతి రేపే వారికి కోర్టులు మద్దతివ్వవు

• యూట్యూబర్ కశ్యప్ పిటీషన్ తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ : బీహార్ నుంచి వలస వచ్చిన కార్మికులపై తమిళనాడులో దాడులు జరుగుతున్నాయంటూ ఫేక్ వీడియోలు యూట్యూబ్‌లో పెట్టి ఆ రాష్ట్రంలో చిచ్చురేపేందుకు ప్రయత్నించిన యూట్యూబర్ మనీష్ కశ్యప్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌లన్నింటినీ ఏకం చేయాలని, పాట్నాకు బదిలీ చేయాలన్న కశ్యప్ పిటీషన్‌ను కోర్టు తిరస్కరించింది. జాతీయ భద్రత చట్టం కింద కశ్యప్‌పై వివిధ ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ప్రస్తుతం తమిళనాడులో నిర్బంధంలో ఉన్నాడు. 'తమిళనాడు వంటి స్థిరమైన రాష్ట్రంలో మీరు ఏదైనా సృష్టించి, అశాంతి రేపగలరు. మీలాంటి వారికి కోర్టులు అనుకూలంగా ఉండకూడదు' అని కశ్యప్ న్యాయవాది మణీందర్ సింగ్‌తో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. తమిళనాడు ప్రభుత్వం తరుపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్, అమిత్ తివారీ, జోసెఫ్ అరిస్టాటిల్ వాదనలు వినిపించారు. 'కశ్యప్‌కు రాజకీయ ఆకాంక్షలు ఉన్నాయి. అతని వీడియోలు రాజకీయ అవకాశవాదానికి ప్రయత్నించాయి' అని తెలిపారు. కశ్యప్ బీహార్‌లోనూ నేర విచారణను ఎదుర్కొంటున్నాడు. కశ్యప్‌కు నేర చరిత్ర ఉందని బీహార్ ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు.

బాగేపల్లి సిపిఎం అభ్యర్థి అనిల్ హత్యకు కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)


పాల్పడే వారికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు.


ఆదరణ చూసే మతత్వశక్తుల కుయుక్తులు : మునివెంకటప్ప

బాగేపల్లిలో సిపిఎంకు పెరిగిన జనాదరణ చూసి ఓర్వలేని బిజెపి హత్యా రాజకీయాలకు తెరతీస్తోందని సిపిఎం చిక్‌బళ్లాపుర్ జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప విమర్శించారు. సిపిఎం అభ్యర్థి అనిల్‌కుమార్‌కు ప్రాణహాని ఉందని తెలిపారు. ఈ కుట్రలో పట్టుబడింది కొంతమంది మాత్రమేనన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు, ఎన్నికల వ్యవస్థ సక్రమంగా పనిచేయాలని కోరారు. బాగేపల్లిలో ఎగిరేది ఎర్రజెండానేనని తెలిపారు.

దర్యాప్తు కొనసాగుతోంది

బాగేపల్లిలో ఆదివారం రాత్రి జరిగిన ఈ వ్యవహారంపై పోలీసులు ఎక్కడా పెదవి విప్పలేదు. మరణాయుధాలతో పట్టుబడినా దానిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పడం మినహా పూర్తి వివరాలు వెల్లడించడం లేదు.





పొలిటికల్ దోమ

మగ దోమ ఆడ దోమతో మొదటి రోజు డార్లింగ్, నేను నీ కోసం సింహాన్ని వేటాడి తీస్కొస్తా...అంటుంది. అప్పుడు..

ఆడ దోమ : సర్లే ఇక పడుకో

రెండో రోజు ..మగ దోమ : ఏనుగుని కుట్టి దాని రక్తాన్ని నీ కోసం తీస్కొస్తా.

ఆడ దోమ : సర్లే ఇక పడుకో

మూడో రోజు...మగ దోమ : నిన్ను బెంజి కారులో ప్యారిస్ తీస్కపోతా.

ఆడదోమ : సరే ఇక పడుకో

నాలుగో రోజు....మగ దోమ : ఏంటి? నమ్మకం లేదా...నీ కోసం రేపు బంగారు గొలుసు తీస్కొస్తా...

ఆడ దోమ : సర్లే ఇక పడుకో.. నీకెన్ని సార్లు చెప్పాలి. ఆ పొలిటికల్ నాయకుడిని కుట్టి ఇంటింకి రావద్దని.



- జ్ఞాన చందు,
ఎల్‌కెజి,
బైటమంజులూరు,
పంగులూరు మండలం,
బాపట్ల జిల్లా.

ఇష్టం.. కష్టం..

నాకు స్కూలంటే ఇష్టం
కానీ పాఠాలంటేనే కష్టం
నాకు టీచర్ అంటే చాలా ఇష్టం
కానీ క్రమశిక్షణ అంటేనే కష్టం
నాకు ఇంగ్లీషు అంటే చాలా ఇష్టం
కానీ మాట్లాడడమంటేనే చాలా కష్టం
నాకు తెలుగంటే ఇష్టం
కానీ రాయడమంటే కొంచెం కష్టం
నాకు ఐస్‌క్రీం అంటే చాలా ఇష్టం
కానీ జలుబు చేస్తేనే కష్టం
నాకు ఆటలంటే ఎంతో ఇష్టం
కానీ దెబ్బలంటేనే కష్టం
అన్నీ ఇష్టం..
కానీ చేయాలంటేనే కష్టం



- స్వాతి,
ఆదర్శ ఎడ్యుకేషన్ సెంటర్,
చెంచుకాలనీ, గన్నవరం.

బొమ్మరిల్లు





యశ్విత మున్నంగి,
3వ తరగతి,
షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూలు,
విజయవాడ.

నిజమైన స్నేహితుడు

ఇద్దరు స్నేహితులు సెలవురోజు ఊరి వెలుపల షికారుకెళ్లారు. తోవలో మాట్లాడుకుంటూ ఏదో విషయంపై గొడవ పడ్డారు. వాదన ఎక్కువై మొదటివాడు రెండో వాడిని చెంపపై కొట్టాడు. దెబ్బతిన్నవాడు అక్కడున్న ఇసుకపై 'ఈ రోజు నా స్నేహితుడు నా చెంపపై కొట్టాడు' అని రాశాడు. మళ్లీ ఇద్దరూ ముందుకు నడిచారు. మరికొంత దూరం వెళ్లాక ఇద్దరికీ దాహం వేసి ఓ మడుగు దగ్గరకు వెళ్లారు. చెంపదెబ్బ తిన్న మిత్రుడు ముందు నీళ్లలోకి దిగాడు. అక్కడ ఊబి ఉంది. అతడు ఊబిలోకి కూరుకుపోతుండగా ఒడ్డున ఉన్నవాడు వెంటనే ప్యాంటు విప్పి మిత్రుడికి అందించాడు. దాని సాయంతో ఊబి నుండి బయటపడిన స్నేహితుడు పైకి రాగానే పక్కనే ఉన్న బండరాయిపై 'ఈ రోజు నా మిత్రుడు నన్ను ప్రమాదం నుండి రక్షించాడు' అని చెక్కాడు. మొదటి విషయాన్ని ఇసుకపై, రెండోదాన్ని రాయిపై ఎందుకు రాశావని మొదటి మిత్రుడు అడగ్గా.. ఇసుక మీద ఏదైనా రాస్తే గాలి వీచి కాసేపటికి చెరిగిపోతుంది. స్నేహితుల పొరపాట్లను మనసులో నిలుపుకోకూడదు కనుక అలా రాశాను. అదే సహాయం చేసినప్పుడు శాశ్వతంగా గుర్తుంచుకోవాలి. అందుకే రాయిపై చెక్కాను అని స్నేహితుడు చెప్పాడు.





ఎన్ తేజస్విత,
8వ తరగతి,
పానుకుమాడు,
ఏలూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన the family

JEEVANA

మీ కోసం


కిచెన్ షింక్‌లో వాసన రాకుండా ఉండాలంటే వారానికి మూడుసార్లు కర్పూరం కలిపిన నీటిని అందులో పోయాలి.



జీవనసౌరభం

ఓడిపోయిన ప్రతిసారీ గుర్తుంచుకోవాల్సింది.. గెలుపు ఎంతో దూరంలో లేదని..


పేపర్ బాయ్ నుంచి సెలబ్రిటీ ఫొటోగ్రాఫర్‌గా..



తమ కలలను నెరవేర్చుకోవాలని, ఆర్థికంగా నిలబడాలని ముంబయి వంటి మహా నగరాలకు ఇప్పటికీ ఎంతోమంది చేరుకుంటుంటారు. కానీ 'నేను మాత్రం అలా వెళ్లలేదు. కేవలం నా కుటుంబానికి సాయంగా ఇంటికి కొంత మొత్తం పంపిస్తే చాలనుకుని ముంబయి చేరాను' అంటున్న 47 ఏళ్ల మున్నా ఠాకూర్ ...14 ఏళ్ల వయసుకే కుటుంబ భారాన్ని మోసేందుకు రకరకాల పనులు చేశారు. పేపర్‌బాయ్‌గా ముంబయిలో జీవితం ప్రారంభించి ప్రస్తుతం బాలీవుడ్ సెలబ్రిటీ నటీనటులకు పర్సనల్ ఫొటోగ్రాఫర్‌గా రాణిస్తున్నారు. పేపర్ బాయ్‌గా, కట్టర్‌గా, వెల్డర్‌గా ఎన్నో పనులు చేసి ఫొటోగ్రఫీలో తనను తాను నిరూపించుకుంటున్న అతని గురించి మరికొంత తెలుసుకుందాం.

మున్నా పుట్టి పెరిగింది మహారాష్ట్ర అకోలా ప్రాంతం. ముగ్గురు పిల్లల్లో పెద్దవాడైన మున్నా తండ్రికి చేదోడుగా ఏదైనా పనిచేయాలనుకుని ఏడో తరగతికే చదువు ఆపేశాడు. 'నా కుటుంబానికి ఏదైనా సాయం చేయాలి. ఇదొక్కటే నా కళ్ల ముందు ఉండేది. దీంతో వడ్రంగి పని, రంగులు వేయడం, దినసరి కూలి ఇలా ఏ పని ఉంటే ఆ పనికి వెళ్లిపోయేవాడిని. ఒక రోజు నా స్నేహితులతో మాట్లాడుకుంటూ ఉండగా ముంబయి నగరానికి వెళ్లాలన్న ఆలోచన కలిగింది. అక్కడికి వెళ్లి ఏం చేయాలో నాకు తెలియదు. డబ్బు సంపాదించాలి. అంతే అనుకుని ముంబయి ట్రైన్ ఎక్కేశాను.

ఇద్దరు స్నేహితులతో కలిసి 1991లో నగరంలోకి అడుగుపెట్టాను. అప్పుడు నా వయసు 15. జేబులో రూ.24 ఉన్నాయి. నగరం చేరాక ఉపాధి వెతుక్కోవడం నా ముందున్న పెద్ద సవాలు. ఏడో క్లాసు చదివిన నాకు ఉద్యోగం ఎక్కడ దొరుకుతుంది.. ఏ పనిలోనూ ప్రావీణ్యం లేని నాకు ఎవరూ ఉద్యోగం ఇవ్వలేదు. దీంతో ఉదయం పేపరు బాయ్‌గా, మధ్యాహ్నం ఫర్నీచర్ షాపులు, వెల్డింగ్ షాపులు, డైమండ్ పాలిషర్ అండ్ కట్టర్‌గా రకరకాల పనులు చేసేవాడ్ని. 1998 వరకు నా ప్రయాణం అలాగే సాగింది' అని వివరించాడు మున్నా. అంతకు ముందు ఏడాది అంటే 1997లోనే ఫొటోగ్రఫీ వైపు అతడు అడుగులు వేశారు. ఫొటోగ్రఫీలో శిక్షణ తీసుకోవడం ప్రారంభించారు. 'మొదట స్టూడియోలో నన్ను కెమెరాను ముట్టుకోనిచ్చేవారు కాదు. ఏడాది తరువాత వారికి నమ్మకం కలిగించాను. బిలాల్ అనే ఓ స్నేహితుడు కెమెరా ఉపయోగించడం నేర్పించాడు. అది మొదలు నా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటూ వెళ్లాను. ఇప్పుడు నా పనితనం చూపించాలి. నాపై ఎవరు నమ్మకం ఉంచుతారు. అప్పుడు నా స్నేహితుడు బిలాల్ ముందుకొచ్చాడు. అతడే నా తొలి మోడల్. రకరకాల స్టిల్స్‌లో బిలాల్‌ను ఫొటోషూట్ చేశాను' అంటున్న మున్నా అప్పటికీ న్యూస్‌పేపర్లు వేస్తూనే ఉన్నారు.








'బాలీవుడ్ ప్రముఖ మోడల్ అర్జున్ రాంపాల్ ఇంట్లో కూడా నేను పేపర్ వేసేవాడిని. నా పనితనం అతనికి చూపించాలని చాలాసార్లు అనుకున్నాను. కాని అతన్ని ఎలా కలిసేది. డబ్బు డిమాండ్ చేస్తే అంత సొమ్ము చెల్లించగలనా అనుకుంటూనే చాలా రోజులు గడిపేశాను. చివరికి ఏదైతే అదవుతుందని ఆ ఇంట్లో పనిచేసే వంటమనిషి సాయం అడిగాను. అతని సిన్సియారిటీ వల్లో.. లేక అర్జున్ దయార్ద్ర గుణమో తెలియదు కాని నాతో ఉచితంగా ఫొటోషూట్ చేశాడు.

అర్జున్‌తో ఫొటోషూట్ తరువాత మున్నా ముంబయి నగరంలో అనేక స్టూడియోలకు తిరిగారు. అప్పుడే సోనూసూద్ పరిచయం అయ్యారు. 'సోనూసూద్ బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన మొట్టమొదటి రోజులవి. చాలా కష్టాలుపడుతున్నాడు. అతన్ని కలిసిన తరువాత మా ఇద్దరి ప్రయాణం ఒకటైంది. ఇద్దరం కలిసి ఇంటిఅద్దె కట్టేవాళ్లం. భోజనం, కరెంటు ఇలా ప్రతిఒక్కటీ పంచుకునేవాళ్లం. నా కెరియర్ ప్రారంభంలో పరిచయమైన అర్జున్, సోనూసూద్‌లతో నా ప్రయాణం ఎప్పటికీ మర్చిపోలేను' అంటూ కెరియర్ ప్రారంభ రోజులు గుర్తుచేసుకున్నారు.

'బతుకుదెరువు కోసం ఏదైనా పని దొరికితే చాలనుకుని ముంబైలో అడుగుపెట్టిన నేను ఈ రోజు బాలీవుడ్‌లో అమితాబ్ బచ్చన్, తాప్సీ, శ్రద్ధాకపూర్, కృతిసనన్, సల్మాన్, సోనూసూద్ వంటి నటీనటులకు ఫొటోషూట్ చేస్తున్నాను. జేబులో రూ.24 మొదలైన నా ప్రయాణం ఇప్పుడు ఏడాదికి రూ.25 లక్షలకు చేరింది. ఇది నేను కలలో కూడా ఊహించని జీవితం. ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. ఈ స్థితికి వచ్చేందుకు సుదీర్ఘ సమయం పట్టింది. అయినా ఎప్పుడూ నిరాశపడలేదు. టాలెంట్ ఉంటే ఎప్పుడైనా.. ఎక్కడైనా రాణించొచ్చు.. అయితే అది గుర్తించి ప్రోత్సహించేవారు కూడా ఉండాలి..' అంటున్న మున్నా జీవిత ప్రయాణం ఎంతోమంది యువతకు గొప్ప ఆదర్శం.



మొయిద్దీన్ భాయ్‌గా రజనీకాంత్

బాషా భాయ్‌గా ఓ ట్రెండ్ క్రియేట్ చేసిన రజినీకాంత్ ఇప్పుడు మొయిద్దీన్ భాయ్‌గా కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న 'లాల్ సలాం' చిత్రం నుంచి రజినీకాంత్ లుక్‌ను, క్యారెక్టర్‌ను తాజాగా లైకా సంస్థ విడుదల చేసింది. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా రజినీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రజినీకాంత్ మొయిద్దీన్ భాయ్‌గా కనిపించబోతున్నట్లు తెలిపారు. 'ప్రతి ఒక్కరి ఫేవరెట్ భాయ్ మళ్లీ ముంబై రాబోతున్నారు' అంటూ ఆదివారం నుంచే నిర్మాణ సంస్థ సందడి చేసింది. అర్ధరాత్రి 12 గంటలకు రజినీకాంత్ లుక్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ లుక్ నెట్టింట ట్రెండ్ అవుతోంది. రజినీకాంత్ కుమార్తె ఐశ్వర్యా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

'ఆదిపురుష్' ట్రైలర్ విడుదల

తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన కొన్ని థియేటర్లలో ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' ట్రైలర్ విడుదల చేశారు. ప్రభాస్, కృతి సనన్, దర్శకుడు ఓం రౌత్, ఇతర టీమ్ సభ్యులు హైద్రాబాద్‌లోని ఎఎంబీ థియేటర్‌లో విడుదల చేసిన ట్రైలర్ స్క్రీనింగ్‌లో పాల్గొన్నారు. 70కి పైగా దేశాల్లో ఈ ట్రైలర్‌ను ప్రదర్శించారు. ఈ రోజు నుంచి ట్రైలర్ యూట్యూబ్‌లో అందుబాటులో ఉంటుంది. ఈ చిత్రంలో రావణ్‌గా సైఫ్ అలీఖాన్ నటిస్తున్నారు. భూషణ్ కుమార్, ఓం రౌత్, రాజేష్ మోహనన్ మరియు క్రిషన్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



'సర్కిల్'తో నీలకంఠ



నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ నీలకంఠ నుంచి మరో ఇంట్రెస్టింగ్ సినిమా రాబోతోంది. 'సర్కిల్' అనే పేరుతో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి ఎవరు, ఎప్పుడు, ఎందుకు శత్రువులవుతారో అనే ట్యాగ్ లైన్ పెట్టారు. తాజాగా 'సర్కిల్' మూవీ టైటిల్‌తో పాటు మోషన్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఆరా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రంలో సాయి రోనక్, బాబా భాస్కర్, అర్షిణ్ మెహతా, రిచా పనయ్, నైనా, పార్థవ సత్య తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఎన్. ఎస్. ప్రశు సంగీతాన్ని సమకూర్చగా, రంగనాథ్ గోగినేని సినిమాటోగ్రఫీ అందించారు. ఎమ్. వి. శరత్ చంద్ర, టి. సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ ఈ చిత్రాన్ని నిర్మించారు.



చెయ్యి చెయ్యి కలిపేద్దాం...

టాలీవుడ్ యంగ్ హీరో సంతోష్ శోభన్ నటిస్తున్న మూవీ 'అన్నీ మంచి శకునములే' రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రాన్ని నందినీ రెడ్డి డైరెక్ట్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ నుంచి విడుదల చేసిన సీతాకళ్యాణ వైభోగమే, గల గల యేరులా లిరికల్ వీడియోసాంగ్, అన్నీ మంచి శకునములే టైటిల్ సాంగ్స్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేసేలా ఉన్నాయి. మిక్కీ జే మేయర్ కంపోజిషన్‌లో వచ్చిన ఈ పాటలను ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తాజాగా ఫ్యామిలీ ఆడియెన్స్ అందరికీ కనెక్ట్ అయ్యేలా సాగే 'చెయ్యి చెయ్యి కలిపేద్దాం' పాటను లాంఛ్ చేశారు మేకర్స్. చంద్రబోస్ రాసిన ఈ పాటను శ్రీకృష్ణ, వేణు శ్రీ రంగం, సాందీప్, చైత్ర అంబడిపూడి పాడారు. ఈ పాటలో అచ్చ తెలుగు విందు భోజనం, వంటలు గురించి వివరిస్తూ ఫెస్టివల్ మూడ్‌లో సాగింది. ఈ చిత్రంలో మాళవికా నాయర్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. నరేశ్, రాజేంద్రప్రసాద్, రావు రమేశ్, గౌతమి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని స్వప్నాదత్, ప్రియాంకా దత్ స్వప్నా సినిమా బ్యానర్‌పై మిత్రవింద ఫిలిమ్స్ బ్యానర్‌తో కలిసి తెరకెక్కిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

'సైయారా..సైయారా'

సీనియర్ మేకప్ మేన్ బొమ్మదేవర రామచంద్రరావు కుమారుడు తేజ్ బొమ్మదేవరను హీరోగా పరిచయం చేస్తూ స్వీయ దర్శకత్వంలో 'మాధవే మధుసూదన' సినిమాను నిర్మిస్తున్నారు. రిషిక లోక్రే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలోని సెకండ్ లిరికల్ సాంగ్‌ను హాస్యనటుడు బ్రహ్మానందం విడుదల చేశారు. తేజ్ కొత్తవాడైనా యాక్టింగ్, డ్యాన్స్ బాగా చేశాడు. వికాస్ బాడిస సంగీతం అందించారు. పాటను వైష్ణవి కొవ్వూరి పాడారు. మిగిలిన పాటలు త్వరలో విడుదల చేస్తున్నట్లు దర్శక, నిర్మాత రామచంద్రరావు తెలిపారు.



మళ్లీ గెలిపించిన రస్సెల్

పంజాబ్ కింగ్స్‌పై ఐదు వికెట్ల తేడాతో కోల్‌కతా విజయం



ఆండీ రస్సెల్(42పరుగులు) 23బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సర్లు

కోల్‌కతా: ప్లే ఆఫ్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ సత్తా చాటింది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు ఐదు వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై గెలిచి ప్లే-ఆఫ్స్ రేసులో నిలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 179పరుగులు చేసింది. ఛేదనలో కోల్‌కతా జట్టు చివరి వరకూ పోరాడి 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసి గెలిచింది. చివరి బంతికి 2 పరుగులు అవసరమైన దశలో రింకూ సింగ్ ఫోర్ కొట్టి కోల్‌కతాకు విజయాన్ని చేకూర్చాడు. దీంతో కోల్‌కతా జట్టు పాయింట్ల పట్టికలో 5వ స్థానానికి ఎగబాకింది.

ఇక టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌ను కెప్టెన్ ఓపెనర్ శిఖర్ ధావన్(57: 47 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్స్) అర్ధసెంచరీకి తోడు, చివర్లో షారుక్ ఖాన్(21), హర్‌ప్రీత్ బ్రార్(17) బ్యాటింగ్‌లో ధనాధన్ ఆడారు. హర్షిత్ రానా వేసిన 20వ ఓవర్లో షారుక్ ఖాన్(21) కొట్టాడు. తొలి బంతికి లాంగాన్‌లో సిక్సర్ కొట్టిన షారుక్.. రెండు, మూడు బంతుల్ని బౌండరీకి తరలించాడు. హర్‌ప్రీత్ బ్రార్(17) ఐదో బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. దీంతో 21 పరుగులు వచ్చాయి. టాస్ గెలిచిన పంజాబ్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ ప్రభుసిమ్రాన్ సింగ్(12), భానుక రాజపక్సే(0)ను వరుస ఓవర్లలో హర్షిత్ రానా పెవిలియన్ పంపాడు. పవర్ ప్లేలో దంచి కొట్టిన విధ్వంసక ఆటగాడు లివింగ్‌స్టోన్(15), జితేశ్ శర్మ(21), రిషి ధావన్(19)లను వరుణ్ చక్రవర్తి ఔట్ చేశాడు. ఆఖర్లో హర్‌ప్రీత్ బ్రార్(12), రెండు షారుక్ ఖాన్(6) ధనాధన్ ఆడి పంజాబ్‌కు పోరాడగలిగే స్కోర్ అందించారు.


ఛేదనలో కోల్‌కతా ఓపెనర్ జేసన్ రాయ్(38), నితీశ్ రాణా(51), రస్సెల్(42), రింకూ సింగ్(21నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. రాహుల్ ఛాహకు రెండు వికెట్లు లభించాయి.

డబ్ల్యుటిసి ఫైనల్‌కు రాహుల్ స్థానంలో ఇషాన్



ముంబయి: ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ (డబ్ల్యుటిసి) ఫైనల్ భారతజట్టులో ఇషాన్ కిషన్‌కు చోటు దక్కింది. కేఎల్ రాహుల్ గాయం కారణంగా డబ్ల్యుటిసి ఫైనల్‌కు దూరం కావడంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్ చోటు కల్పిస్తున్నట్లు బిసిసిఐ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 'కేఎల్ రాహుల్ గాయం తీవ్రంగా ఉన్న కారణంగా అతడు డబ్ల్యుటిసి ఫైనల్‌నాటికి కోలుకొనే ఛాన్స్ లేదని, అందుకే ముందుగా అతని స్థానంలో ఇషాన్ కిషన్‌కు చోటు కల్పిస్తున్నట్లు పేర్కొంది.

ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ జాతీయ రికార్డు



న్యూఢిల్లీ: ట్రిపుల్ జంపర్ ప్రవీణ్ చిత్రవేల్ జాతీయ రికార్డును బద్దలు కొట్టి 2023 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ అర్హత ప్రమాణాలను కూడా అందుకున్నాడు. క్యూబాలోని హవానాలో జరుగుతున్న ఈవెంట్లో ప్రవీణ్ 17.37మీటర్లతో అగ్రస్థానంలో నిలిచాడు. దీంతో రెంజిత్ మహేశ్వరి పేరిట ఉన్న జాతీయ రికార్డు(17.30మీ, 2016)ను అధిగమించాడు. ఇదే ఈవెంట్లో 16.58మీ ప్రదర్శనతో సెల్వ బాబు నాలుగో స్థానం సాధించాడు. అతడు అండర్-20 జాతీయ రికార్డును బద్దలు కొట్టాడు. లాస్ ఏంజిలెస్‌లో జరిగిన ట్రాక్ ఫెస్టివల్‌లో అవినాష్ సబ్లే పురుషుల 5000మీ స్టీపుల్ చేజ్‌లో జాతీయ రికార్డు (13:19.30) నెలకొల్పాడు. రేసులో అతడు 12వ స్థానం సాధించాడు. మహిళల స్టీపుల్ చేజ్‌లో పారుల్ చౌదరి (15:10:35) జాతీయ రికార్డు నెలకొల్పింది.

సవితకు పగ్గాలు

ఆస్ట్రేలియా పర్యటనకు మహిళల హాకీ జట్టు ఇదే!



భువనేశ్వర్: ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లే భారత హాకీ మహిళల బృందానికి గోల్‌కీపర్ సవిత సారథ్యం వహించనుంది. ఆసీస్ పర్యటనకు వెళ్లే భారత హాకీ జట్టును హాకీ ఇండియా (హెచ్ఐ) సోమవారం ప్రకటించింది. 20మంది ఆటగాళ్ల బృందానికి సవిత కెప్టెన్‌గా, దీపక్ గ్రేస్ ఎక్కా వైస్ కెప్టెన్లుగా ఎంపికయ్యారు. మే 18నుంచి ఆడిలైడ్‌లో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. 2022 ఏడాది బల్బీర్ సింగ్ సీనియర్ హాకీ 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ (2022)అవార్డు'ను సవిత అందుకున్నా రు. ఇక బిచ్ఛూ దేవి ఖరిబమ్ రెండో గోల్‌కీపర్‌గా ఎంపికైంది. మహిళల హాకీ జట్టు మే 18, 20, 21న ఆస్ట్రేలియాతో, అలాగే ఆస్ట్రేలియా-ఏతో 25, 27న ఆడిలైడ్ స్టేడియంలో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆడనుంది.

జట్టు..

గోల్‌కీపర్లు: సవిత దేవి, బిచ్ఛూదేవి ఖరిబమ్ **డిఫెండర్లు:** దీప్ గ్రేస్ ఎక్కా, నిక్కి ప్రధాన్, ఇషికా చౌదరీ, ఉదిత, గుర్జీత్ కౌర్ **మిడ్‌ఫీల్డర్లు:** నిషా, నవ్‌జ్యోత్ కౌర్, మోనిక, సలీమా, నేహా, నవ్‌నీత్ కౌర్, సోనికా, జ్యోతి, బల్జీత్ కౌర్. **ఫార్వర్డ్స్:** వందన కటారియా, లాల్‌రెమిసిమి, సంగీత, షర్మిలా.

ఐపిఎల్‌లో నేడు..

ముంబయి × బెంగళూరు
(వేదిక: ముంబయి; రా.7.30గం॥లకు)

పాయింట్ల పట్టిక

ఫ్రాంఛైజీ	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	+0.95
చెన్నై	11	6	4	1	13	+0.40
లక్నో	11	5	5	1	11	+0.29
రాజస్తాన్	11	5	6	0	10	+0.38
కోల్‌కతా	11	5	6	0	10	-0.07
బెంగళూరు	10	5	5	0	10	-0.20
పంజాబ్	11	5	6	0	10	-0.44
ముంబయి	10	5	5	0	10	-0.45
హైదరాబాద్	10	4	6	0	8	-0.47
ఢిల్లీ	10	4	6	0	8	-0.52

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68